

గన్స్ ఇన్ ది నైట్
MVS
PUBLICATIONS
మధుబాబు

# గన్స్ ఇన్ ది నైట్

ఖాఖాన్ బంగ్లాను చుట్టు ముట్టాయి కొండల మీది నుంచి క్రిందికి వచ్చిన చల్లటి పిల్లగాలి తెరలు. వాటికి స్వాగతం యిస్తున్నట్లు మృదువైన శబ్దాలు చేస్తూ, అల్లల్లాడాయి బంగ్లా కిటికీలకు తగిలించి వున్న సిల్కు తెరలు.

పడక గది దగ్గిర నిలబడి చూస్తున్న ఖాఖాన్, గుండెల నిండుగా ఆ గాలిని పీల్చుకొని తృప్తిగా నిట్టూర్చాడు.

మూడు మంచాలు వేసి వున్నాయి ఆ గదిలో. ఒక దాని మీద అతని భార్య సూసీ నిద్రిస్తున్నది. ఐదు సంవత్సరాల వయస్సున్న అతని కుమార్తె లులూ తల్లిని కౌగిలించుకొని గాఢ నిద్రపోతున్నది.

రెండవ మంచం మీద వున్నాడు ఎనిమిది సంవత్సరాల టెమూ. మూడవ మంచం ఖాఖాన్ కోసం ఎదురుచూస్తున్నది.

బంగ్లా అంతా చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశబ్దంతో నిండివుంది. రాత్రి పన్నెండు గంటలదాకా పాటలు, పద్యాలతో కాలక్షేపం చేసే సేవకులకు ఆ రోజు శలవు రోజు. అందరూ కట్ట కట్టుకొని ప్రక్క గ్రామంలో నడుస్తున్న నాటకాన్ని చూడటానికి పోయారు. తెల్లగా తెల్లవారితే గాని తిరిగిరారు.

కిటికీలోంటి కనిపిస్తున్న సెలెంగా నదిని చూసి మరోసారి ఆనందంగా తలవూపాడు ఖాఖాన్. ఎప్పుడూ వరదలు వెల్లువలతో నిండి వుండే ఆ నదీమతల్లి ఆ సంవత్సరం మంగోలియా ప్రజల మీద జాలి చూపించింది.

బ్రహ్మాండంగా పండాయి పంటలు. బీటలు వారిన మైదానాలన్నీ పచ్చికతో నిండిపోయాయి. చిక్కి శల్యావస్థకు చేరుకున్న పశువులన్నీ కండపట్టి బాగుపడ్డాయి.

సెలెంగా నది చేస్తున్న మృదుమధుర శబ్దాలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. ఖాఖాన్ చెవులకు. ఉన్నట్లుండి అవి వినిపించకుండా పోయాయి.

వాటిని మించిన శబ్దాలు మరికొన్ని ఖాఖాన్ కర్ణేంద్రియాలను చేరుకున్నాయి.

ప్రకృతి సౌందర్యాలను చూసి పరవశించి పోతున్న ఖాఖాన్ వులిక్కి పడి కిటికీకి దగ్గిరగా వెళ్ళాడు.

పాతిక అశ్వాలు నదిని దాటి అతని బంగ్లా వైపే వస్తున్నాయి. వాటిని అధిరోహించి వున్న దృఢకాయుల ముఖాలు సరిగ్గా కనిపించడం లేదు.

కనులు చిట్లించుకొని చూశాడు ఖాఖాన్. బంగ్లా యింకో రెండు ఫర్లాంగుల దూరం వున్నదనగా, అశ్వాలను ఆపి క్రిందికి దూకారు వారందరూ. ఇద్దరు వ్యక్తులు అశ్వాలతో అక్కడే నిలబడిపోయారు. మిగిలిన వారందరూ తమ ఆయుధాలను భుజాల మీద వేసుకొని బంగ్లా వైపు వస్తున్నారు.

ఆకాశం మధ్య వున్న అర్ధచంద్రుడి మసక వెలుగు పడి డల్‌గా మెరుస్తున్నాయి ఆ ఆయుధాలు. అత్యంత ఆధునికమైన హైపవర్ రైఫిల్స్ అవి.

బంగ్లాకు వంద గజాల దూరంలోకి వచ్చారా వ్యక్తులు. కిటికీ దగ్గర్నుంచి వెనక్కు జరిగాడు ఖాఖాన్. వేగంగా కొట్టుకోవటం ప్రారంభించాయి అతని గుండెలు.

గబగబా పోయి తన మంచం తలగడ వైపు వున్న గోడమీది షాట్ గన్‌ను క్రిందికి దించాడు. దాన్ని ఓపెన్ చేసి అక్కడే అలమరాలో వున్న రెండు తూటాలను బారెల్స్‌లోకి తోశాడు. గన్ క్లోజ్ చేస్తున్న శబ్దం అతని భార్యకు నిద్రాభంగాన్ని కలిగించింది.

"సూసీ... తెరీవా రాక్షసులు పాత పగలను తీర్చుకునేటందుకు వచ్చారు..." ముఖద్వారం వైపు అడుగులు వేస్తూ ఆమెతో అన్నాడు ఖాఖాన్.

ముఖంలో ఎటువంటి భావాలను కనిపించనీయకుండా, మంచం దిగింది సూసీ. గోడమీదేవున్న మరో షాట్ గన్‌ని అందుకొని తూటాలు ఎక్కించింది.

బంగ్లా ముందు నిలబడ్డారు... అశ్వాల మీద వచ్చిన వారందరూ.

"ఖాఖాన్: బయటికి రా ఖాఖాన్!!!" బంగ్లా పై కప్పు లేచిపోయేటట్లు అరిచాడు వారిలో ఒక వ్యక్తి.

షాట్ గన్‌ని కుడిచేతిలో వుంచుకొని ఎడమ చేత్తో తలుపులు తెరిచాడు ఖాఖాన్.

"సూసీ... పిల్లల్ని బయటికి పంపించు... ఎటు పోయి ఎటువస్తుందో చెప్పలేను. మన సేవకులు లేని సమయాన్ని చూసి వచ్చారు వీళ్ళు.

మాటలతో వెనక్కి పోరు..." భుజం మీది నుంచి భార్యను హెచ్చరించి బంగ్లా ముందు భాగం అడుగుపెట్టాడు.

దడ దడ లాడుతున్న గుండెలతో పోయి టెమూను లేపింది సూసీ.

"టెమూ, మన యింటిని శత్రువులు చుట్టు ముట్టారు. నేను, మీ నాన్న వారిని ఎదిరించి వెనక్కు తరిమేస్తాం. అంత వరకూ నువ్వు చెల్లాయిని వెంటబెట్టుకొని నది వడ్డున కూర్చో. ఎవరికీ కనిపించకుండా మన యింటి వెనుక వున్న చెట్ల గుంపు మధ్య నుంచి వెళ్ళండి..." అంటూ ఒక మూలగా వున్న టేబిల్ వైపు నడిచిందామె.

లులూను నిద్ర లేపుతున్నాడు టెమూ. ఆమె 'అమ్మా' అని పెద్దగా పిలవబోతుంటే నోటిమీద వేలు వుంచి మాట్లాడ వద్దని సైగ చేస్తున్నాడు.

అన్న చెపితే ఏపని అయినా చేసేస్తుంది లులూ. పెద్దపెద్ద కాటుక కళ్ళను మరింత పెద్దవి చేసి, ఆశ్చర్యంగా తన తల్లివైపు చూసింది.

టేబిల్ మీద వున్న లెటర్ పాడ్ అందుకొని ఏదో వ్రాస్తున్నది ఆమె. అర నిముషంలో ఆ పని ముగించి టెమూను దగ్గరికి పిలిచింది.

"మీ కోసం నేను, నాన్న యిద్దరం వచ్చేదాకా, నది వడ్డును వదిలి యిటువైపు రాకండి. ఇక్కడ ఏం జరిగినా సరే మీరు చూడనట్లే ప్రవర్తించండి" అంటూ ఇంక్ చేసిన కాగితాన్ని చించి ఒక కవర్‌లో యిన్‌సర్ట్ చేసి టెమూ జేబులో పెట్టింది.

"ఖాఖాన్! ఇంతకాలం శక్తి లేని వాళ్ళలా కొండలు గుట్టలు పట్టుకొని తిరిగి ప్రాణాలు నిలుపుకున్నాం. మా తండ్రిని జైలుకు పంపించి, మా

వంశానికి తీరని అపకీర్తిని ఆపాదించావ్ నువ్వు. ఈ తెరీవా వంశానికి మాయని మచ్చని అంటించావ్. ఈ రోజుతో అది తొలగిపోతుంది." పెద్దగా అరుస్తున్నారు బంగ్లా ముందు నిలబడిన వ్యక్తులు.

"పొండి... వెంటనే బంగ్లాను వదిలిపెట్టి పొండి..." పిల్లల్ని హెచ్చరించింది సూసీ. లులూ చేయి పట్టుకొని వెనుక గదుల వైపు పరుగెత్తాడు టెమూ.

టేబిల్ కి ఆనించిన షాట్ గన్‌ని అందుకొని ముందు గదిలోకి వచ్చింది సూసీ. ముఖ ద్వారానికి ఎదురుగా కుర్చీని లాక్కుని అందులో కూర్చున్నది.

ఉన్నట్లుండి ధన్‌మని ప్రేలింది ఒక రైఫిల్. వెన్వెంటనే భయంకరంగా గర్జించింది మరొక తుపాకీ.

షాట్ గన్ మ్రోత అది. గుండెలను జలదరింపచేసే రెండు ఆర్తనాదాలు సూసీ చెవులను చేరాయి.

మరోసారి మ్రోగింది మొదటి రైఫిల్. సమాధానం యిచ్చింది షాట్ గన్. దాని ధ్వని గాలిలోకి ఎగిరి పోతుండగా, దబ్‌మని బరువైన వస్తువేదో నేలమీద పడిన శబ్దం వినిపించింది.

తన భర్త నేల కూలిపోయినట్లు గ్రహించటానికి సూసీ ఎంతోసేపు వేచివుండాల్సిన అవసరం లేకపోయింది. తలుపుల్ని విరగదన్ని లోపలికి అడుగుపెట్టారు నలుగురు దృఢకాయులు.

లోపలి ద్వారానికి అడ్డంగా- కూర్చుని వున్న సూసీని చూడగానే ఆశ్చర్యంతో ఎక్కడి వారక్కడ ఆగిపోయారు.

"ప్రాణానికి ప్రాణం బలిపుచ్చుకోవటమే కక్ష తీర్చుకోవటానికి అర్థం అని మీరు అనుకుంటే, నా భర్తను చంపిన మరుక్షణం మీ కక్ష తీరిపోయింది. మీరు వచ్చిన పని పూర్తి అంది. ఇక మర్యాదగా వెనక్కి తిరగండి" నిర్భయంగా, జంకూ గొంకూ లేకుండా అన్నది సూసీ.

"వాహ్! ఒక ఆడది!! అందమైన ఆడది!!!" పెదిమలను నాలుకతో తడుపుకుంటూ కామెంట్ చేశాడు ఒక దృఢకాయుడు.

"బంగ్లాలో వున్న వస్తువులన్నింటినీ మీరు పంచుకోండి...నాకు యీ పిట్టను వదిలిపెట్టండి..." అంటూ ముందుకు అడుగు వేశాడు రెండవ దృఢకాయుడు.

వళ్ళో పెట్టుకున్న షాట్ గన్‌ని ఎత్తి ట్రిగ్గర్ నొక్కింది సూసీ.

గది గోడలకు తగిలి భీకరంగా ప్రతిధ్వనించింది దాని మ్రోత. నిప్పు రవ్వలను నలు దిక్కులకు వెదజల్లుతూ పోయి ఆ వ్యక్తి గుండెల్లో దిగబడింది మొదటి తూటా. కెవ్వున అరిచాడతను. గాలిలోకి ఎగిరి, గోడను గుద్దుకున్నాడు. అరుస్తుండగానే అనంత విశ్వంలోకి ఎగిరి పోయాయి అతని ప్రాణవాయువులు.

"ఇది ఆడది కాదు... దీన్ని యింత తేలికగా వదలకూడదు..." అని అరుస్తూ ఒక్కసారిగా ముందుకు దూకారు మిగిలిన వారందరూ.

తెరీవా గుంపు చేతికి ఒక్క ఆడమనిషి దొరికితే ఫలితం ఎలా వుంటుందో సూసీకి బాగా తెలుసు.

మెరుపులా గన్ బారెల్ని ఎత్తి కణతకు ఆనించుకొని, ట్రిగ్గర్ ని నొక్కింది సూసీ... అందులోని ఆఖరి తూటా ప్రేలటం, ఆమె ప్రాణాలు పోవటం ఒకేసారి జరిగాయి.

నిర్ఘాంతపోయారు ముందుకు దూకిన ముగ్గురు దృఢకాయులు. రాతి బొమ్మల్లా ఎక్కడి వారక్కడ నిలబడి, తమ కళ్ళను తామే నమ్మలేక విచిత్రంగా చూస్తూ వుండి పోయారు.

లోపలి గది కర్టెన్ చాటున నిలబడి ఆ దృశ్యాన్ని చూస్తున్న టెమూ - తల్లి చేతుల్లో వున్న షాట్ గన్ జారి క్రింద పడిపోవటం గమనించాడు. ఆమె తల ముందుకు వాలిపోవడాన్ని వీక్షించగానే 'అమ్మా!' అని అరిచాడు బిగుసుకుపోతూ.

కొరడా పెట్టి కొట్టినట్లు అదిరిపడి అతని వైపు చూశారు ఆ దృఢకాయులు.

"పిల్లలు! ఖాఖాన్ పిల్లలు మనల్ని చూశారు... పట్టుకోండి..." పెద్దగా అరుస్తూ లోపలి గదుల వైపు బయలుదేరారు.

లులూ చేతిని పట్టుకొని గిరుక్కున వెనుతిరిగాడు టెమూ లేడి పిల్లలా పరుగెత్తి, యింటి వెనుక వున్న చెట్ల తోపులోకి పోయారు వారిద్దరూ.

"పట్టుకోండి! వారిద్దరినీ పట్టుకోండి!!" దిక్కులు దద్దరిల్లేటట్లు అరుస్తూ వెంబడించారు తెరీవా రాక్షసులు.

*"అన్నా! నా కాళ్ళు నొప్పి పుడుతున్నాయి రా..." పరిగెత్తలేక బాధగా అన్న ముఖంలోకి చూస్తూ అన్నది లులూ.*

*నది వడ్డుకు పోవాలన్న పట్టుదల అడుగులు వేస్తున్న టెమూ - లులూ మాటలతో తమ మనసును మార్చుకొని ప్రక్కకు పరుగుతీశాడు.*

*చెట్లతోపు మధ్యన ఒక నీటి గుంట వున్నది. దాని వడ్డు మీద అతి పురాతనమైన ఓక్ వృక్షం వుంటుంది. దాని మొదట్లో పెద్ద బొరియ కనిపిస్తుంది.*

*సరాసరి ఆ బొరియ దగ్గరికిపోయి లులూను అందులో దింపి, తను గూడా లోపలికి పోయి మోకరించి కూర్చున్నాడు టెమూ.*

*చెట్ల గుంపునంతా గాలించారు తెరేవా రాక్షసులు. ఓక్ చెట్టు దగ్గిర చాలా సేపు నిలబడి తమలో తాము మాట్లాడుకున్నారు.*

*దడదడ లాడుతున్న గుండెలతో, వూపిరి బిగపట్టి ముంగాళ్ళ మీద కూర్చున్నాడు టెమూ. వారి మాటలవల్ల తమ బంగ్లా అగ్నికి ఆహుతి అవుతున్నట్లు అతనికి తెలిసింది. బంగ్లానంతా దోచుకొని కర్టెన్లకు నిప్పు ముట్టించారట ఆ దుర్మార్గులు.*

*ఉబికి వస్తున్న దుఃఖాన్ని అణిచి పెట్టుకుంటూ, నిముషాలను దొర్లించాడు టెమూ. తూర్పు దిక్కున తొలి వెలుగులు ప్రత్యక్షం అవుతుండగా, ఎలా వచ్చిన వాళ్ళు అలాగే హఠాత్తుగా మాయమై పోయారు తెరేవా ముఠా వారందరూ.*

నిద్రపోతున్న లులూను భుజం మీద వేసుకొని, బొరియలో నుంచి బయటికి వచ్చాడు టెమూ. అడుగులో అడుగు వేస్తూ,చెట్ల గుంపును దాటి తమ బంగ్లాను సమీపించాడు.

ఏమున్నదక్కడ! నల్లటి పొగలను వెలువరుస్తున్న బొగ్గుల గుట్టలు, మొండి గోడలు అతనికి కనిపించాయి.

తన తల్లిదండ్రుల శరీరాలు ఆ మంటల్లో పడి భస్మమై పోయి వుంటాయని గ్రహించగానే టెమూ కళ్ళముందున్న ప్రపంచం అంతా ఒక్కసారిగా గిర్రున తిరిగింది. 'నాన్న! ' అని వెర్రిగా అరిచి ఎలా వున్నవాడు అలాగే విరుచుకు పడిపోయాడు.

అతని భుజం మీద వున్న లులూకు బలమైన దెబ్బ తగిలింది.

"అన్నా! అన్నా!!" అని ప్రాణాలు కడబట్టేటట్లు ఏడ్చిందా పసిబిడ్డ.

ఆమె ఏడుపుల్ని ఆలకించే నాథుడు అక్కడ ఎవరు లేరు. ఖాఖాన్ బంగ్లాకు చుట్టుపట్ల పది మైళ్ళ వరకూ మరో యిల్లు అనేది లేదు.

ఏడ్చి ఏడ్చి తను గూడా తెలివి తప్పి పడిపోయింది లులూ.

నాటకాన్ని చూసి తిరిగి వచ్చిన ఖాఖాన్ సేవకులకు కనిపించిన దృశ్యం అది.

***

"బట్టలన్నీ సర్దుకున్నావా!" ఆరిపోయిన సిగార్‌ని వెలిగించుకోవటానికి నాలుగో అగ్గిపుల్లను వుపయోగిస్తూ అడిగారు కులకర్ణి.

టేబిల్ ముందు కూర్చుని ఆయన అందించిన ఫైళ్ళను తిరగేస్తున్న షాడో తల వూపాడు బుద్ధిగా.

పారిస్‌లో ఇంటర్‌పోల్ డిటెక్టివ్ కాన్ఫరెన్స్ ప్రారంభం కాబోతున్నది. భారత ప్రభుత్వం తరఫున డెలిగేట్ హోదాలో అందులో పాల్గొనబోతున్నాడు షాడో.

"ప్రపంచంలో వున్న పెద్ద పెద్ద డిటెక్టివ్‌లందరూ వస్తారక్కడికి. వాళ్ళతో కాస్త డిగ్నిఫైడ్‌గా వ్యవహరించాలి నువ్వు. నీ టైట్ పాంటులు, చారల షర్టులు అక్కడ పనికిరావు. టై కట్టుకోకపోతే అందరూ వింతగా చూస్తారు" స్కూలు పిల్లలకి హెడ్ మాస్టర్ బుద్ధి చెపుతున్నట్టు ఓపికగా వివరించారు కులకర్ణి.

ఫైళ్లలో నుంచి తల ఎత్తకుండా అర్థం అయినట్లు తలాడించాడు షాడో.

"ఎట్టి పరిస్థితిలోను నువ్వు అక్కడికి వచ్చే లేడీ డిటెక్టివ్‌ల జోలికి పోకూడదు. వాళ్ళు మాట్లాడించినా, తల వంచుకుని యివతలికి వచ్చేయాలి" ఆఖరి పాయింట్‌ని వెల్లడించారాయన.

ఆ మాటకు కూడా తన అంగీకారాన్ని తెలియచేశాడు షాడో.

"నీ వ్యవహారం చూస్తుంటే యీ సారి కాన్ఫరెన్స్‌లో మన పరువులు నట్టేట్లో మునిగి పోయేటట్లున్నాయి. మార్పులు చేయటానికి వ్యవధి లేదు. వుంటే ఖచ్చితంగా మరో మనిషిని పంపేవాణ్ణి" సిగార్‌ని అవతలకు విసిరేస్తూ ఖచ్చితమైన అభిప్రాయాన్ని వినిపించాడు కులకర్ణి.

ఆ మాటలకు కూడా తలవూపేశాడు షాడో.

గుర్రుగా చూస్తూ ఏదో అనబోయారు కులకర్ణి. అదే సమయంలో, తలుపులు తెరుచుకొని లోపలికి వచ్చింది ఆయన సెక్రటరీ సులోచన.

"రాజూ! నీకో లెటర్ వచ్చింది. ఇటీజ్ ఫ్రమ్ మంగోలియా..." అంటూ ఒక కవర్ ని షాడో చేతికి అందించింది.

"మంగోలియాలో నీకు లెటర్స్ వ్రాసే వాళ్ళు ఎవరున్నారు?" కనుబొమ్మల్లో నుంచి సీరియస్ గా చూస్తూ అడిగారు కులకర్ణి.

కవర్ని ఓపెన్ చేసి అందులో వున్న కాగితాన్ని బయటికి లాగాడు షాడో.

ఏదో అనటానికి ప్రయత్నించారు కులకర్ణి. షాడో వదనంలో చోటుచేసుకుంటున్న భావాలను గమనించగానే ఆయన నొసలు నిజంగానే ముడిపడింది.

"వాట్ రాజూ? వాట్ హేపెన్డ్?" అంటూ లేచి షాడో దగ్గిరికి వచ్చారు.

పళ్ళు బిగబట్టి తన బాధను తనలోనే దాచుకుంటూ, ఆ కాగితాన్ని కులకర్ణిగారికి అందించాడు షాడో.

"రాజూ! ఇంటిముందు గుంపుకట్టి సవాల్ చేస్తున్నారు తెరీవా వంశీయులు. పాత పగలను తీర్చుకోవటానికి వచ్చారు వారందరూ. నీ స్నేహితుడు వారిని ఎదిరించటానికి వెళ్ళాడు. లులూ, టెమూలాను యీ లెటర్తో నది ఒడ్డుకు పంపిస్తున్నాను. ఇది నీకు అందకూడదనే ఆ భగవంతుడిణ్ణి ప్రార్థిస్తున్నాను. అందటమే సంభవిస్తే --- నేను భర్త

పైలోకాలకు వెళ్ళడం జరిగిందని తెలుసుకో. మా పిల్లల భవిష్యత్ అప్పుడు నీ చేతిలో వున్నట్టు లెక్క. వుంటాను రాజూ...

నీ సోదరి... సూసీ."

"మై గాడ్! వారం రోజుల క్రితం పోస్ట్ చేయబడింది..."

కామెంట్ చేశారు కులకర్ణి,

ఆ మాట వినిపించనట్లే ఎదుట గోడకు వ్రేలాడుతున్న ఫోటోలను చూస్తూ వుండిపోయాడు షాడో.

కళ్ళు మాత్రమే వాటిని చూస్తున్నాయి. అతని మనోనేత్రం ముందు ఖాఖాన్ దంపతులు కదలాడుతున్నారు.

"ఈసారి మగపిల్లాడు పుడితే ఖచ్చితంగా వాడి పేరు షాడో అని పెడతాను. ఎవడు కాదని అంటాడో చూస్తా..." తను, అభ్యంతరం చెప్పబోతుంటే... హాట్ గా అన్నాడు ఖాఖాన్ రెండు సంవత్సరాల క్రితం.

ఇంటర్‌పోల్ అంటగట్టిన ఎస్సైన్‌మెంట్ మీద మంగోలియా వెళ్ళాడు తను. తెరీవా అనబడే మంగోలియన్ బందిపోటులను వెతికి వేటాడటంలో ఖాఖాన్‌కి సాయం చేశాడు. అప్పుడు మంగోలియన్ ఆర్మీలో ఒక పెద్ద పదవిలో వున్నాడు ఖాఖాన్. తెరీవా కులపెద్ద పట్టుబడగానే తన పదవికి రాజీనామా యిచ్చి భార్యా పిల్లలతో సెలెంగా నది వడ్డున వున్న తమ ఎస్టేట్‌కి వెళ్ళిపోయాడు.

అతని భార్య సూసీ పూర్వీకులు భారతదేశం నుండి మంగోలియా వలస పోయిన వారట. ఆమెలో భారతీయుల సంస్కృతి యిమిడి వుంది. భారత దేశమన్నా, భారతీయులన్నా చెప్పరాని మక్కువ చూపిస్తుంది.

"అంకుల్, అంకుల్!" అంటూ వెంటబడేవాడు. వారి కొడుకు టెమూ. మాటలు రాని లులూ పారాడుతూ వచ్చి తన భుజం మీద ఎక్కి కూర్చునేది.

ఇప్పుడు దిక్కు లేని వాళ్ళయినారా ఆ పసిబిడ్డలు?

"ఏం చేద్దాం రాజూ! ఇప్పుడు మనం తీసుకోవాల్సిన స్టెప్ ఏమిటి?" అంటూ షాడో ఆలోచనలకు అంతరాయాన్ని కలిగించారు కులకర్ణి.

సాలోచనగా నుదురు రుద్దుకుంటూ టేబిల్ మీది ఫోన్ ఎత్తి, మరేదో ఆలోచన వచ్చి దాన్ని క్రెడిల్ చేసేశారు.

ఇంటర్‌కామ్ బటన్ నొక్కి "సులోచనా! ముఖేష్‌ని వెంటనే పిలిపించు... వెరీ అర్జంట్..." అని ఆర్డర్ పాస్ చేశారు.

ఆ మాటలు పూర్తికాకముందే గదిలో ప్రత్యక్షమయ్యాడు ముఖేష్ "ఇక్కడే వున్నాను బాస్!" అంటూ. అతని వెనుకే వచ్చాడు జూనియర్ శ్రీకర్.

"రేపు పారిస్ కాన్ఫరెన్స్‌కి మీరిద్దరిలో ఎవరు పోతారు?" అడిగారు కులకర్ణి.

"ముఖేష్ పోతాడు బాస్... నాకు వంట్లో బాగోలేదు. అదీకాక పారిస్ వాతావరణం నాక సరిపడదని మన మెడికల్ సెక్షన్ వాళ్ళు చెప్పారు." తక్కున సమాధానం యిచ్చాడు శ్రీకర్.

"నేనా! యింకా నయం... ఈ కాన్ఫరెన్స్‌లకు, మీటింగ్‌లకు పోవటం నావల్ల కాదు. ఇంకెవరినయినా పంపించండి.. నాకు అర్జెంటు పని ఒకటి వుంది" అన్నాడు. ముఖేష్.

"ఏమిటా అర్జంట్ పని?" కోపం తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ ప్రశ్నించారు కులకర్ణి.

"మంగోలియాలో మా అత్త కూతురు వుంది... చూసి రావాలి"

"రాస్కెల్స్... ఇడియట్స్... అసలు మీతో మాటలు పెంచుకోవటమంత న్యూసెన్స్ మరొకటి లేదు. మంగోలియా వెళ్ళి ఆ పిల్లల్ని ఇక్కడికి తీసుకొస్తాడు రాజు. అప్పుడు మీరు అందరూ కలిసి వారిని సాకుదురు గాని, అంతవరకూ నేను చెప్పినట్లు చేయండి. మీరిద్దరూ ఈ రోజే పారిస్ బయలుదేరండి. సులోచన మీకు కావాల్సిన పేపర్స్ సమకూరుస్తుంది. రాజు, నేను రష్యన్ ఎంబసీకి పోయి అన్ని విషయాలను సరిచూస్తాం". కోపంగా అనాలని ఎంత ప్రయత్నించినా కులకర్ణిగారి కంఠంలో ఆ భావం ధ్వనించలేదు.

"డామిట్... రాను రాను సి.ఐ.బి. ఒక వెల్‌ఫేర్ ఆర్గనైజేషన్‌గా తయారౌతుంది. ఎక్కడో ఎవరికో కష్టం వస్తే... ఇక్కడున్న వాళ్ళందరూ అక్కడికి పోవటానికి రెడీ అవుతున్నారు..." అనుకుంటూ కుర్చీ మీద వేసిన

కోటును అందుకొని బయలుదేరాడు ఆయన. మౌనంగా అనుసరించాడు షాడో.

మంగోలియా చేరుకోవాలంటే ప్రస్తుతం వున్న పరిస్థితుల్లో - రష్యా భూభాగం మీదుగానే ప్రయాణం చేయాలి. అందుకు ఆ ప్రభుత్వపు పర్మిషన్ తీసుకోవాలి.

"వాట్! కర్నల్ ఖాఖాన్ మరణించాడా! తెరీవా బందిపోట్లు తిరిగి వెలుగులోకి వచ్చారా? డామిట్... వాళ్ల అంతు చూడకపోతే మరోసారి మంగోలియాలో అల్లకల్లోలాలు ప్రజ్వరిల్లుతాయి... మిస్టర్ రాజూ... నువ్వు ఎప్పుడు ప్రయాణానికి సిద్ధమైతే ఆ క్షణానికి మా ఎంబసీ విమానం రెడీగా వుంటుంది. నువ్వు డైరెక్టుగా మంగోలియా వెళ్ళిపోవచ్చు..." కులకర్ణిగారి మాటలు విని షాడో వంక చూస్తూ అన్నాడు రష్యన్ ఎంబసీ అధికారి ఒకరు.

"ఈ విషయం మీ ప్రభుత్వానికి తెలియచేస్తే బాగుంటుందని అభిప్రాయ పడుతున్నాను నేను..." అన్నారు కులకర్ణి.

"మిష్టర్ కులకర్ణీ! మీరు నన్ను టెస్ట్ చేయటానికి యిలా మాట్లాడుతున్నారని అనిపిస్తోంది. షాడో మీ సి.ఐ.బి. లో ఏజెంట్ మాత్రమే కాదు. మా రష్యన్ నావీలో ఆనరరీ రియర్ ఎడ్మిరల్. అతను ఎప్పుడు ఎక్కడికి పోవాలన్న, ట్రాన్స్‌పోర్టేషన్ సమకూర్చవలసిన బాధ్యత రష్యన్స్ అందరి మీదా వున్నది. ఇందుకు ప్రభుత్వాన్ని సంప్రదించవలసిన అవసరం లేదు." అన్నాడతను హర్ట్ అయినట్లు ముఖంపెట్టి.

"సార్! బిందుకు ఫోన్ చేసి చెప్పండి... నేను ఇప్పుడే బయలుదేరుతున్నాను"... అనౌన్స్ చేశాడు షాడో.

కులకర్ణిగారు ఎక్కిన వైట్ అంబాసిడర్ సి.ఐ.బి. హెడ్ క్వార్టర్స్ వైపు బయలుదేరింది. ఎంబసీకి సంబంధించిన ఓల్గా మినీ బస్ ఒకటి షాడోను ఎయిర్‌పోర్టు వైపు తీసుకుపోయింది.

## 2

మంగోలియా ముఖ్యపట్టణమైన ఉలన్ బతార్ నగరం అది. ఆ నగరానికి రెండు మైళ్ళ దూరంలో అందమైన పూలతోట మధ్య కట్టబడి వుంది జనరల్ హాస్పటల్. చిల్డ్రన్స్ వార్డులో ఒక స్పెషల్ రూమ్ ముందు కూర్చుని కునికిపాట్లు పడుతున్నది ఒక నర్సు. ఉన్నట్లుండి ఆ గదిలో నించి వినవచ్చింది కెవ్వుమన్న శబ్దం.

అదిరిపడి కనులు తెరిచిందామె. హడావుడిగా లోపలకు పరుగుతీసింది.

"చంపేస్తున్నారు... అమ్మను చంపేస్తున్నారు... నాన్నా... అమ్మను చంపేస్తున్నారు..." అంటూ మంచం మీది నుంచి క్రిందికి దూకి ద్వారంవైపు వస్తున్న టెమూని గట్టిగా పట్టుకొని మంచం మీద కూర్చోపెట్టింది.

అక్కడే వున్న మరో బెడ్ మీద నిద్రపోతున్నది లులూ. తల్లి తండ్రుల మీద బెంగతో చిక్కిపోయిందా పసిబిడ్డ. అన్న అరుపులతో నిద్రాభంగమై లేచి కూర్చుని తను గూడా విలపించటం ప్రారంభించింది.

వారిద్దరినీ సముదాయించ లేక తత్తరపడసాగిందా నర్సు. లులూ, టెమూలకు తగిలిన మెంటల్ షాక్ నుంచి వారిని రక్షించటానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. హాస్పిటల్ లోని చిల్డ్రన్ స్పెషలిస్టులు.

ఎంత ప్రయత్నించినా టెమూను శాంతింపచేయటం సాధ్యపడక పోయేసరికి, ఒక యింజక్షన్ యిచ్చింది నర్సు దాని ప్రభావంవల్ల గాఢమైన నిద్రలో మునిగిపోయాడతను. అప్పటికీ వుండి వుండి కలవరించటం మానలేదు.

లులూను భుజం మీద వేసుకొని వార్డు ముందున్న పూలతోటలో పచార్లు చేస్తున్న నర్సుకు, తమ వార్డు సూపరిన్‌టెండెంట్ ఎవరో దృఢకాయుణ్ణి వెంటబెట్టుకొని అటుగా రావటం కనిపించింది.

"నర్స్! టెమూ పొజిషన్‌లో మార్పు ఏమయినా వచ్చిందా?..."ఎదురు వచ్చిన నర్సును ప్రశ్నించాడు ఆ డాక్టర్.

ఆమె భుజం మీద వున్న లులూ తల ఎత్తి డాక్టర్ ప్రక్కనే నిలబడివున్న దృఢకాయుడి వంక భయం భయంగా చూడసాగింది.

"ఏరా లులూ... అంకుల్‌ని గుర్తుపట్టలేదా?" మృదువుగా అడిగాడతను.

బావురుమంటూ చేతులు జాచి అతని మీదికి దూకింది లులూ. అతని మెడను కౌగలించుకొని పెద్దగా ఏడ్వసాగింది.

"రియల్లీ వండ్రఫుల్ సిచ్యుయేషన్, రెండు సంవత్సరాల క్రితం చూసిన వ్యక్తిని... మళ్ళీ గుర్తు పట్టటం రియల్లీ ఫెంటాస్టిక్... మిస్టర్ రాజూ! టెమూ కూడా మిమ్మల్ని గుర్తు పట్టగలిగితే అతనికి ఎటువంటి ప్రమాదమూ లేదు. రెండు మూడు నెలలలో అతని పొజిషన్ నార్మల్‌కి రావటానికి అవకాశం వుంటుంది."

లులూ తల నిమురుతూ, సముదాయిస్తున్న షాడోతో అన్నాడు. వార్డు సూపరిన్‌టెండెంట్. గదిలోకి పోయి మంచంమీద టెమూని చూశాడు షాడో... అదే సమయంలో మరోసారి ఫిట్‌కి గురి అయింది టెమూ అంతరంగం. నర్సు యిచ్చిన మత్తు యింజక్షన్ ఎందుకూ పనికిరాకుండా పోయింది. పెద్దగా అరుస్తూ... మంచం మీది నుంచి క్రిందికి దూకాడు టెమూ. చటుక్కున లులూను ఎడమ భుజం మీది నుంచి క్రిందికి మార్చుకొని, కుడిచేత్తో అతన్ని పట్టుకున్నాడు షాడో.

"టెమూ... ఎక్కడికి పోతున్నావ్? ఏమయింది?" అని అడిగాడు గంభీరంగా.

ఉలిక్కిపడి షాడో ముఖంలోకి చూశాడు టెమూ... రెండు క్షణాల పాటు సందేహించాడు. మూడవ క్షణంలో "అంకుల్!" అని పెద్దగా అరిచి షాడో నడుమును పెనవేసుకున్నాడు.

ద్వారంలో నిలబడి ఆత్రుతగా చూస్తున్న డాక్టర్ తేలికగా నిట్టూర్చి నెమ్మదిగా వెనుతిరిగాడు.

కర్మల్ ఖాఖాన్‌కి అంతులేని ఆస్తి వుంది. కాని అవసరంలో ఆదుకునే బంధువులు ఎవరూ లేరు... అన్నీ వుండి ఆఖరికి వచ్చి చూసే దిక్కులేని అనాధలయినారు అతని బిడ్డలు.

నో... కానేకాదు... ఎక్కడో వున్న భారత దేశం నుంచి కబురు అందిన మరుక్షణం రెక్కలు కట్టుకొని వచ్చి పడే స్నేహితులు వుండగా... ఖాఖాన్ బిడ్డలు అనాధలు ఎలా అవుతారు?

***

"మిష్టర్ రాజూ! మీ నిర్ణయాన్ని మార్చుకోండి" మరోసారి షాడోని కన్విన్స్ చేయటానికి ప్రయత్నించాడు మంగోలియన్ సి.ఐ.డి. చీఫ్.

సిగరెట్ పొగలను రింగులు రింగులుగా గాలిలోకి వదులుతూ... పక్కకు చూశాడు షాడో. అతన్ని ఆనుకొని కూర్చున్నది లులూ! ఆమె ప్రక్కనే వున్నాడు టెమూ. షాడో తీసుకొచ్చిన టార్జాన్ బొమ్మల పుస్తకంలోని బొమ్మల్ని శ్రద్ధగా చూస్తున్నారు వారిద్దరూ.

షాడో ఉలన్ బతార్ నగరానికి వచ్చి పదిహేను రోజులయింది అప్పటికి... లులూ, టెమూల పొజిషన్ మెరుగు పడేసరికి, హాస్పిటల్ నుంచి వారిని ఒక పెద్ద హోటల్‌కి తీసుకుపోయాడు షాడో.

ఎంత బాగుపడినా నిద్రలో కలవరించటం మానలేదు టెమూ, ఎవరైనా గట్టిగా మాట్లాడినా, పరీక్షగా తన వంక చూసినా, విపరీతంగా భయపడుతున్నాడు.

మంగోలియాలో పిరికి వాళ్ళు ఎంతోకాలం మనుగడ కొనసాగించలేరు. ఎడారులు, కొండలతో నిండి వున్న ఆ పీఠభూమి మీద ధైర్యం లేని వారికి స్థానం లేదు.

పచ్చ పాములాంటి ఖాఖాన్ కి పుట్టిన టెమూ... అలా పిరికివాడుగా మారటం... చాలా దాఋణం, అన్యాయం.

సూసీ వ్రాసిన లెటర్ కనులలో మెదిలి గాఢంగా నిట్టూర్చాడు షాడో. ఆమె తెలివి దూరదృష్టి అమోఘం. ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందని ముందే వూహించి తనకు లెటర్ వ్రాసింది.

టెమూ నిద్రలో ఎగిరెగిరి పడటం చూసినప్పుడు అతనికి అటువంటి గతి పట్టించిన ఆ తెరీవా హంతకుల అంతు చూడాలి అని పిచ్చి కోపంతో వూగిపోయాడు షాడో.

కాని పిల్లల సంరక్షణ బాధ్యత అతన్ని ఒక్క అడుగు కూడా అవతలకు వేయనీయలేదు. గుర్తుపట్టిన క్షణం నుంచి లులూ అతని భుజం వదిలి క్రిందికి దిగటం లేదు. మరెవ్వరి దగ్గరికీ పోవటం లేదు.

మంగోలియన్ బృందం తెరీవాల కోసం ఎడారుల నన్నిటినీ గాలించి వదిలింది. పోలీసులే కాదు... వచ్చి రక్తం తాగే ఎడారి దొంగలు కూడా తెరీవాల కోసం వేటాడటం ప్రారంభించారు. కర్నల్ ఖాఖాన్ ఎవరో అందరికీ తెలుసు. అతని భార్య ఎలాంటిదో అందరూ ఎరుగుదురు. ఖాఖాన్‌ని చంపినందుకు ఎవరూ బాధపడలేదు. సూసీ మరణానికి కారకులయినందుకు వారందరూ తెరీవాల మీద కత్తికట్టారు.

జనాభా చాలా తక్కువ సంఖ్యలో వుండే మంగోలియాలో సృష్టికి మూల కారకులైన స్త్రీ భగవంతుడితో సమానం. అందులోను సూసీ లాంటి తెంపరితనం గల ఆడవాళ్ళు వారికి ప్రత్యక్ష దైవాలు. అటువంటి దేవతను పీడించిన వారిని ఎలా క్షమిస్తుంది మంగోలియా?

దిక్కుతోచక గోబీ ఎడారిని ఆశ్రయించారు తెరీవాలు. అక్కడ కూడా వారికి రక్షణ లభించలేదు. ఎవరికీ కనిపించని చోటికి పారిపోయారు. ఎక్కడ దాక్కున్నారో ఎవరికీ తెలియకుండా పోయింది.

"అవును మిస్టర్ రాజూ! ఆ దుర్మార్గులు ఏమైనారో తెలియటం లేదు. వాళ్ళు జీవించి వున్నంత కాలం - యీ పిల్లలకు ప్రమాదం తప్పదు.

అందువల్ల నా మాటను మన్నించి మీ నిర్ణయాన్ని మార్చుకోండి" మరో సారి ప్రార్థించాడు సి.ఐ.డి. చీఫ్.

టెమూ, లులూలను వెంటబెట్టుకొని కొంతకాలం గోబీ ఎడారిలో సంచారం చేసి రావాలని నిర్ణయించుకున్నాడు షాడో. భయంకరమైన ఆ ఎడారిలో ప్రకృతి సృష్టించే ప్రమాదాలను ఎదుర్కొంటే గాని టెమూ పరిస్థితి పూర్తిగా మెరుగుపడదని అతని వుద్దేశ్యం.

"ఆల్ రైట్ మిస్టర్ రాజూ! మీకు చెప్పే సాహసం నాకు లేదు. ఏ పనిచేసినా వెనుకా ముందూ ఆలోచించుకొని మరీ చేస్తారని ఆశిస్తాను... విష్ యూ హేపీ జర్నీ..." అంటూ శలవు పుచ్చుకున్నాడు మంగోలియన్ సి.ఐ.డి. చీఫ్.

చేతిలో సిగరెట్ అవతలకు విసిరేసి, మరో సిగరెట్ ని వెలిగించాడు షాడో.

"అంకుల్! మనం గోబీ ఎప్పుడు పోతాం?" ఉన్నట్లుండి ప్రశ్నించాడు టెమూ.

మొట్టమొదటి ప్రశ్న అది. అంతవరకూ తలవంచుకొని చెప్పిన పని చేయటం తప్ప మరెటువంటి కుతూహలాన్నీ ప్రదర్శించని టెమూలో - గోబీ ఎడారి పేరు కొద్దిగా మార్పు తీసుకువచ్చింది.

తన నిర్ణయం నూటికి నూరుపాళ్ళు కరెక్ట్ అన్న విషయం ఛటాలున అర్థం అయింది షాడోకు.

"రేపు బయలు దేరబోతున్నాం... రెడీగా వుండండి..." అంటూ కుర్చీలో నుంచి లేచాడు.

అతని కుడిచేయి పట్టుకున్నాడు టెమూ. ఎడమ వేలు పట్టుకుని అడుగులు వేసింది లులూ. రెస్టారెంట్ సెక్షన్ దాటి తమ గదికి పోయే మెట్లవైపు అడుగులు వేస్తూన్న షాడో. ఎందుకో ఎలా వున్నవాడు అలాగే నిలబడిపోయాడు.

అంతవరకూ ఆ మెట్ల వద్ద నిలబడివున్న ఒక మంగోలియన్ అతన్ని చూడగానే హడావుడిగా అవతలకు వెళ్ళిపోయాడు.

షాడో కనుబొమలు ముడిపడ్డాయి. ఎవరతను? ఎందుకలా ప్రవర్తిస్తున్నాడు? హోటల్ ముఖ ద్వారం దగ్గిరికిపోయి వెనుతిరిగి చూశాడా వ్యక్తి. షాడో సాలోచనగా తన వంకే చూస్తూండటం గమనించి, ఆదరా బాదరాగా పక్కకు పోయి దృష్టి పదం నుంచి మాయమైపోయాడు.

***

పెద్దగా కూత పెట్టి ఉలన్ బతార్ రైల్వేస్టేషన్ దాటింది గోబీ మెయిల్. చెవులు చిల్లులు పడేలా శబ్దాలు చేస్తూ పడమటి దిక్కుకు ప్రయాణం ప్రారంభించింది.

మొత్తం పది కంపార్ట్‌మెంట్లు తగిలించి వున్నాయి దానికి. అందులో వున్న పాసింజర్లు అందరూ కెరూటెస్ నదివడ్డున వున్న గ్రామాల్లో దిగిపోతారు అక్కడినుంచి ఖంగాయ్ పర్వతశ్రేణి వరకూ ప్రయాణించి, వెనక్కు తిరుగుతుందది.

ఒక కంపార్ట్ మెంట్ కిటికీల దగ్గర చేరి, బయటకు తొంగిచూస్తున్నారు టెమూ, లులూ, వారికి కొద్ది దూరంలో కూర్చుని కంపార్ట్‌మెంట్‌లో వున్న మిగిలిన పాసింజర్లను జాగ్రత్తగా పరిశీలించాడు షాడో.

ఎదుటి సీటులో ఇరవై అయిదు సంవత్సరాల యువకుడు కూర్చుని వున్నాడు. నిద్రలో కూడా నవ్వుతూ కన్పిస్తాడు. చిరిగిపోయిన బట్టలు. అరిగిపోయిన పాదరక్షలు... మట్టికొట్టుకున్న కాకీ టోపీ.. అతనొక ఎడారి పని మనిషి అని ఎత్తి చూపిస్తున్నాయి.

కాని అతని ప్రక్కనే నేల మీద వున్న రైఫిల్... షాడో దృష్టిని ఏమార్చలేక పోయింది. చూడటానికి తుప్పుపట్టిన ఆయుధం మాదిరిగా వున్నది. లోపలి భాగాలన్నీ క్లీన్ గా వున్నాయి. పైపెచ్చు... చాలా దూరం గురి చూడగల హైపవర్ రైఫిల్ అది.

హోటల్‌లో కనిపించిన ఆగంతకుడిని గురించే ఆలోచిస్తున్న షాడో అంతరంగం, ఎందుకో ఆ యువకుడి మీద కూడా అనుమానపడింది.

ఆ యువకుడికి మరి కొంచెం ప్రక్కగా కూర్చుని వుంది, ఇరవై సంవత్సరాల యువతి. అందమైన ముఖం ... చక్కని పర్సనాలిటీ... ముచ్చటగా వున్నదామె. ఆమె చూపులన్నీ టెమూ, లులూల మీదే వున్నాయి. చూస్తుండగానే రాత్రి గడిచిపోయింది. కెరూటెన్ నదీతీరాన్ని వదిలి - కెరూ మైదానంలో అడుగు పెట్టింది రైలుబండి.

ఎటు చూసినా పచ్చిక మైదానం... మోకాలి ఎత్తున పెరిగి వున్న పచ్చిక. ఎండకు ఎండి, వరి చేను పక్కలకు వాలిపోయి వుంది.

ఉన్నట్లుండి పెద్దగా కూత బెట్టి ఆగిపోయింది రైలుబండి... కునికిపాట్లు పడుతున్న ప్రయాణీకులు అందరూ.. ఒకరొకరుగా లేచి కిటికీలలో నుంచి బయటికి తొంగి చూడటం ప్రారంభించారు.

గాఢ నిద్రలో వున్న యువకుడు కూడా లేచి, కళ్ళు నులుముకుంటూ షాడో వంక చూశాడు ప్రశ్నార్థకంగా.

రైలు ఆగిన కారణాన్ని తెలుసుకోవాలని వున్నది షాడోకు, కాని వళ్లో తలపెట్టుకుని నిద్రపోతున్నది లులూ... వంటరిగా వదిలిపోతే లేచి ఏడుస్తుందేమో!!

"నేను చూస్తూ వుంటాను. మీరు వెళ్ళి రండి..." అంటూ వచ్చి చనువుగా లులూను తన వడిలోకి లాక్కున్నది ఎదుటి సీటులోని యువతి.

సిగిరెట్ వెలిగించుటూ లేచి వళ్ళు విరుచుకున్నాడు షాడో. ముందు నడుస్తున్న యువకుడి వెనుకగా కంపార్టుమెంట్ ద్వారం దగ్గిరికి పోయాడు.

వెనుక వున్న గార్డు కంపార్టుమెంట్‌లో నుంచి దిగి ఒక్కొక్క పెట్టెనే చెక్ చేసుకుంటూ వస్తున్నాడు లావుపాటి గార్డు.

"ఏదో కాలిన వాసన వస్తోంది... ఏదో పెట్టె అగ్ని ప్రమాదానికి గురి అయినట్లుంది..." ప్రశ్నార్థకంగా చూసిన ప్రయాణీకులతో అంటూ పెట్టెలన్నిటినీ జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడతను.

"గార్డు!" అంటూ అతన్ని దగ్గిరికి పిలిచాడు షాడో.

"ట్రైన్‌ని వెనక్కు తిప్పి... ఏదైనా నీటిగుంట దగ్గిరికి పోనీయండి. పది నిముషాలలో ఆపని చేయలేకపోతే ట్రెయిన్‌తో పాటు అందరం మాడి మసి అయిపోతాం..." అన్నాడు.

ఆశ్చర్యంగా చూశాడు ఆ గార్డు...

అదే సమయంలో దూరంలో కనిపించిన నల్లటి పొగలను చూసి అదిరిపడ్డాడు షాడో ప్రక్కన వున్న యువకుడు.

"ఫైర్! పచ్చిక మైదానం మంటల బారిన పడింది. గాలి వాలున రైలు మీదికి వస్తున్నాయి ఆ మంటలు..." అని అరిచాడు బిగ్గరగా .

మరుక్షణం జేబులోంచి విజిల్ తీసి పెద్దగా వూదాడు గార్డు. అతని సైగను అందుకున్న ఇంజన్ డ్రయివర్ రైలు బండిని శరవేగంగా వెనక్కి నడిపించాడు.

పది నిముషాలలో ఒక నీటి గుంట ప్రక్కన ఆగింది రైలు.

అప్పటికి రెండు ఫర్లాంగుల దూరంలోకి వచ్చేశాయి మంటలు. చెరకు తోటలోని ఎండు ఆకుల్ని స్వాహా చేస్తున్నట్లు, ఆకలిగా ముందుకు దూకుతున్నాయవి. రెండు నిలువులు ఎత్తుకు లేస్తున్న ఆ మంటలు రైలు కట్టను సమీపించటం అంటూ సంభవిస్తే, పెట్టెలు అంటుకుంటాయి.

"దిగండి... అందరూ క్రిందికి దిగి పెట్టెల్ని తడపండి" అరిచారెవరో.

గబగబా క్రిందికి దూకారు అందరూ. కంపార్టుమెంట్‌లలో నీళ్ళు నిలిచేటందుకు పనికివచ్చే ప్రతి సాధనాన్ని వూడగొట్టి వెంట తీసుకుపోయారు.

నిద్రపోతున్న టెమూ వులిక్కిపడి లేచి కూర్చున్నాడు. భయంతో పెద్దవి అయ్యాయి అతని కళ్ళు, చటుక్కున అతని దగ్గిరికి పోయాడు షాడో.

"టెమూ... పచ్చిక మైదానంలో ఎవరో అజాగ్రత్తగా చితుకుల మంట వేసినట్లున్నారు. గాలికి అవి పచ్చిక మైదానాన్ని ఆక్రమించుకున్నాయి. మన రైలు బండిని ఆ మంటల నుంచి కాపాడటానికి పోతున్నాము మేము. నువ్వు లోపలే నిలబడి నిప్పు రవ్వలు ఏమైనా లోపలికి వస్తే ఆర్పటానికి సిద్ధంగా వుండాలి..." అన్నాడు అతని తల నిమురుతూ.

భయం పూర్తిగా వుపశమించక పోయినా... అలాగే అని తల వూపాడు టెమూ.

కంపార్టుమెంటు బాత్‌రూమ్‌లో వున్న వాష్‌బేసిన్‌ని విరగగొట్టి - మైదానంలోకి దూకాడు షాడో.

నీటి గుంటలోని నీళ్ళతో రైలు పెట్టెల్ని తడుపుతున్నారు అందరూ... శ్రమ అనుకోకుండా శరీరాలను వంచి తదేక దీక్షతో చేస్తున్నారా పని.

ఫెట ఫెటారావాలు చేస్తూ వచ్చి ఆ మంటలను... గులకరాళ్ళు పోసిన రైలు కట్ట వాటిని అవతలకు పోనీయకుండా అడ్డుకుంది.

ఎటు చూసినా అగ్నిజ్వాలలు...నల్లటి పొగలతో భయంకరంగా తయారయింది ఆ వాతావరణం. మర మనుషుల్లా నీళ్ళు అందుకొని పెట్టెలను తడిచేస్తున్నవారు దడదడలాడుతున్న గుండెలతో ఆ జ్వాలా మాలికలను వీక్షించారు.

ఏ మాత్రం గాలి వీచినా ముందుకు వంగుతాయి మంటలు. వార్నిష్ పూయబడిన రైలు పెట్టెలు... బుస్సున వాటికి లొంగిపోతాయి.

ఉన్నట్లుండి ఎదురు తిరిగింది గాలి... అంతవరకూ మంటల్ని వెంటబెట్టుకొని వచ్చిందది. ఇప్పుడు వెనక్కు తోయటం ప్రారంభించింది.

ఆందోళనగా నిలబడివున్న రైలు ప్రయాణీకులు అందరు... తేలికపడిన హృదయాలతో గాఢంగా నిట్టూర్చి చేతులు దులుపుకున్నారు.

చూస్తుండగానే అణిగిపోయాయి ఆ మంటలు. తినేటందుకు క్రొత్త ఆహారం దొరకక పోవటం వల్ల కాల్చిన గడ్డి పరకలనే తిరిగి కొరుక్కు తింటూ, తృప్తిపడి, శాంతించాడు అగ్నిదేవుడు.

"ఫ్రెండ్స్! మీ ఋణం రైల్వే డిపార్ట్‌మెంట్ ఎన్నటికీ తీర్చుకోలేదు. మీరందరూ తలా ఒక చేయి అందించకపోతే యీ సరికి మంటల బారిన పడివుండేది ట్రైన్..." అందరి వంకా చూసి చేతులు జోడిస్తూ అన్నాడు రైల్వే గార్డు.

"మిస్టర్! మేము లేకపోతే మీ డిపార్టుమెంట్ ఎక్కడ వుండేది? మా సొత్తు యీ రైలు. ఇది మంగోలియన్ ప్రజల వుమ్మడి ధనం. దీన్ని కాపాడుకో లేకపోతే... మా మగతనం దేనికి, మంటల్లో పెట్టి కాల్చడానికా?" నవ్వుతూ అన్నాడు షాడో ప్రక్కన నిలబడివున్న యువకుడు.

మంటలు మీద విజయం సాధించినందుకు సంబరపడుతున్న ప్రయాణీకులు అందరూ గోల గోలగా అరుస్తూ కంపార్ట్‌మెంట్లలో దూరారు. పెద్దగా విజిల్ వేశాడు గార్డు. ఇంజన్ డ్రయివర్ రైలును ముందుకు కదిలించాడు.

"నా పేరు కరుబా! ఎడారిలో పనిచేస్తూ వుంటాను." షాడోతో తనను తాను పరిచయం చేసుకున్నాడు ఆ యువకుడు.

"నా పేరు రాజు... మంగోలియా అందాల్ని చూడటానికి వచ్చాను." అన్నాడు షాడో.

"అంకుల్! నేను కూడా క్రిందికి దిగి నీళ్ళు అందిద్దామని అనుకున్నాను. కాని మిరెల్లా నన్ను వదిలిపెట్టలేదు" షాడోని చూడగానే ఎదురువచ్చి చెప్పాడు టెమూ.

మిరెల్లా వళ్ళో కూర్చుని వున్న లులూ.... నవ్వుతూ వచ్చి షాడో గుండెల మీదికి ఎగబ్రాకింది.

"థాంక్యూ వెరీమచ్ మేడమ్..." అని ఆమెకు కృతజ్ఞతలు తెలియ చేసుకుంటూ, తనలో తను ఒకింత ఆశ్చర్యపడ్డాడు షాడో.

ఎవరి దగ్గిరికి పోని టెమూ, లులూ ఆమె దగ్గిర అతి చనువుగా మసలుకున్నారు. పసిబిడ్డలు ఎవరినైనా నమ్మితే - ఆ వ్యక్తులు చెడ్డవాళ్ళు కావటానికి అవకాశాలు చాలా తక్కువ. ఎవరీ మిరెల్లా? ఎక్కడికి పోతున్నది?

షాడో ఆలోచనలతో నిమిత్తం లేనట్లు వేగంగా పరుగులు తీస్తూనే వున్నది రైలు. ఉన్నట్లుండి మరోసారి ఆగిపోయింది.

మరో అగ్నిప్రమాదం ఏదైనా ఎదురయిందేమో అన్న భయంతో అందరూ హడావిడిగా లేచి బయటకు తొంగి చూశారు.

అగ్నిప్రమాదం కాదు, నల్లటి కొండరాళ్ళల్లో మలచినట్లున్న పెద్ద అడవి దున్నల మంద రైలుకట్ట మీది నుంచి అవతలకు పోతున్నది.

ప్రమాదకరమైన జీవులవి. మనిషి కనిపిస్తే పొడిచి చంపుతాయి. అయినా అవి అలా మంద కట్టి సైనికుల్లా నడవటం ఎంతో అందంగా కనిపిస్తోంది.

"క్రిందిటి సారి యిలాగే మా రైలుకు అడ్డం వచ్చాయి. తుపాకులు పేల్చినా కదలలేదు. అవి వెళ్ళిపోయే దాకా రైలు ఒక్క అడుగు ముందుకు జరగలేదు. అవి వెళ్ళటానికి ఇరవై నాలుగు గంటలు పట్టింది..." షాడో ప్రక్కనే నిలబడిన ఒక పాసింజర్ కామెంట్ చేశాడు.

అతని మాటలు విని తల ఆడిస్తున్న షాడో శరీరం అప్రయత్నంగా జలదరించింది. మెడమీద చీమలు జెర్రులు పాకినట్లు అనుభూతి కలిగింది.

మెల్లగా వెనక్కు తిరిగి చూశాడు. కంపార్టుమెంట్‌కి రెండవ చివర ఇద్దరు వ్యక్తులు నిలబడి వున్నారు. అతని వంకే చూస్తున్నారు వారిద్దరూ.

వారిలో ఒక వ్యక్తి ఆనాడు ఉలన్ బతార్ హోటల్లో మెట్ల దగ్గర ఎదురయిన మంగోలియనే.

షాడో తమ వంక చూడటం గమనించగానే చూపులు మరల్చుకొని రెండవ కంపార్టుమెంటు లోకి వెళ్ళిపోయారు వారిద్దరూ.

సాలోచనగా తన సీటు దగ్గిరికి వచ్చాడు షాడో. ఫైర్ యాక్సిడెంట్ సమయంలో రైలు ప్రయాణీకులందరూ క్రిందికి దిగి పాటుపడ్డారు. ఆ వ్యక్తులు మాత్రం ఆ పని చేయలేదు. తన కంట పడవలసి వస్తుందన్న సంశయమా?

సీటు క్రింద పెట్టిన ఎయిర్ బాగ్‌ని యివతలకు లాగి, అందులో వున్న రివాల్వర్‌ని బయటకు తీశాడు. బుల్లెట్లను పరిశీలించి దాన్ని బెల్ట్ వెనుక దోపాడు.

పట్టు హేండ్ కర్చీఫ్‌లో చుట్టబడి వుంది డాగర్. దాని పదునును సరి చూసి బూటు ప్రక్కనవున్న ప్రత్యేకమైన తోలు పటకాలో దూర్చాడు.

అంతా చూస్తూనే వున్నది మిరెల్లా. ఆమె కళ్ళల్లో ఎటువంటి భావాలు కదలాడలేదు. ఆయుధాలు ధరించి సంచరించడం మంగోలియాలో వింత దృశ్యం కాదు. అక్కడ ప్రతి మనిషి ఒక కత్తినో, రివాల్వర్‌నో ఎల్లవేళలా వెంట బెట్టుకొనే తిరుగుతారు - ఇండియాలో వున్న ఘూర్కాల మాదిరిగా.

నెమ్మదిగా కదలటం ప్రారంభించింది ట్రైన్. బయటకు పోయిన కరూబా తిరిగి వచ్చి తన సీటులో కూర్చున్నాడు.

"ఈ అడవి దున్నల్ని అదిలించాలంటే మామూలు రివాల్వర్లు, చాకులు పనికిరావు. మంచి షాట్ గన్ ని ఒక దాన్ని కొనటం బాగుంటుంది..." కాజువల్‌గా కామెంట్ చేశాడు.

తలవూపి ఆలోచనలో పడ్డాడు షాడో. ఏ అడవి దున్నల్ని చంపటానికి ? రైలులో వున్న రెంటినా? బయటవున్నవాటినా?

***

దిక్కులు దద్దరిల్లేలా కూతపెట్టి షైరసు స్టేషన్‌లో ఆగింది ట్రైన్.

"ఇక్కడ ఒక గంట పాటు ఆగుతుంది. మీరు కాస్సేపు బయటకు పోయి రావచ్చు. రైల్వే కాంటీన్‌లో ఆహారం అధ్వాన్నంగా వుంటుంది. పోయి

ఏదైనా మంచి హోటల్లో భోజనం చేసి రండి..." ఎదురుపడిన ప్రయాణీకులను హెచ్చరిస్తూ స్టేషన్ మాస్టర్ గదివైపు వెళ్ళిపోయాడు గార్డు.

లులూ, టెమూలను వెంటబెట్టుకుని, స్టేషన్ బయటికి వచ్చాడు షాడో. చిన్న పట్టణం అది. ఉన్న హోటళ్ళు నాలుగు స్టేషన్ దగ్గర్లోనే వున్నాయి.

అన్నిటిలోను చిన్నదాన్ని, కొంచెం దూరంలో వున్న దాన్ని ఎంచుకొని అటు అడుగులు వేశాడు షాడో.

లావుగా కింగ్‌కాంగ్‌లా వున్న హోటల్ యజమాని, ముఖమంతా నవ్వులమయం చేసుకొని వారిని ఆహ్వానించాడు. దగ్గిర నిలబడి వారికి కావాల్సినవి తెప్పించి తనే స్వయంగా సర్వ్ చేశాడు.

లులూకి అతనంటే అభిమానం ఏర్పడింది. అదేమిటి యిదేమిటి అని అడిగి అతన్ని అదరగొట్టటం ప్రారంభించింది. ఓపికగా సమాధానం యిచ్చాడతను.

"సార్! యిలా అంటున్నానని మీరు ఏమీ అనుకోవద్దు. పైరను పట్టణం దాటిన దగ్గర్నించీ అంతా రఫ్ కంట్రీ. ఆ ప్రదేశాలలోకి యీ పసిబిడ్డల్ని తీసుకుపోవద్దు" అన్నాడు షాడో వైపు సీరియస్‌గా చూస్తూ.

సిగరెట్ వెలిగించుకుంటూ లేచి నిలబడ్డాడు షాడో. చటమంటు వార్నింగ్ యిచ్చింది అతని సిక్స్‌త్ సెన్స్. లేచి నిలబడబోతున్న టెమూను క్రిందికి తోసి, ఎంగిలి ప్లేట్ల మీద అలాగే బోర్లాపడి పోయాడు.

అదే క్షణంలో వీధిలో నుంచి చెవులు చిల్లులుపడేలా గర్జించింది ఒక రివాల్వర్. దాని బుల్లెట్ హోటల్ ద్వారంలో నుంచి, షాడో తల మీదుగా పోయి ఒక గోడలో దిగబడింది

మెరుపులా బెల్టు వెనుక వున్న రివాల్వర్ ని బయటకు లాగి హోటల్ ముందుకు పరుగుతీశాడు షాడో.

ఎవరూ కనిపించ లేదక్కడ. ఈ చీకటిలో అసలు ఏమీ అగుపించటం లేదు. పాలిపోయిన ముఖంతో నిలబడివున్న టెమూ భుజంతట్టి "టెమూ ... ఎవరో ఎవరి మీదో ఆ రివాల్వర్‌ని పేల్చారు. బుల్లెట్ పొరపాటున మన వైపు వచ్చింది..." అన్నాడు షాడో.

"సార్! సార్! మీరు వెనుక ద్వారం నుంచి వెళ్ళటం చాలా మంచిది..." హెచ్చరించాడు హోటల్ యజమాని, లులూకు ప్రత్యేకంగా ఒక బిస్కట్ పాకెట్‌ని అందిస్తూ.

లులూ, టెమూలను భుజాలకు ఎత్తుకొని, హోటల్ వెనుక వున్న చీకటి సందులోకి వెళ్ళాడు షాడో.

అడుగులో అడుగువేస్తూ, సందు చివరికి పోయి మెయిన్ రోడ్ మీదికి తొంగిచూశాడు.

రోడ్డుకి ఆవలి ప్రక్కన చిన్న స్తంభం మీద కిరోసిన్ దీపం ఒకటి వెలుగుతున్నది. దాని క్రింద నిలబడి చుట్టూ చూస్తున్నాడు ఒక వ్యక్తి.

ఉలన్ బతార్ హోటల్లో ఎదురుపడిన మంగోలియనే అతను.

పటపటలాడాయి షాడో పళ్లు. నెమ్మదిగా పిల్లల్ని క్రిందికి దించి వారి ముందు మోకరించి కూర్చున్నాడు.

టెమూ... కొందరు దుర్మార్గులు మనతో పోట్లాట పెట్టుకోవాలని చూస్తున్నారు. వాళ్ళని ఒక చేయి చూడకపోతే మనం పిరికివాళ్ళమని అనుకుంటారు అందరూ..." అన్నాడు టెమూ ముఖంలోకి చూస్తూ.

స్వల్పంగా కంపించాయి టెమూ పెదవులు.

"అంకుల్... అమ్మను నాన్నను చంపింది వీళ్ళేనా?" అన్నాడు డగ్గుత్తికతో.

చటుక్కున అతన్ని దగ్గిరికి లాక్కుని, భుజం తట్టాడు షాడో.

"కాదు టెమూ... వాళ్ళు కాదు. వాళ్ళని నువ్వు చూశావుగా... సరిగ్గా చూడు వాళ్ళలా కనిపిస్తున్నాడా ఆ మనిషి?" అన్నాడు అతని తల నిమురుతూ.

కళ్లు చిట్లించుకొని చూశాడు టెమూ.

అతని ఆరాటం అణిగిపోవటం గమనించి తేలికగా నిట్టూర్చాడు షాడో.

తన ట్రీట్‌మెంట్ అమోఘంగా పనిచేస్తుంది. మరొక్క నెలరోజులు తమ జోలికి ఎవరూ రాకుండా వుంటే పూర్తిగా కోలుకుంటాడు టెమూ.

కాని తమను అనుసరిస్తున్న ఆ మంగోలియన్‌కి అది అర్థం కావటంలేదు. అయ్యేలా చెప్పటం తన విధి.

"లులూ డార్లింగ్... చిన్న పనిచేస్తావ్ రా?" లులూ బుగ్గలమీద ముద్దు పెట్టుకుంటూ అడిగాడు షాడో.

"ఓ చేస్తా..." బిస్కట్ తింటూనే సమాధానం యిచ్చింది లులూ.

"నువ్వు వీధిలోకి పోయి ఆ లైట్ క్రింద వున్న మనిషిని పిలువ్... అతనితో మాట్లాడాలి మనం" అన్నాడు షాడో.

గున గునా వీధిలోకి పోయింది లులూ.

"ఏయ్... నిన్నే... యిటురా" పెద్దగా ఆ వ్యక్తిని పిలిచింది చేయి వూపుతూ.

అదిరిపడి చూశాడా వ్యక్తి. ఆశ్చర్యంగా నోరు తెరిచి, అడుగులు ముందుకు వేశాడు. చీకటి చాటున పొంచి వున్నాడు షాడో. అతను సందు మొదట్లోకి రాగానే, ఒక్కసారిగా మీదికి లంఘించి, చేతుల్ని విరిచి పట్టుకుని, సందులోకి లాగేశాడు.

"ఏమిటిది?" ఖంగారుగా అరిచాడు ఆ వ్యక్తి.

పిడికిలి బిగించి అతని నోటిమీద గుద్దాడు షాడో.

"నువ్వు ఎవరివో నాకు తెలియదు. నన్ను ఎందుకు అనుసరిస్తున్నావో తెలుసుకోవాల్సిన అవసరం అంతకన్నా లేదు. మర్యాదగా మమ్మల్ని అనుసరించటం మానుకోండి. కాదని మా దోవకి అడ్డు వచ్చారంటే మీ ప్రాణాలు మీవి కాదు..." అని హెచ్చరించాడు గంభీరంగా.

"నువ్వు అంటున్నదేమిటో నాకు అర్థం కావటం లేదు. అసలుఎవరు నువ్వు?" కోపంగా అడిగాడా వ్యక్తి.

లాగిపెట్టి మరో గుద్దు గుద్దాడు షాడో.

"నా పేరు చెబితే... భయంతో నీ అంతట నువ్వే ప్రాణాలు వదిలేస్తావ్. నా మాటలకు అర్థం నీకు తెలుసు. నీకు తెలుసునని నాకు తెలుసు. ఆఖరి సారిగా నోటిమాటలో చెప్తున్నాను. మా దారిన మమ్మల్ని ప్రశాంతంగా పోనీయండి... అడ్డుపడ్డారంటే యిక మీదట మనం మాట్లాడుకునేది మాటలతో కాదు. తుపాకులతో..." అంటూ అతన్ని లేపి, నడుము మీద గట్టిగా తాడు బూటు కాలితో.

వింటినుంచి వెలువడిన బాణంలా పోయి నడివీధిలో బోర్లాపడ్డాడు ఆ వ్యక్తి. అతను లేచి నిలబడే దాకా ఆగలేదు షాడో. లులూను, టెమూను ఎత్తుకుని, వెనుతిరిగాడు. సందు రెండవ చివరికి పోయి చుట్టుదారిన స్టేషన్ చేరుకున్నాడు.

కదలటానికి సిద్ధంగా వున్నది ట్రైన్. ఫ్లాట్‌ఫాం చివర నిలబడివున్న యిద్దరు దృఢకాయులు షాడోని చూడగానే ఒక కంపార్ట్‌మెంట్‌లో ఎక్కేశారు.

ఫ్లాట్‌ఫాం రెండవ వైపు నిలబడి వుంది మరో చిన్న ట్రైన్. అది పైరసు పట్టణం నుంచి దక్షిణ దిశగా ప్రయాణిస్తుంది.

సీటు కింద పెట్టిన ఎయిర్ బాగ్‌ని, సూట్ కేస్‌ని ఎత్తి ఆ ఫ్లాట్‌ఫాం వైపు విసిరాడు షాడో - తమ రైలు కదలబోతున్న ఆఖరిక్షణంలో క్రిందికి దూకి లులూ, టెమూలను కూడా దింపేశాడు.

క్షణాల మీద స్పీడ్ పికప్ చేసింది గోబీ మెయిల్. స్టేషన్ బయటి నుంచి హడావుడిగా పరిగెత్తుకొచ్చి గార్డు కంపార్టుమెంట్‌లో ఎక్కాడు దెబ్బలు తిన్న మంగోలియన్.

అది గమనించిన షాడో పెదవుల మీద క్రూరమైన చిరునవ్వు ఒకటి ప్రత్యక్షమయింది.

ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయకుండా, సామానులను రెండవ ట్రైన్‌లోకి ఎక్కించి, లులూ టెమూలాతో ఒక సీటు ఆక్రమించుకున్నాడు.

అటుగా వచ్చిన గార్డును దగ్గిరికి పిలిచి, తాము హడావుడిగా వచ్చినందువల్ల టిక్కెట్స్ కొనలేదని... వివరించి, ఆ రైలు ఎంత దూరం పోతుందో అంతవరకూ టిక్కెట్స్ యివ్వమని రిక్వెస్ట్ చేశాడు.

గార్డు వ్రాసి యిచ్చిన టిక్కెట్ రిసీట్‌ని పాంటు జేబులో పెట్టుకుంటూ ముందుకు చూసి వులిక్కిపడ్డాడు.

అదే కంపార్ట్‌మెంట్‌లో కూర్చుని ఉన్నది మిరెల్లా. ఆమెను గమనించిన లులూ టెమూలు ఆనందంగా ఆమె దగ్గిరికి పరుగుతీశారు.

అంతటితో అంతం కాలేదు షాడో ట్రబుల్స్... తల ప్రక్కకు తిప్పేసరికి, అప్పుడే కంపార్టుమెంట్ లోకి వస్తున్న కరూబా కనిపించాడు.

"హల్లో మిస్టర్ రాజూ! మీరు కూడా యిటే వస్తున్నారా!" అంటూ నవ్వుతూ వచ్చి అతని ప్రక్కన కూర్చున్నాడు కరుబా.

అతని రైఫిల్.. అలాగే వుంది. క్రొత్తగా కన్పిస్తోంది. సరిక్రొత్త రివాల్వర్ ఒకటి. ఆలోచించే ఓపిక లేక - ఏమైతే అయింది లెమ్మనుకుంటూ సిగరెట్ వెలిగించుకొని అతనితో కబుర్లలో పడ్డాడు షాడో.

***

టెస్సీ పట్టణం దగ్గర ఆగిపోయింది పైరసు సైడ్ పాసింజర్. అక్కడినుంచి వెనుతిరిగి మళ్ళీ పైరసు పట్టణానికే వెళ్ళిపోతుంది.

టెస్సీ మహా పట్టణంలో వెయ్యిమంది జనాభా ఉంటారు. మంగోలియనుల లెక్కలో వెయ్యిమంది ఉంటే చాలు. వాళ్ళు నివసించేది పెద్ద పట్టణం క్రిందే జమ.

ఒకానొకప్పుడు పెద్ద వ్యాపార కేంద్రం టెస్సీ... చుట్టుపట్ల వున్న కొండల్లో బంగారం. వెండి గనులు ఉండేవి. వాటిని త్రవ్వి తీసేటందుకు చాలామంది టెస్సీలోనే మకాం చేసేవాళ్ళు. ఇప్పుడా - గనులు ఎండిపోయాయి. టెస్సీ... నెమ్మదిగా దెయ్యాల పట్టణంగా మారిపోతున్నది.

"ఇక్కడ ఉన్న హోటళ్ళన్నీ.. చాలా రౌడీ హోటళ్ళు.... చిన్న పిల్లలు వాటిల్లో ప్రవేశించకూడనివి..." ప్లాట్‌ఫాం మీద కాలు పెడుతూనే కామెంట్ చేశాడు కరూబా.

ఎటుపోవాలో యింకా నిర్ణయించుకోలేదు షాడో. ఎక్కడైనా... అశ్వాలు దొరికితే ఆ గోలకు దూరంగా కొండల మీదికి పోయి కాంప్ వేద్దామన్న ఆలోచన అతనిది.

అతని ఆలోచనలను పసికట్టి, "రండి... నేను చూపిస్తాను..." అంటూ పట్టణం చివర వున్న పెద్ద పూరింటి దగ్గిరికి వారిని తీసుకుపోయాడు కరూబా.

చిన్నపాకలో వరుసగా నిలబడివున్నాయి. పాతిక గుర్రాలు. వాటి దగ్గర నిలబడివున్న అరవై సంవత్సరాల వృద్ధుడు, కరూబాను చూడగానే సగం కోపం, సగం సంతోషం నిండిన కంఠంతో అతన్ని తిడుతూ యివతలికి వచ్చాడు.

"యూకా... వీళ్ళు నా స్నేహితులు. వీళ్ళకి నీ గుర్రాలు కావాలి..." పరిచయం చేశాడు కరూబా.

అశ్వాలని పరీక్షగా చూస్తున్న షాడో... టెమూ తన చేతిని వదిలిపెట్టి ముందుకు పోవటాన్ని ఆసక్తితో గమనించాడు.

ఎత్తయిన నలుపు రంగు ఆడగుర్రాన్ని ఎంచుకున్నాడు. టెమూ... అది కూడా అతన్ని, లులూను చూసి చిన్నగా సకిలిస్తూ తలను ముందుకు జాచి వాళ్ళ ముఖాలను మూర్కొన్నది.

మరో మూడు గుర్రాలను ఖరీదు చేశాడు షాడో.

వాటి కళ్ళేలను పట్టుకొని యివతలకు వస్తూ, "నేను ఇక్కడికి వచ్చిన సంగతిని మీరు మర్చిపోవాలి. నన్ను గురించి ఎవరికీ చెప్పకూడదు..." అన్నాడు అశ్వాల యజమానితో. షాడో యిచ్చిన డబ్బును లెక్క పెడుతూ... వింతగా చూశాడు అతను.

అతని చూపుల్ని లక్ష్య పెట్టకుండా తమ సామానులను ఒక గుర్రం మీద వేసి త్రాళ్లతో బిగించాడు షాడో. లులూను ఒక గుర్రం మీద కూర్చోపెట్టాడు. టెమూ తన నల్ల గుర్రాన్ని ఎక్కి... దాని చేత చిందులు వేయిస్తున్నాడు.

కరూబా వైపు చూసి చేయి వూపి, ఆఖరి గుర్రాన్ని అధివసించాడు షాడో. టెమూను హెచ్చరించి, తిరిగి పట్టణంలోకి పోకుండా... సరాసరి కొండలవైపు పరుగులు తీయించాడు తన అశ్వాన్ని, అతన్ని అనుసరించి ఆటోమాటిక్‌గా పరుగు అందుకున్నాయి. మిగిలిన అశ్వాలు మూడూ.

***

పైరసు పట్టణంలో, పేరు పొందిన ఒక బార్ వెనుక భాగంలో నిలబడి తన వారినందర్నీ పరీక్షగా చూసి పళ్ళు కొరికాడు తుగ్రల్. బందిపోటు తెరీవాకు పెద్ద కొడుకు అతను. మిగిలిన తెరీవాలందరికీ నాయకుడు.

"చేతికి చిక్కిన మనిషిని వదిలిపెట్టి దేబె ముఖాలు వేసుకొని వచ్చారు... మిమ్మల్ని నమ్మి అజాగ్రత్తగా ఉండటం నాదే బుద్ధి తక్కువ.. ఏమైపోయాడా మనిషి? గాలిలో కరిగి మాయం అయిపోయాడా?... "అని అడిగాడు గరగర లాడుతున్న కంఠంతో.

"నేను జాగ్రత్తగానే ఉన్నాను. ప్లాట్‌ఫాం మీద కాపలా ఉన్నవాళ్లే తప్పటడుగు వేశారు." షాడో చేతిలో దెబ్బలు తిన్న వ్యక్తి తలవంచుకొని సమాధానం ఇచ్చాడు.

"అన్నా! వీళ్ళని అని ప్రయోజనం లేదు. ఖాఖాన్ స్నేహితుడు మన దేశం మనిషి కాదు. ఇండియానుంచి వచ్చాడు. ఆ ఇండియన్ను కరోడాలని

అంటూరు అందరూ. ఈసారి మనం అందరం కలిసి అతని పని పడదాం..." అన్నాడు తుగ్రల్ రెండవ తమ్ముడు బైకాల్.

"మనం ఈ ప్రదేశాలలో దాక్కున్నట్లు ఎవరికీ తెలియదు. మన ఆచూకీ పసికట్టి, మనల్ని హత మార్చటానికే వచ్చాడా ఇండియన్. ఖాఖాన్ పిల్లలు మనల్ని చూశారు. మనల్ని మళ్ళీ చూస్తే గుర్తుపడతారు..." సాలోచనగా అన్నాడు తుగ్రల్.

"పిల్లలు ఒక లెక్కలోకి రారన్నా... ముందు ఆ ఇండియన్ని హతమార్చాలి" అన్నాడు బైకాల్.

అతని వంక గుర్రుగా చూశాడు తుగ్రల్.

"పిచ్చి వెధవా... ఆ పిల్లలు ఎవరని అనుకుంటున్నావ్? పచ్చపాము ఖాఖాన్ రక్తం పంచుకొని పుట్టినవాళ్ళు. రేపు పెద్దవాళ్ళయిన తర్వాత తమ తల్లికి ఉన్న ధైర్యంలో నాలుగోవంతు వారికి సంక్రమించినా... మనల్ని వెతికి వెతికి మట్టుబెట్టకుండా వూరుకోరు. ఆ పాము పిల్లల్ని వెంటనే హతమార్చాలి... ఆ తర్వాత ఇండియన్ అంతు చూడాలి"

"మరి ఆ ఇండియన్ వెంటవున్న యువకుడి మాట ఏమిటి? అతను మనవాడే... పరాయి దేశస్తుడు కాదు..." అన్నాడు షాడోను అనుసరించిన వారిలో ఒక వ్యక్తి.

"ముందు వీళ్ళ సంగతి చూడండి. మిగిలిన వాళ్ళ సంగతి మెల్లిగా చూద్దాం... ఒకవేళ వాళ్ళు దారిమార్చుకొని టెస్పీ పట్టణానికి పోయారేమో విచారించి నాకు తెలియచేయండి" ఆజ్ఞ ఇచ్చాడు తుగ్రల్.

మౌనంగా... తలా ఒక దిక్కుకు చెదిరిపోయారు అతని అనుచరులందరూ. తమ్ముణ్ణి వెంటబెట్టుకొని బార్ లోపలికి దారి తీశాడు తుగ్రల్.

***

టెస్సీ పట్టణానికి పది మైళ్ళ దూరంలో ఒక చిన్న ఇసుక పర్ర ప్రక్కన అశ్వాన్ని ఆపాడు షాడో. అప్పటికి బాగా చీకటి పడిపోయింది.

నిర్మలంగా ఉన్న ఆకాశంలో చక్కగా ప్రకాశిస్తున్నాయి నక్షత్రాలు, చందమామ లేకపోయినా, వాటి మసక వెలుగులో యిసుక పర్ర వరసరాలన్నీ క్లియర్ గానే కనిపిస్తున్నాయి.

గుర్రాల మీద జీనులను, వాటి కళ్ళేలను ఊడతీసి, పొడుగాటి తాడుతో వాటి ముందుకాళ్ళకు బంధాలు వేశాడు షాడో. వెంట తీసుకు వచ్చిన సామాన్లలో నుంచి రెండు బిస్కెట్ పాకెట్లు తీసి లులూ టెమూలకు ఇచ్చాడు.

ఇసుక పర్రకు కొద్ది దూరంలోనే ఉంది చిన్న కొండ వాగు అందులోని నీటితో దాహం తీర్చుకున్నారు ముగ్గురూ.

"అంకుల్... అదేమిటి?" దూరంలో... హారిజన్ మీద భూమిని తాకుతున్నట్లు కనిపిస్తున్న ఒక పెద్ద నక్షత్రాన్ని చూపిస్తూ ప్రశ్నించింది లులూ.

నక్షత్రాన్ని గురించి చిన్న కథ ప్రారంభించాడు షాడో. పది నిముషాలు కూడా గడవక ముందే - చెప్తున్న కధకు వూఁకొడుతూ అలాగే నిద్రపోయింది లులూ. మరో రెండు నిముషాల తరువాత టెమూ కూడా నిద్రా దేవి గాఢ పరిష్వంగంలో మునిగిపోయాడు.

సూట్ కేస్‌లో వున్న కంబళీనొకదాన్ని క్రింద పరిచి వారిద్దరినీ దాని మీద పడుకోబెట్టాడు షాడో. మరొక కంబళీని వారిమీద కప్పి, అశ్వాల దగ్గిరికి పోయాడు.

యిసుక పర్ర చివరికి పోయాయవి. ఎగురుకుంటూ అక్కడ వున్న పచ్చికను మేస్తూ వున్నాయి. షాడో తమను సమీపించటం గమనించి, తల ఎత్తి చెవులు రిక్కించాయి అవన్నీ.

అది గమనించి, తృప్తిగా తలూపాడు షాడో అవి అక్కడ వుండగా, వాటికి తెలియకుండా ఎవరూ ఆ సమీపాల్లోకి రాలేరు. వచ్చిన మరుక్షణం వార్నింగ్ ఇస్తాయవి.

సిగిరెట్ వెలిగించుకుంటూ, యిసుక పర్ర చుట్టూ ఒక రౌండ్ కొట్టి వచ్చాడు.

చల్లటి గాలి తెరలు అలలు అలలుగా వస్తున్నాయి. ఇసుక పర్ర మీదికి. దూరంలో ఎక్కడో వున్న ఖాంగాయ్ పర్వతాల మీది అడవి పూల వాసనలను తమతోపాటు వెంట బెట్టుకొని తీసుకొస్తున్నాయి.

ఏవేవో ఆలోచనలతో అటూ యిటూ పచార్లు చేస్తున్న షాడోకు, టైం అతి త్వరగా గడిచిపోతున్న విషయం --- తూర్పు దిక్కు తెల్లబడటం చూసేవరకూ తెలియలేదు.

వెంటనే వాగు వడ్డునవున్న ఎండు పొదల్ని విరిచి, చిన్న చితుకుల మంట వేశాడు. రాత్రి ఉపయోగించకుండా వదిలేసిన వంట సమానంతా బయటికి లాగి, ఆ మంట మీద వంట ప్రయత్నాలు ప్రారంభించాడు.

అన్న కంటె ముందు లేచిన లులూ... గబగబ పరిగెత్తుకొచ్చి షాడో ప్రక్కన కూర్చున్నది. పెద్ద ఆరిందా మాదిరి చితుల మంటను సరిచేసి, పెనం మీద కాలుతున్న గోధుమ రొట్టెను అటు ఇటు తిప్పటం ప్రారంభించింది.

రాత్రంతా గాఢ నిద్రపోయిన టెమూ... వంట పూర్తి అయిన తర్వాత లేచాడు. అతని కళ్ళలో క్రొత్త కాంతులు కనిపిస్తున్నాయి. పాలిపోయి వున్న అతని బుగ్గల్లో కొద్ది పాటి కలర్ ప్రవేశిస్తున్నది.

సూర్యుడు రెండు అడుగుల ఎత్తు లేచేసరికి, కాంప్‌ని బ్రేక్ చేసి ప్రయాణం ప్రారంభించాడు షాడో. అశ్వాలను సూటిగా ఖాంగాయ్ పర్వతాల వైపు పరుగులు తీయించాడు. తిరిగి చీకటి పడేదాకా ఎక్కడా ఆగలేదు.

యీసారి కాంప్ వేయటం టెమూకు వప్పగించాడు షాడో. ఎయిర్ బాగ్‌లో వున్న పెద్ద గుడ్డల మూటను బయటికి తీసి, అందులో భద్రపరచి వున్న రైఫిల్ పార్టులను ఒకటిగా కూర్చి, బుల్లెట్లతో నింపాడు.

"అది ఎందుకు అంకుల్?" ప్రశ్నించాడు టెమూ.

తమ చుట్టూ ఉన్న పొదల్ని, కొండ గుట్టల్ని చూపించాడు షాడో.

"మనం అరణ్యంలో సంచరిస్తున్నాం టెమూ... అడవి జంతువులు, క్రూర మృగాలు ఎన్నో ఎదురు పడవచ్చు... మరి వాటిని ఎదుర్కోవాలంటే ఇటువంటి ఆయుధాలు వెంట ఉండక తప్పదు గదా..." అన్నాడు.

చితుకుల మంట కోసం ఎండు కొమ్మల్ని ఏరటంలో బిజీ అయిపోయాడు టెమూ. రైఫిల్‌ని భుజాన వేసుకొని కాంప్ చుట్టూ ఒక

రౌండ్ కొట్టివచ్చాడు షాడో. చిన్న కొండ గుట్ట ఎక్కి తాము ప్రయాణించి వచ్చిన మార్గాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు.

ఎవరూ అనుసరించి వచ్చిన జాడలు కనిపించలేదు... అలా అని శాటిస్ఫై కాలేదు షాడో అంతరంగం. ఏదో.. ఏదో... జరగబోతున్నది. ప్రమాదాలను ముందే గుర్తించి హెచ్చరించటానికి అలవాటుపడిన అతని సిక్స్‌త్ సెన్స్ ... చిన్నగా వార్నింగ్ పంపటం ప్రారంభించింది.

ఎంత వెతికినా, ఎంతగా ఆ పరిసరాలను గాలించినా ప్రమాద చిహ్నాలేవీ షాడో కళ్ళకు కనిపించలేదు.

పూర్తిగా చీకట్లు వ్యాపించటం గమనించి కాంప్‌కి వచ్చాడు.

లులూ... టెమూలు ఏదో విషయాన్ని గురించి తీవ్రంగా వాదించుకుంటున్నారు.

"అంకుల్... నేను కాల్చిన రొట్టె బాగోలేదట... తను కాల్చినట్లు నేను కాల్చలేదుట..." బిక్క ముగంతో రిపోర్టు చేసింది లులూ షాడోని చూడగానే.

"నువ్వు కాల్చినట్లు ప్రపంచంలో ఎవరూ కాల్చలేరమ్మా... ఏదీ నాకు యివ్వు... నేను తింటాను..."

లులూను బుజ్జగించి కాలీ కాలని రొట్టెను ఆప్యాయంగా ఆరగించాడు షాడో. టెమూ ముఖ కవళికలను గమనించి అతను చేసిన రొట్టెల్ని కూడా తిన్నాడు.

షాడో రిస్ట్ వాచి పదిగంటలు చూపించేదాకా నిద్రపోలేదు వారిద్దరూ, అదేమిటి...యిదేమిటి అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

వారికి సమాధానాలు చెపుతున్నాడన్న మాటే గాని... షాడో చూపంతా తమ చుట్టూ వున్న గుట్టలమీద, దూరంలో పసిరిక మేస్తున్న గుర్రాల మీదా వున్నది.

లులూ, టెమూలు నిద్రకు వుపక్రమించగానే... లేచి గుర్రాలను కాంప్ లోకి తీసుకొచ్చి నిలబెట్టాడు. చితుకుల మంటలో మరి రెండు ఎండు కొమ్మలను వేసి రైఫిల్‌తో ఒక పొద చాటుకు పోయి కూర్చున్నాడు.

రెండు గంటల సమయంలో... చిన్నగా సకిలించాయి అశ్వాలన్నీ... రైఫిల్ ని ముందుకు జాపి, ట్రిగ్గర్ మీద వేలు పెట్టాడు షాడో.

అడుగులో అడుగు వేస్తూ గుట్టల మీది నుంచి దిగి వచ్చారు నలుగురు దృఢకాయులు. చినిగిపోయిన దుస్తులు, జీబురు గడ్డాలు, చేతుల్లో పొడుగాటి బరిసెలు చూడగానే ఎడారి దొంగలని తెలిసి పోతున్నది.

ఇద్దరు పడుకొని వున్న పిల్లల కేసి నడిచారు. మిగిలిన వారిద్దరూ అశ్వాల వేపు వచ్చారు.

చిన్నగా దగ్గాడు షాడో. రైఫిల్‌ని రెడీగా పట్టుకొని లేచి పొద చాటునుంచి ఇవతలకు వచ్చాడు.

అదిరిపడి... ఎక్కడి వారక్కడ నిలబడి పోయారు వారందరూ.

"దారితప్పి వచ్చారు మీరు... మీకు కావల్సిన సామాను యిక్కడ ఏమీలేదు. మర్యాదగా వెను తిరగండి..." ముక్తసరిగా అన్నాడు షాడో.

"మేము నలుగురం ఉన్నాం..." ఆశ్చర్యం నుంచి తేరుకొన్న దొంగ ఒకడు అన్నాడు దురుసుగా.

రైఫిల్‌ని కొంచెం పైకి ఎత్తాడు షాడో. "దీంట్లో పద్దెనిమిది బుల్లెట్లు వున్నాయి. మీరు యింకో పది మందిని వెంటబెట్టుకొచ్చినా... మరో నాలుగు మిగిలే వుంటాయి." అన్నాడు బారెల్ని మాట్లాడిన దొంగ కంఠానికి గురిపెడుతూ.

నెమ్మదిగా వెనక్కి జరిగారు వారందరూ... అడుగు అడుగు చొప్పున వెనక్కి పోయి, ఒక్కసారిగా పరుగు అందుకున్నారు.

పది నిముషాల పాటు ఎలా వున్నవాడు అలాగే నిలబడి పోయాడు షాడో. దూరంలో నుంచి వినవస్తున్న అడుగుల శబ్దం... దూరంగా పోయి మాయం కాలేదు. గుట్టల మధ్యలో ఒకేసారి ఆగిపోయింది.

ఆశ చావని ఆ దుర్మార్గులు అవకాశం కోసం పొంచులు వేస్తున్నారు.

గుర్రాల కాళ్ళకున్న బంధాలను తొలగించి, వాటిని ప్రయాణానికి రెడీ చేశాడు షాడో. షాడో చేయి మీద పడగానే ఉలిక్కిపడి లేచాడు టెమూ... భయంగా ఏదో అనబోయాడు.

"టెమూ... మనం ప్రయాణం ప్రారంభించాలి... నువ్వు అశ్వం మీద కూర్చోగలవా?" అడిగాడు షాడో.

తల ఆడించి తన నల్ల గుర్రాన్ని ఎక్కాడు టెమూ... నిద్రబోతున్న లులూను భుజం మీద వేసుకొని తన అశ్వాన్ని అధివసించాడు షాడో.

***

యూకా యింటిలో విడిది చేసింది మిరెల్లా. అశ్వాలను అమ్మటమే కాకుండా, ఒకరిద్దరు అతిధులకు భోజన వసతి సౌకర్యాలను ఏర్పరిచి, ఆవిధంగా వచ్చే ఆదాయాన్ని అనుభవిస్తూ వుంటారు యూకా దంపతులు.

వారి యింట్లో బస చేసిన రెండవ రోజు రాత్రి తన వద్ద వున్న డబ్బును లెక్క పెట్టుకొని, తన పొజిషన్‌ని అంచనా వేసుకున్నది మిరెల్లా.

ఉన్న డబ్బు కరెక్టుగా మరో పది రోజులకు మాత్రమే వస్తుంది. ఆ తర్వాత ఎక్కడైనా పని చూసుకోవాలి... బ్రతకాలని అనుకుంటే.

తన తల్లి ద్వారా తనకు సంక్రమించిన ముత్యాల గొలుసు వుంది. దాన్ని అమ్మితే చాలా డబ్బు వస్తుంది. కాని ఆ మారుమూల పట్టణంలో దాన్ని కొనేవారు ఎవరున్నారు? ఎంత లేదన్నా తల్లి జ్ఞాపక చిహ్నంగా వున్న ఆ ఒక్క వస్తువును వదులుకోవటానికి అంగీకరించలేదు ఆమె హృదయం.

షరంగాద్ పట్టణంలో జన్మించిందామె. పది సంవత్సరాల వయస్సు వస్తుండగా తల్లిదండ్రులను కోల్పోయింది. ఇరుగు పొరుగు వారి సహాయంతో ఆ పని యీ పని చేసి మరో ఎనిమిది సంవత్సరాలను గడిపింది.

ఒకరోజు ఉన్నట్లుండి ప్రత్యక్షమైనాడు మిరెల్లా చిన్నపిల్లగా వున్నప్పుడు దేశాలు పట్టుకొని పోయిన ఆమె తాత.

నా అనేవారు ఎవరూ లేని ఏకాకి మిరెల్లా జీవితానికి ఒక ఆధారం లభించింది. కాని ఆమె ఆనందం ఎంతోకాలం నిలిచి ఉండలేదు. ఆరు నెలలు కూడా తిరక్కముందే మంచం పట్టి మరణావస్థను చేరుకున్నాడు వృద్ధుడు.

మరణించే ముందు మిరెల్లాకు ఒక రహస్యం చెప్పి మరీ మరణించాడు. ఖాంగాయ్ పర్వత శ్రేణిలో మంగోలియా నియంత చంఘీజ్ ఖాన్‌కి చెందిన నిధులు నిక్షిప్తమై వున్నాయట. అటువంటి ఒక నిధిని చేరుకోవడానికి మార్గం మిరెల్లాకు చెప్పి, ఆ నిధిని వెతికి స్వంతం చేసుకోమని హెచ్చరించి కనులు మూశాడాయన.

తాత మరణంతో మరోసారి ఏకాకి అయింది మిరెల్లా. తను కూడబెట్టుకున్న కొద్దిపాటి డబ్బును తీసుకొని తాత చెప్పిన మార్గాలలో ప్రయాణిస్తూ ఖాంగాయ్ పర్వత శ్రేణులకు దగ్గిరగా వున్న టెస్సీ పట్టణాన్ని చేరుకున్నది.

ఇక ఇక్కడ నుంచీ అశ్వాలమీద ప్రయాణం చేయాలి. అందుకు అశ్వాలు కొనాలి. ఆహార పదార్థాలకు డబ్బు కావాలి... అంత డబ్బు తన వద్ద లేదు.

ఆ చంఘీజ్ ఖాన్ నిధి ఎక్కడ వుందో కనిపెట్టకపోతే తన బ్రతుకు ఒకరి క్రింద పనిచేసి గడుపు కోవాల్సిందే... అంతకన్నా ఆ ఖాంగాయ్ పర్వతాల్లో ఆకలి బాధకు గురియై మరణించటం మంచిది.

యూకాతో సంప్రతించి అన్ని విషయాలను సెటిల్ చేసుకుందామన్న ఆలోచనతో తన గదిలో నుంచి బయటికి వచ్చింది మిరెల్లా.

ముందు గదిలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు యూకా దంపతులు. మిరెల్లాను చూడగా ఆప్యాయంగా పిలిచి తన ప్రక్కన కూర్చోబెట్టుకుంది యూకా భార్య.

వారికి తన కథనంతా మొదటి నుంచి చివరి దాకా వివరించి చెప్పింది మిరెల్లా.

"నాకు అశ్వాలు, ఆహారపదార్థాలకు కొంత డబ్బు కావాలి. ఈ ముత్యాల హారం ఎంత ఖరీదు చేస్తుందో నాకు తెలియదు. దీన్ని తాకట్టు పెట్టుకుని నాకు అవసరమైన డబ్బును అప్పుగా యివ్వగలరా?"అని అడిగింది ముత్యాల హారాన్ని వారి ముందు పెడుతూ.

లావాటి చుట్టను వెలిగించుకుంటూ ఆమె వంక సాలోచనగా చూశాడు యూకా.

"చూడు తల్లీ! మీ తాత అబద్ధాలు చెప్పాడని అనటం నాకు యిష్టం లేదు. ఖాంగాయ్ పర్వతాల్లో నిధులు నిక్షిప్తమై వున్నాయన్న మాట నేను పుట్టినప్పటి నుంచీ వింటూనే వున్నాను. మాటలు చెప్పటం తప్ప వాటిని వెతికి స్వంతం చేసుకున్న వారు ఎవరూ లేరు. కొమ్ములు తిరిగిన ధైర్యవంతులు కూడా అడుగు పెట్టటానికి భయపడే ఆ పర్వతాలలోకి ఆడపిల్లవి, అందులోను పరువంలో వున్న పడుచువు ఎలా పోతావమ్మా?" అని ప్రశ్నించాడు ఆదరంగా.

సానుభూతి లభించే సరికి మిరెల్లా కళ్ళు చెమ్మగిల్లాయి. అయినా తన భావాలను బయటికి ప్రదర్శించకుండా "మా తాత నాతో నిజమే చెప్పాడు. ఆయన చెప్పిన చోట ఆ నిధి తప్పకుండా వుంటుంది. నాకు నమ్మకం వుంది. మీరు అన్యథా భావించకుండా వుంటే యీ నగను మీ వద్ద వుంచుకొని నాకు సహాయం చెయ్యండి..." అన్నది పట్టుదలగా.

"ఆ పర్వతాల్లో అడవి జంతువులు, కొండ జాతి వాళ్ళు తప్ప నిధులు లేవు అంటుంటే నీకు వినిపించటం లేదా? నీలాంటి అందగత్తె వంటరిగా బయలుదేరితే ఏమౌతుందో నేను ప్రత్యేకంగా చెప్పాలా?" కోపంగా అన్నాడు యూకా.

పెదవులు బిగించి తల ప్రక్కకు తిప్పుకున్నది మిరెల్లా కోపంతో. యూకా బుర్ర మీసాలు స్వల్పంగా కంపించాయి.

ఉన్నట్లుండి కలుగచేసుకుంది అతని భార్య.

"చూడమ్మా! మాకు పిల్లలు లేరు. నీలాంటి కూతురు వుంటే ఎంత బాగుంటుందో అని మేము అనుకోని రోజు లేదు. మాతోనే వుండిపో తల్లీ. ఇక్కడికి వచ్చే యువకుల్లో నీకు నచ్చిన అందగాణ్ణి వివాహం చేసుకుందువు గాని. నా మాట వినమ్మా!" అన్నది మిరెల్లా ముఖాన్ని తనవైపు త్రిప్పుకుంటూ.

"నా మనసు మారదు. ఆ నిధి అక్కడ లేదని తెలుసుకునైనా వెనుతిరుగుతాను. కాని అక్కడికి వెళ్ళకుండా వుండలేను" మొండిగా సమాధానం ఇచ్చింది మిరెల్లా.

"అయితే నీకు తోడుగా ఎవరినయిన వెంటబెట్టుకుపోదువుగాని అంతవరకూ ఆగు" అన్నాడు యూకా.

ముత్యాల హారాన్ని అతని వైపు జాపింది మిరెల్లా. అతను కోపంగా చూసేసరికి సిగ్గుతో తలను వంచుకుంది.

ఆ వృద్ధ దంపతుల ఆదరాభిమానాలకు కృతజ్ఞత ఎలా తెలియచేసుకోవాలో ఆమెకు అర్థం కాలేదు.

యీ కాలపు ఆడపిల్లలు ఇంత మొండి ఘటాలుగా తయారుకావటానికి కారణాన్ని అన్వేషిస్తూ, అశ్వాల వైపు బయలుదేరాడు యూకా. మిరెల్లాకు సాయం పంపించటానికి ఒక మనిషిని వెతకాలి! ఆ మనిషి నూటికి ఎనభై వంతులు అశ్వశాల పరిసరాలలోనే తచ్చట్లాడుతూ వుండవచ్చు.

అశ్వశాలలో వుండాల్సిన మైనపు వత్తి గాలికి ఆరిపోయి చాలాసేపు అయింది. చిమ్మ చీకటితో నిండి వుంది ఆ ప్రదేశమంతా. అశ్వాలు విడుస్తున్న నిట్టూర్పుల శబ్దం తప్ప మరే విధమైన సవ్వడి వినిపించటం లేదు.

అశ్వశాల లోపలికి పోయి మైనపు వత్తి కోసం తచ్చట్లాడుతున్న యూకా ఎందుకో ఆ ప్రయత్నాన్ని విరమించుకొని నిశబ్దంగా ఉత్తరపు దిక్కున వున్న గోడవైపు అడుగులు వేశాడు.

నలుగురు ఆగంతకులు నిలబడి వున్నారు గోడకు ఆవలి ప్రక్క. గోడ యివతలి ప్రక్కన మోకరించి కూర్చుని వారి మాటల్ని ఆలకించటం ప్రారంభించాడు యూకా.

"ఈ అశ్వశాలలోనే అశ్వాలను తీసుకొని యిటునుంచి యిటే కొండలవైపు వెళ్ళిపోయాట్ట. రైల్వే స్టేషన్‌లో పనిచేసే పోర్టరు అతన్ని చూసి నాకు చెప్పాడు..." అంటున్నది ఒక కీచు గొంతు.

"ఎక్కడికి వెళ్ళివుంటాడు?..." ప్రశ్నించింది రెండవ కంఠం.

"ఖాంగాయ్ పర్వతాలవైపు వెళ్ళొట్ట... ఆ సమీపాల్లో వున్న గ్రామాలలోకి పోవచ్చు."

"ఖాంగాయ్ పర్వతాలలోకి పోయాడంటే అతను మన చేతికి చిక్కాడన్న మాటే. వెంటనే తుగ్రల్‌కి కబురు పంపిద్దాం... ఈ విషయాన్ని విని అతను చాలా సంతోషపడతాడు."

ఆ మాటతో గోడ ప్రక్కనుంచి అవతలకు వెళ్లిపోయారు వారందరూ.

ఆరిపోయిన చుట్టను వెలిగించుకోవటం కూడా మరిచి పోయి లేచి నిలబడ్డాడు యూకా. తుగ్రల్ పేరు అతనికి తెలుసు. వారు ఎవర్ని వుద్దేశించి మాట్లాడుకుంటున్నారో అర్థం అయ్యేసరికి యూకా హృదయం బరువెక్కింది.

నల్లగుర్రాన్ని ఎక్కి చిందులు వేయిస్తూ సంబరపడిన టెమూ... పాలబుగ్గల లులూ కనులలో మెదిలేసరికి అతని హృదయం మరింత బాధకు గురిఅయింది.

నరరూప రాక్షసుడు తుగ్రల్. అతని బారిన పడి.. వాళ్ళు బ్రతికి బట్టకట్టగలరా? వారిని వెంట పెట్టుకు తిరుగుతున్న పరదేశి ఎవరు? తుగ్రల్‌ని ఎదిరించే సాహసం అతనికి ఉందా?

అశ్వశాల నుంచి బయటపడి వీధిలోకి మరలిన యూకా వీధి మొగదల వున్న కిరోసిన్ దీప స్తంభాన్ని ఆనుకొని నిలబడిన ఆకారాన్ని చూడగానే గబ గబా అటు అడుగులు వేశాడు.

కాలుస్తున్న సిగరెట్‌ని ఒక బురద గుంటలోకి విసిరి, యూకాకు ఎదురు వచ్చాడతను ట్రిమ్‌గా తయారైవున్న కరుబా.

మిరెల్లా విషయాన్ని అతనికి వివరించాడు యూకా.

"ఆ పిల్ల వెంట నువ్వు వెళ్ళాలి. ఆమెకు సహాయం చెయ్యాలి..." అన్నాడు ఆఖరుగా.

సాలోచనగా చూస్తూ మరో సిగిరెట్ వెలిగించుకున్నాడు కరుబా. రెండు క్షణాలు ఆలోచించి "సారీ... నాకు వీలు కాదు. వేరే పనులు వున్నాయి" అన్నాడు ముక్తసరిగా.

యూకా ముఖంలో నిరాశా తరంగాలు ఆవిర్భవించాయి.

కరూబాతో అతనికి బాగా పరిచయం వుంది. అతని మనస్తత్వం బాగా తెలిసిన వాడు కావటం వల్ల ఆ పైన బలవంతం చేయకుండా వెనుతిరిగాడు. అంతలో తను విన్న మాటలు మదిలో మెదిలి మళ్ళీ కరూబాను నిలబెట్టి ఆ విషయాలను వెల్లడించాడు.

కరూబా ముఖం మరింతగా ముడిపడింది- ఆలోచనలతో.

"పిల్లల్ని గురించి నువ్వు ఆదుర్దా పడాల్సిన పనిలేదు యూకా. వారి వెంట వున్న మనిషి తాచుపాము లాంటి వ్యక్తి. మళ్ళీ మన చంఘీజ్ ఖాన్ మరో జన్మ ఎత్తితే ఎటువంటి సాహసం ప్రదర్శిస్తాడో... అంతకు నాలుగు రెట్లు ధైర్యవంతుడితను. నువ్వు జాలి పడవలసినది అతన్ని గురించి కాదు తుగ్రల్‌ని గురించి ఆలోచించు..." అన్నాడు .

తల వూపుతూ వెనుతిరిగాడు యూకా.

ఉన్నట్లుండి అతన్ని పిలిచాడు కరుబా.

"యూకా... ఆ అమ్మాయిని ప్రయాణానికి సిద్ధం కమ్మని చెప్పు... ఖాంగాయ్ పర్వతాల్లో ఆ నిధి వుంటే వెతికిపెట్టటంలో సాయపడతానని చెప్పు" అన్నాడు.

"యూకా ముఖం వికసించింది ఆ మాట వినగానే. ఆనందంగా తన యింటి వైపు బయలుదేరాడు. అతను కనుమరుగు కాగానే రైల్వే స్టేషన్ వైపు అడుగులు వేశాడు కరూబా.

స్టేషన్ మాస్టర్ గది ముందు నిలబడివున్న నలుగురు దృఢకాయుల్ని చూడగానే ఒక చెట్టుచాటున నిలబడి వారి చర్యలను జాగ్రత్తగా గమనించటం ప్రారంభించాడు.

***

"అమ్మా! అమ్మా!" అంటూ లేచి కూర్చున్నాడు టెమూ..

రెండు క్షణాల సేపు తను ఎక్కడ వున్నాడో అతనికి అర్థం కాలేదు. విపరీతమైన భయం అతన్ని ఆక్రమించుకుని వున్నది. కలలో కనిపించిన గతం అతని శరీరాన్ని చమటలతో నింపివేసింది. కంబళీ మీది నుంచి లేచి పారిపోదామన్న పిచ్చి కోరిక అతని హృదయం నిండా ఆవరించుకున్నది. ప్రకాశంగా వెలుగుతున్న చితుకుల మంట... దానికి కొద్ది దూరంలో మోకాళ్ల మీద తలానించుకొని కూర్చునే నిద్రపోతున్న అంకుల్‌ని చూసేసరికి ఏదో ఒక వింత నిబ్బరం టెమూ అంతరంగంలోకి అతి నెమ్మదిగా అడుగుపెట్టింది.

లేచి నిలబడి చుట్టూ చూశాడు. రాత్రి చాలా భాగం గడిచిపోయింది. తూర్పు దిక్కున పెద్ద నక్షత్రం ప్రత్యక్షం అవుతున్నది. ఆ నక్షత్రం కనిపిస్తే

తెల్లవారటానికి ఎంతో వ్యవధి లేదని అంకుల్ చెప్పాడు... నక్షత్రాలను చూసి టైం తెలుసుకోవటం ఎలాగో నేర్పాడు.

చితుకుల మంట దగ్గిరికిపోయి ఎండు చితుకుల్ని మంటలో వేసి మంటను మరింత పెద్దది చేసాడు టెమూ.

అదే సమయంలో వారు విడిది చేసిన ప్రదేశానికి కొద్ది దూరంలో వున్న పొదలు గాలికి చిరు శబ్దాలు చేశాయి.

నిశ్శబ్దంగా వున్న ఆ వాతావరణంలో టెమూ చెవులకు స్పష్టంగా వినిపించింది ఆ శబ్దం మళ్ళీ. ఏదో చెప్పరాని భయం అతని హృదయాన్ని ఆక్రమించుకున్నది.

మెల్లిగా అంకుల్ దగ్గిరికి జరిగాడు.

మోకాళ్ల మీద తల ఆనించుకొని నిద్రపోతున్న షాడో... అంతకు ఒక అరగంట ముందే ఆ శబ్దాన్ని విని పూర్తి మెలకువలోకి వచ్చాడు.

టెమూ లేచి కూర్చోవటాన్ని గమనించి అతను ఏం చేస్తాడో చూద్దామన్న తలంపుతో నిద్రపోతున్నట్లు నటించటం ప్రారంభించాడు.

షాడోని సమీపించి మెల్లగా భుజం తట్టాడు.

కళ్ళు తెరిచి అతని వంక ప్రశ్నార్థకంగా చూశాడు షాడో.

తన కదలికల్లో ఎటువంటి తొందరపాటును ప్రదర్శించకుండా కనులతో కదులుతున్న పొదలను చూపించాడు టెమూ.

"అంకుల్ ఆ పొదల్లో ఎవరో వున్నారు. శబ్దం అయ్యేటంత గాలి వీచటం లేదు...." అని చెప్పాడు లోగొంతుకతో,

"శహభాష్ టెమూ! ఈ వంటరి ప్రదేశాలలో నివసించాలంటే యిటువంటి ఆలోచనలు వుండటం చాలా అవసరం. ప్రకృతిని జాగ్రత్తగా పరిశీలించే వారిని ప్రమాదాలు అంత తొందరగా దరి చేరవ్... నువ్వు చెల్లాయి దగ్గిర కూర్చో. ఆ పొదల్లో ఏముందో పోయి నేను చూసి వస్తాను..." భుజం తడుతూ అతన్ని మెచ్చుకున్నాడు షాడో.

టెమూ మనస్సు చెప్పరానంత ఆనందంతో ఎగిరి గంతులు వేసింది... వెనుతిరిగి లులూ దగ్గిరికి వచ్చి కూర్చున్నాడు.

మరో ఐదు నిముషాల తర్వాత పొదల చాటు నుంచి లేచి మంట ముందుకు వచ్చారు పది మంది కొండ జాతి వాళ్ళు.

"మంట దగ్గిర నాలుగు ఎండు రొట్టెలున్నాయి..." కూర్చొన్న చోటునుంచి కదలకుండా అన్నాడు షాడో.

వారిలో దృఢంగా ఎత్తుగా వున్న ఒక వ్యక్తి షాడో వంక పట్టి పట్టి చూశాడు.

"వంటరిగా ఏం చేస్తున్నారు యీ ప్రదేశంలో?" అడిగాడు మరొక వ్యక్తి.

అంతవరకూ వారికి కనిపించకుండా క్రింద వుంచిన రైఫిల్‌ని ఎత్తి హామర్‌ని వెనక్కి లాగాడు షాడో. ఆ నిశబ్ద నిశీధిలో కొట్టవచ్చినట్లు వినిపించింది క్లిక్ మన్న సవ్వడి.

"వంటరిగా వున్నానని అనుకుంటున్నారా? మరోసారి పరీక్షగా చూడండి..." అన్నాడు షాడో.

తల ప్రక్కకు తిప్పి టెమూ వంక చూసి ఆశ్చర్యంగా విజిల్ వేశాడు ఆ వ్యక్తి.

కంబళీలో నుంచి బయటకు కనిపిస్తోంది. షాడో టెమూకు యిచ్చిన చిన్న ఆట కత్తి. దాన్ని పట్టుకొని మాటు వేయటం నేర్చుకుంటున్న చిరుతగండులా రెడీగా కూర్చుని వున్నాడు టెమూ.

"చాలా చిన్న వయస్సు... ఈ వయస్సులోనే ఇంత తెగింపు వుండటం చాలా వింతగా వుంది..." తమలో తాము గుసగుస లాడుకున్నారు వారందరూ.

ఆ భాష షాడోకి అర్థంకాదని వారి వుద్దేశ్యం.

"పచ్చపాము ఖాఖాన్ మీకు తెలుసా?" చటుక్కున వారి మాటలకు అడ్డు వెళ్ళాడు షాడో.

అదిరిపడి, అతని వంక విచిత్రంగా చూశారు వారందరూ. కర్నల్ ఖాఖాన్ ఎవరో వారికి బాగా తెలుసు. అతని ధైర్యసాహసాలను గురించి చాలా కధలు ప్రచారంలో వున్నాయి ఆ కొండ గూడేలలో.

"ఆ పచ్చపాముకు పుట్టిన పిల్లపాము అది. ఈ కొండల్ని వదలి తిరిగి పట్టణాలకు పోయేసరికి పెద్దది అవుతుంది..." ఒక మాటలో తాము అక్కడికి వచ్చిన కారణాన్ని వివరించాడు షాడో.

మారు మాటాడకుండా మంట ముందు కూర్చుని, ఎండు రొట్టెలు నాలుగింటినీ ఆరగించారు వారు. మంట దగ్గిరేవున్న సిగరెట్ పాకెట్ లోని సిగరెట్లన్నిటినీ స్వాహా చేసి లేచి నిలబడ్డారు.

"ముందు ప్రమాదం పొంచి వుంది. ఎడారి దొంగల బిడారం ఒకటి కొండలకు పది మైళ్ళ దిగువున డేరాలు వేసుకొని వుంది. జాగ్రత్తగా సంచరించండి..." అంటూ టెమూ వంక చూసి నవ్వుతూ చేతులు వూపి - ఎలా వచ్చారో అలాగే అతి నిశబ్దంగా పొదల చాటుకు వెళ్ళిపోయారు వారందరూ.

"మీ నాన్న పేరు వీళ్ళకి తెలుసు టెమూ... నువ్వు కూడా అటువంటి పేరునే సంపాదించుకోవాలి. కర్నల్ ఖాఖాన్‌ని మించిన వాడు టెమూ ఖాఖాన్ అనుకోవాలి అందరూ..." టెమూ వంక చూస్తూ అన్నాడు షాడో.

ఏదో చెప్పలేని భావాలు టెమూ గుండెల్ని ఆవరించుకున్నాయి.

"మరి నన్ను గురించి అందరూ ఏమనుకోవాలి?" అంటూ లేచి షాడో దగ్గరికి పరిగెత్తింది... అప్పుడే ఆ మాటల్ని విన్న లులూ.

"అందుకు నువ్వు శ్రమపడాల్సిన అవసరం లేదమ్మా. అందరూ నిన్ను టెమూ ఖాఖాన్ చెల్లెలివి అంటారు. నువ్వు పెరిగి పెద్ద దానివయిన తరువాత... పెళ్ళి చేసుకొని..." అంటున్న షాడో మాటలకు పెద్ద ఇరవై సంవత్సరాల యువతి మాదిరి సిగ్గుపడింది లులూ. షాడో మెడను కౌగిలించుకొని గుండెల్లో తలదాచుకున్నది.

***

"ఆగు! ఎవరది ? " భీకరంగా ఎంక్వైరీ చేసింది ఒక వికృత కంఠం. అశ్వాన్ని ఆపి అటు చూశాడు షాడో.

ఒక పొదచాటు నుంచి యివతలికి వచ్చి రైఫిల్ అతని కేసి గురిపెట్టాడు. నల్లదుస్తులు ధరించి వున్న ఎడారి దొంగ ఒకడు.

అతన్ని, అతని వెనుక వున్న గుడారాలను పరీక్షగా చూశాడు షాడో. ఒకరొకరుగా యివతలికి వస్తున్నారు. గుడారాల వద్ద నిలబడివున్న దొంగలందరూ.

సామాన్యంగా కనిపించిన వారందరి జోలికి పోరు ఆదొంగలు. కాని వాళ్ళ మూడ్స్ ఎలా వుంటాయో చెప్పటం చాలా కష్టం... ఏ క్షణంలో ఎలా ప్రవర్తిస్తారో వారికే తెలియదు.

"కొండల్లో వేటాడటానికి పోతున్నాం..." చిన్నగా తమను గురించి ఎక్స్ ప్లెయిన్ చేశాడు షాడో.

"మీ దగ్గిర వున్న డబ్బునంతా తీసి యివతల పెట్టిపొండి..." కరుగ్గా అన్నాడు దొంగ.

"మా దగ్గిర డబ్బు అంతగా లేదు. వున్నదాంట్లో చాలా భాగం ఆహార పదార్థాలను కొనటానికి అయిపోయింది..."

"డబ్బు ఎవడిక్కావాలి... మీ గుర్రాలు వున్నాయిగా వదిలి పొండి..." అప్పుడే అక్కడికి వచ్చిన మరొక దొంగ షాడో అశ్వం వంక గ్రీడీగా చూస్తూ అన్నాడు.

ఆ మాట విన్న మరుక్షణం మెరుపులా లేచింది షాడో రైఫిల్.

"ధనా ధన్ ధనా ధన్" మంటూ అగ్నివర్షాన్ని కురిపించింది.

కెవ్వున అరిచి రెండు చేతులతో గుండెలను వత్తుకుంటూ నేలకూలిపోయారు ఆ దొంగలు ఇద్దరూ.

"టెమూ! కమాన్!!" అరిచాడు షాడో. ముందుకు వచ్చిన టెమూ అశ్వపు కళ్లేన్ని కుడిచేతిలో పట్టుకుని మిగిలిన అశ్వపు కళ్లేలను ఎడమ చేతికి చుట్టుకొని తన గుర్రాన్ని ముందుకు దూకించాడు.

రైఫిల్ మ్రోతలు మిగిలిన దొంగలనందర్నీ ఆకర్షించాయి.

పెద్ద పెద్ద కేకలు వేస్తూ బయటికి పరుగెత్తుకొచ్చారు వారందరూ.

సుడిగాలుల్లా వారి మధ్యనుంచి దూసుకుపోయాయి గుర్రాలు.

"పట్టుకోండి... మన వాళ్ళను చంపిపోతున్నారు. పట్టుకోండి..." బిగ్గరగా అరిచాడో దొంగ.

గబగబా తమ గుర్రాలవైపు పరుగులు తీశారు వారందరూ... దిక్కులు పిక్కటిల్లేటట్లు సింహనాదాలు చేస్తూ షాడోని అనుసరించారు.

మరింత వేగంగా అశ్వాలను ముందుకు దూకించాడు షాడో.

వెనుక నుంచి వికృతంగా గర్జించటం ప్రారంభించాయి. రైఫిల్స్. వాటి బుల్లెట్లు గుర్రాలకు అతి సమీపంలో పడటం మొదలు పెట్టాయి.

ఒక చిన్న పల్లంలోకి పోగానే... చటుక్కున గుర్రాన్ని ఆపి, క్రిందికి దూకాడు షాడో.

"టెమూ! చెల్లాయిని తీసుకొని నువ్వు ముందుకు పో. నేను పదినిముషాల్లో వచ్చి కలుసుకుంటాను" అంటూ ఎయిర్ బాగ్ లో వున్న రెండు గ్రనేడ్లను అందుకొని... టెమూను హెచ్చరించాడు.

లులూను తన గుర్రం మీదికి లాక్కుని, కాలి మడమలతో తన నల్లగుర్రాన్ని అదిలించాడు టెమూ. గాలిలోకి జంప్ చేసి పరుగు అందుకున్నదది.

గ్రనేడ్స్‌కు వున్న సేఫ్టీ పిన్నులను లూజ్ చేస్తూ రెడీగా నిలబడ్డాడు షాడో.

తమను తరుముకు వస్తున్న దొంగల గుంపు సమీపంలోకి రాగానే... బలమంతా ప్రయోగించి వారి మధ్యపడేటట్లు విసిరాడు ఆరెంటినీ.

చెవులు చిల్లులు పడే శబ్దం చేస్తూ ప్రేలాయవి.

ప్రాణనష్టం ఏమీ కలుగలేదు కాని, నాలుగు అశ్వాలు ధ్వనికి బెదిరి తల్లక్రిందులైనాయి. వాటిమీది అశ్వికులు అందరూ మట్టిలోకి దొర్లారు.

రైఫిల్‌ని గురిపెట్టి మరో రెండు అశ్వాలను పడగొట్టాడు షాడో.

మిగిలిన గుర్రాలన్నీ పల్లపు ప్రదేశానికి దూరంగా జరిగాయి. వాటిమీద వున్న వారందరూ తరువాత చేయవలసిన పనిని గురించి చర్చలు ప్రారంభించారు.

ఒక పొదచాటున మోకరించి కూర్చుని వారిలో నాయకుడిగా అగుపిస్తున్న వ్యక్తి ఎడమ భుజాని కేసి రైఫిల్‌ని గురిపెట్టాడు షాడో.

చేతులు గాలిలోకి ఎత్తి తన వారితో ఏదో చెప్తున్నాడతను అతి వేగంగా. బహుశా ముందుపోతున్న వారి ప్రాణాలు బలి పుచ్చుకోనిదే వెనుతిరగ గూడదని కావచ్చు.

గురి చూసి ట్రిగ్గర్ నొక్కాడు షాడో.

వెర్రిగా అరిచి అశ్వం మీది నుంచి క్రిందికి దొర్లాడా వ్యక్తి. అతని ఎడమ భుజం మీద గుండెకు కొంచెం ఇవతలగా ఎర్రటి గాయం ప్రత్యక్షమయింది.

నాయకుడు పడిపోవటంతో మిగిలిన వారందరికీ ఏం చేయాలో అర్థం కాకుండా పోయింది. అదే అదనుగా మరి కొంచెం ముందుకు జరిగి మరో రెండు అశ్వాలను మట్టి తినిపించాడు షాడో.

ఉన్నట్లుండి ముందుకు వచ్చారు వారందరూ.

"పట్టుకోండి... చంపండి...పట్టుకోండి..." అని అరుస్తూ పిచ్చి ఆవేశంతో పల్లపు ప్రదేశాన్ని చుట్టుముట్టారు.

తన గుర్రం మీదికి జంప్ చేసి, రైఫిల్ మడమతో దాని డొక్కల్లో పొడిచాడు షాడో. గాలిలో ఎగురుతున్నట్లు పరుగు ప్రారంభించిందది. ఫర్లాంగుల దూరం వెళ్ళిపోయింది.

అంతటితో ఆగలేదా ఎడారి దొంగలు. పట్టుదలగా వెంబడించటం ప్రారంభించారు. నాయకుడు లేని ఆ గుంపు మరి కొద్ది సేపట్లో పట్టుదలను కోల్పోతుందని షాడోకి తెలుసు. అందువల్ల ముందు అనుకున్న ప్రకారం కొండలకు దూరంగా పోకుండా తన అశ్వాన్ని సూటిగా కొండ గుట్టల వైపు పోనిచ్చాడు.

ఒక చిన్న మిట్ట ప్రక్కన అతనికి ఎదురైనాడు టెమూ. షాడో సైగను చూడగానే తన అశ్వాన్ని అదిలించి పరుగులు తీయించటం ప్రారంభించాడు.

రెండు గంటలపాటు కొనసాగిందా పరుగు పందెం. షాడో కొండగుట్టల్ని సమీపించి, వాటిమీద వున్న దుబ్బుల చాటుకు పోగానే, తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు ఎడారి దొంగలు.

సమతల ప్రదేశంలో నిలబడి తమ కళ్లల్లో దుమ్ము కొట్టిన మనిషి, కొండ గుట్టలచాటున నిలబడి ఊరికే వుంటాడా?

వాళ్ళు వెనుతిరిగిన మరుక్షణం గుట్టల్ని వదిలి ప్రక్కకు పోవాలని అనుకున్నాడు షాడో.

"అంకుల్! పైకి పోదాం.." పర్వత శిఖరాల వంక చూస్తూ అడిగాడు టెమూ.

అతని మాటను కాదనలేక గుర్రాలను ముందుకే పోనిచ్చాడు షాడో. చీకటి పడగానే మంచి స్థలాన్ని చూసి కాంప్ వేశాడు.

అలసిపోయిన లులూ, టెమూలు వెంటనే గాఢనిద్రకు లొంగిపోయారు.

పాంటు జేబులో వున్న సిగరెట్ పాకెట్‌ని తీసి సిగిరెట్ వెలిగించుకుంటూ, ఒక చదును ప్రదేశంలోకి పోయి కొండ క్రిందికి చూశాడు షాడో.

సముద్రంలా వున్నది అంధకారం.

ఆ సముద్రం మధ్య... ఒకే ఒక ఎర్రటి వెలుగు కొట్టు వచ్చినట్లు కనిపిస్తోంది. నొసలు ముడివేస్తూ సాలోచనగా దాని వంక చూశాడు షాడో.

చితుకుల మంట అది. ఎవరో కొండల ముందు కాంప్ వేశారు... కొండల మీదికి రావాలన్న వుద్దేశ్యంతోనే అక్కడ విశ్రమించారు. ఆ వ్యక్తులు ఎవరై వుంటారా అన్న సందేహం మనస్సులో ప్రవేశించేసరికి షాడోను ఆక్రమించబోతున్న నిద్రాదేవత దూరంగా తొలగిపోయింది .

***

"రైఫిల్ ప్రయోగించటం ఎలాగో నీకు తెలుసా?" మిరెల్లావంక చూస్తూ అడిగాడు కరూబా.

చితుకుల మంట ముందు కూర్చుని రొట్టెల్ని కాలుస్తున్న మిరెల్లా ఆశ్చర్యంగా కనుబొమ్మల్ని ఎగురవేసింది.

వారి టెస్సీ పట్టణం నుంచి బయలుదేరి అప్పటికి మూడు రోజులు కావస్తున్నది. తాత చెప్పిన మాటల్ని గుర్తుకు తెచ్చుకుంటూ, అతను సూచించిన కొండ గుర్తుల్ని అనుసరిస్తూ ఖాంగాయ్ పర్వత శ్రేణీవైపు దారిచూపింది మిరెల్లా. ఆమె వెనుకే బాడీ గార్డులా అనుసరించి వచ్చాడు కరూబా.

ప్రతిరోజు... ప్రతిక్షణం అతను తాము అనుసరిస్తున్న మార్గాన్ని ముఖ్యంగా తమ వెనుక వున్న ప్రదేశాలలో చాలా జాగ్రత్తగా పరికిస్తున్నాడు. కాంప్ వేయగా కుకింగ్ బాధ్యతలు మిరెల్లాకే వదిల వచ్చిన దారిని అనుసరించి వెనక్కు పోయి చాలాసేపటికి తిరిగి రావడం అలవాటు చేసుకున్నాడు.

"ఇప్పుడు నేను రైఫిల్ పట్టుకోవాల్సినంత అవసరం ఏమొచ్చింది?" మంట మీది రొట్టెల్ని యివతలకు లాగుతూ అడిగింది మిరెల్లా.

"బందిపోటు దొంగ తుగ్రల్ తన అనుచరులతో ఇటే వస్తున్నాడు..." ముక్తసరిగా సమాధానం ఇచ్చాడు కరూబా.

వులిక్కిపడి చేతిని కాల్చుకుంది మిరెల్లా.

"మనల్ని... మనల్ని అనుసరిస్తున్నాడా?" అని ప్రశ్నించింది భయంగా చూస్తూ.

సిగిరెట్ వెలిగించుకుంటూ తల అడ్డం తిప్పాడు కరూబా.

"మన కంటె ముందు వున్నాడొక మనిషి -- ఇద్దరు పసి బిడ్డల్ని వెంటబెట్టుకొని కొండల మీదికి పోయాడు... వారిని వెంబడిస్తున్నాడు తుగ్రల్... దారికి అడ్డం వచ్చామని మనల్ని కూడా హతమార్చటానికి ప్రయత్నించవచ్చు" అన్నాడు.

లులూ, టెమూలు గుర్తుకు వచ్చి డగ్గుత్తిక పడింది మిరెల్లాకు.

తలవంచుకొని రొట్టెల్ని కాల్చటంలో మునిగిపోయింది. కొద్దిసేపటి తర్వాత తల ఎత్తి కరూబా వంక చూసింది. ఒక రాతి మీద కూర్చుని తుగ్రల్ వస్తున్నాడని చెప్పిన దిశకే చూస్తున్నాడతను.

"ఆ... ఆ పిల్లల్ని రక్షించే మార్గం ఏదీ లేదా?" అతని దగ్గరికి పోయి నిలబడుతూ అడిగింది మిరెల్లా.

సాలోచనగా ఆమె వంక చూసి చిరునవ్వు నవ్వాడు కరూబా.

"ఈ ప్రపంచంలో ఆ పిల్లల్ని కాపాడగలిగింది ఇద్దరే ఇద్దరు వున్నారు డియర్..."

"ఎవరు"

"ఒకడు మనల్ని సృష్టించిన భగవంతుడు... రెండు వారిని వెంటబెట్టుకొని తిరుగుతున్న ఆ మొండి దృఢకాయుడు... అతనెవరో నీకు తెలియదు. నాకు తెలుసు. అతను చూస్తుండగా ఆ పిల్లల మీదచేయి ఎత్తినవాడు... తిరిగి ఎందుకూ పనికిరాడు... వంద మంది తుగ్రల్స్ వెంట పడినా వారిని ఏమీ చేయలేరు..."

ఆ మాటల్ని అర్థం చేసుకోవటానికి విశ్వప్రయత్నం చేస్తూ వెనుతిరిగింది మిరెల్లా.

***

తెల్లవారు ఝామున రెండవ కాంప్ ఫైర్‌ని కూడా గమనించాడు షాడో.

వెంటనే సామాన్లను అశ్వాల మీదికి ఎక్కించి... ప్రయాణం ప్రారంభించాడు.... చీకటి వచ్చేదాకా ఎక్కడా ఆగలేదు.

ఉన్నట్లుండి వాతావరణంలో మార్పు వచ్చింది... తుఫాను వచ్చేటందుకు సూచనగా చల్లటిగాలి వీచటం ప్రారంభించింది.

ఒక చెట్టుక్రింద పెద్ద మంటవేసి, టెమూ, లులూలను దాని ప్రక్కనే పడుకోబెట్టాడు. రైఫిల్‌ని తుడిచి, దాంట్లో ఫ్రష్ బుల్లెట్లను ఎక్కించి -- మంటకు కొంచెం దూరంగా కూర్చున్నాడు-- క్రింద కనిపించిన మంటలను గురించి ఆలోచిస్తూ.

అతనికి నాలుగు ఫర్లాంగుల క్రిందుగా... పొదలలో తిరుగుతున్న ఒక ఎలుగుబంటి ఎందుకో గాలిని వాసన చూసి, పొదల్లోనే ఆగిపోయింది. కొండ క్రింది నుంచి పైకి వస్తున్నాయి లెక్క పెట్టటానికి వీలులేనన్ని అశ్వాలు.

కొండ మీద మరికొన్ని వున్నాయి. రెండు క్షణాలు ఆలోచించి అది కొండమీద వున్న అశ్వాలను ఆరగించటమే మంచి పని అని నిశ్చయించుకుంది. మెల్లిగా పొదలలో నుంచి యివతలకు వచ్చి కొండ మీదికి బయలుదేరింది.

***

రివ్వుమంటూ వీచటం ప్రారంభించింది చలిగాలి.

బండ రాళ్ళ మధ్యలో ప్రవేశించి -- నక్కల అరుపుల్లా వికృత శబ్దాలు చేయటం మొదలుపెట్టింది.

"అంకుల్!" అని పిలుస్తూ లేచి కూర్చున్నాడు టెమూ.

కాంప్ వేసిన ప్రదేశానికి కొద్దిదూరంలో - ఒక బండను ఆనుకొని కూర్చున్న షాడో చటుక్కున లేచి అతన్ని సమీపించాడు.

కంబళీ మీది నుంచి లేచి వచ్చి షాడో వళ్ళో కూర్చున్నది లులూ.

"మరేం భయం లేదు టెమూ, ఈ కొండలమీద ఇటు వంటి గాలులు చాలా తరచుగా వీస్తుంటాయి. మనం వీటిని చూసి బెదిరిపోకూడదు" టెమూ భుజం తడుతూ అన్నాడు షాడో.

కంబళీని వంటి చుట్టూ చుట్టుకొని షాడోని ఆనుకొని కూర్చున్నాడు టెమూ. అంకుల్ కి తెలిసినన్ని విషయాలు అసలు ఈ ప్రపంచంలో మరెవ్వరికైనా తెలుస్తాయా? తను పెద్దవాడైన తరువాత అంకుల్ మాదిరిగా అన్ని విషయాలు తెలుసుకోవాలి. కనుచివరలనుంచి చీకట్లో అస్పష్టంగా కనిపిస్తున్న షాడో వదనాన్ని వీక్షిస్తూ అనుకున్నాడు టెమూ.

పది నిముషాల్లో తనకు తెలియకుండానే నిద్రలోకి జారి పోయాడు. లులూ ఎప్పుడో కళ్ళు మూసుకుంది.

వారిద్దరినీ కంబళీమీద పడుకోబెట్టి... గాలి చొరరానంతగా మిగిలిన కంబళీలను మీద కప్పాడు షాడో.

ఆరిపోవటానికి సిద్ధంగా వున్న చితుకుల మంట మీద మరో నాలుగు చితుకులు వేసి గుర్రాల దగ్గిరికి పోయాడు.

గాలి వీస్తున్న దిశకు తోకలు కనిపించేటట్లు అడ్డంగా ఒక దాన్ని ఒకటి ఆనుకొని వున్నాయవి, వాటి బంధాలను జాగ్రత్తగా పరిశీలించి, కాంపింగ్ ఏరియా చుట్టూ రెండు రౌండ్లు కొట్టాడు షాడో.

ఉన్నట్లుండి జలదరించింది అతని శరీరం. అతనికి తెలియకుండానే కుడిచేయి బూటు ప్రక్కన బిగించి వున్న డాగర్ ని బయటికి లాగింది.

ఆ మరు క్షణమే బండల చాటునుంచి అతని మీదికి దూకింది కొండ ఎలుగుబంటి.

మోకాలి మీద వంగి, ఎడమ చేత్తో దాని ముందరి పాదాలను అవతలికి నెట్టాడు షాడో. అదే వూపులో డాగర్‌ని బలంగా ముందుకు దూశాడు.

గుర్ర్ మని గురకలు పెడుతూ ప్రక్కకు దూకిందా ఎలుగుబంటి. దానికి వూపిరి తీసుకునే వ్యవధి యివ్వలేదు షాడో. కొండలమీద తిరిగే ఎలుగుబంట్లు చాలా డేంజరస్ యానిమల్స్. దెబ్బలు తిన్నకొద్దీ వాటికి పౌరుషం పెరుగుతూ వస్తుంది.

గుండెల మీద డాగర్ పోటును రిసీవ్ చేసుకున్న ఎలుగు బంటి భయంకరంగా నోరుతెరిచి, కొండగుట్టలు ప్రతి ధ్వనించేలా అరిచింది.

దాని అరుపు పూర్తికాకముందే ఎగిరి దాని మీదికి దూకాడు షాడో.

కంటికి కనిపించనంత వేగంగా కదిలింది డాగర్. తెరచి వున్న ఎలుగుబంటి నాలుక మధ్యకు తెగి నేలమీద పడింది.

ఎడమ చేత్తో దాని దవడను పైకి లేపి, కంఠంలో డాగర్ని దింపాడు షాడో. భీకరంగా మూలుగుతూ ముందుకు దూకింది ఎలుగుబంటి. నేలమీద పడి గిలగిలా తన్నుకుని ప్రాణాలు వదిలింది.

ఒక బండచాటున నిలబడి భయం భయంగా చూస్తున్న టెమూ లులూలను గమనించగానే వులిక్కిపడ్డాడు అప్రయత్నంగా.

మెరుపుతీగెలా పరుగెత్తుకు వచ్చింది లులూ... రెండు చేతులతో పైకి ఎత్తి గాలిలోకి ఎగరేసి పట్టుకున్నాడు షాడో. బుగ్గలమీద ముద్దు పెట్టుకొని టెమూ వంక చూశాడు.

క్రింద పడిన ఎలుగుబంటి వంక వింతగా చూస్తున్నాడు టెమూ.

"ఎలుగు బంట్ల విషయంలో చాలా జాగ్రత్తగా వుండాలి టెమూ... వాటితో పోరాడకుండా వుండటమే మంచిది. వేరే దారి లేకపోతే ఎంత తొందరగా వాటిని చంపగలిగితే అంత మంచిది... ఏ మాత్రం ఆలస్యం చేసినా వాటికి కోపం విపరీతం అవుతుంది. పిచ్చిగా మనల్ని ఎటాక్ చేస్తాయి..." ఎక్స్ప్లెయిన్ చేశాడు షాడో.

"అంకుల్... బాకుతో పోట్లాడటం నాకు నేర్పవా?" బూటు ప్రక్కన వున్న డాగర్ వంక చూస్తూ అడిగాడు టెమూ.

"అన్నకు వద్దు... నాకు నేర్పు అంకుల్..." షాడో ముఖాన్ని తనవైపు తిప్పుకుంటూ జబర్దస్తీగా అడిగింది లులూ.

అలాగే అంటున్న షాడో... అప్రయత్నంగా ముందుకు చూసి అదిరిపడ్డాడు. కాంపింగ్ ఏరియాకు ఆవల వున్న అశ్వాలు చెవులు రిక్కించి కొండ క్రిందికి చూస్తున్నాయి.

"టెమూ... చితుకుల మంటమీద మట్టిని విరజిమ్ము... క్విక్..." అంటూ అటు పరుగు తీశాడు షాడో.

కళ్ళేలు పట్టుకొని అశ్వాలను ఎలుగుబంటి శరీరం పడి వున్న ప్రదేశానికి కొద్ది దూరంలో వున్న చెట్లచాటుకు తీసుకుపోయాడు.

చితుకుల మంటమీద ఇసుకపోసి, మంటను ఆర్పేశాడు టెమూ. కంబళీలను చుట్టి చుట్టి గుర్రాల దగ్గిరికి పరిగెత్తాడు.

రెండు నిముషాలు కూడా గడవకముందే కొండ క్రింది నుంచి రెండు అశ్వాలు అటుగా వచ్చాయి. ఆరిపోయిన చితుకుల మంటకు ఆరు అడుగుల దూరంలో అడుగులు వేస్తూ, పడిపోయి వున్న ఎలుగుబంటికి పది అడుగుల అవతలగా ముందుకు పోయాయవి.

ఊపిరి బిగపట్టి రైఫిల్ ని రెడీగా పట్టుకొని చూస్తున్న షాడో, అశ్వాల మీద వున్న వారిని గుర్తించి కనుబొమ్మలు ముడివేశాడు.

"టెమూ... ఆ రెండో గుర్రం మీద వున్నది ఎవరో గుర్తించావా?" గొంతు తగ్గించి రహస్యంగా అన్నాడు తన ప్రక్కనే మోకరించి కూర్చుని ఉన్న టెమూతో.

పట్టి పట్టి చూశాడు టెమూ. అతని వదనంలో ఆశ్చర్యం చోటుచేసుకుంది.

"మిరెల్లా! మనకి రైలులో కనిపించింది కదు అంకుల్?" అన్నాడు విచిత్రంగా చూస్తూ.

మిరెల్లా ప్రక్క ప్రయాణిస్తున్న కరూబా - షాడో మనః పథకంలో అనేక రకాల ఆలోచనలను రేకెత్తించటం ప్రారంభించాడు.

ఆ రెండు గుర్రాలు దృష్టిపథం నుంచి మాయమై పోగానే లేచి నిలబడటానికి ప్రయత్నించాడు టెమూ.

వద్దని సైగ చేశాడు షాడో. పది...పదిహేను... ఇరవై... ముప్పై అయిదు నిముషాల తరువాత వారి ముందు ప్రత్యక్షమయ్యాయి... మరికొన్ని అశ్వాలు.

ఒకదాని వెనుక ఒకటిగా వరుసల్లో వస్తున్నాయవి. పెద్ద పెద్ద తుపాకులను పట్టుకొని ఎవరితోనో యుద్ధం చేయటానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు వాటిని అధివసించి ఉన్న దృఢకాయులు అందరూ.

వాళ్ళు వస్తున్నట్లు అంకుల్‌కి ఎలా తెలిసిందో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ -- వారిని లెక్క పెట్టాడు టెమూ.

వారి ముఖాలు కనిపించటం లేదు సరిగ్గా. చలిగాలి తగలకుండా చెవుల చుట్టూ వారు చుట్టుకున్న పెద్ద పెద్ద తలపాగాలు వారి ముఖాలను మరుగు పరుస్తున్నాయి.

"ఒకటి... రెండు... నాలుగు... పది ...ఇరవై... ఇరవై అయిదు..." అంటూ పాతిక మందిని లెక్క పెట్టాడు టెమూ.

"అంకుల్ ఎవరు వాళ్ళు? ఎందుకలా తుపాకులు పట్టుకొని తిరుగుతున్నారు?" అని అడిగాడు షాడో ముఖంలోకి చూస్తూ.

"దొంగలు... దొంగతనానికి బయలుదేరారు" అంతవరకూ మౌనంగా వున్న లులూ వున్నట్లుండి పెద్దగా కామెంట్ చేసింది.

ఉలిక్కిపడి ఆమె నోటిని మూశాడు షాడో.

దృష్టిపథాన్ని దాటుతున్న ఆఖరి అశ్వం... చటాలున ఆగి వెనక్కి తిరిగింది. దానిమీద ఉన్న అశ్వికుడు తుపాకీని రెడీగా పట్టుకొని దిక్కులు చూడటం ప్రారంభించాడు.

రైఫిల్ ని ఎత్తి భుజానికి ఆనించుకున్నాడు షాడో... అతను ఏమాత్రం ముందుకు వచ్చినా ట్రిగ్గర్ నొక్కటానికి సిద్ధమైనాడు

పది క్షణాల పాటు అటూ యిటూ చూసి, అశ్వాన్ని వెనక్కు తిప్పి తన సహచరులను అనుసరించాడా వ్యక్తి.

బిగపట్టి వుంచిన ఊపిరిని మెల్లిగా బయటికి వదిలి, రైఫిల్ని క్రిందికి దించాడు షాడో.

నిర్జన్యంగా వుండాల్సిన ఆ పర్వతాల్లో యింతమంది సాయుధులు ప్రవేశించటం -- ట్రబుల్ స్టార్ట్ అవటానికి మొదటి మెట్టు. ముందు పోతున్న మిరెల్లా -- కరూబాలను ఈ అశ్వికులు ఎందుకు అనుసరిస్తున్నారు?

మిరెల్లా --- కరూబాల మీది నుంచి టెమూ, లులూల మీదికి మరలాయి షాడో ఆలోచనలు. అనవసరమైన ప్రమాదాలలోకి వారిని లీడ్ చేస్తున్నాడా తను?

టెమూ వదనంలో రోజురోజుకు ప్రత్యక్షమౌతున్న కళాకాంతులను గుర్తుకు తెచ్చుకొని తృప్తి పడ్డాడు షాడో.

నో... ఖాఖాన్ కొడుకు తిరిగి ఖాఖాన్ మాదిరిగానే తయారవ్వాలంటే ఇటువంటి గొడవల మధ్యనే పెరిగి పెద్దవాడవ్వాలి.... వేరే మార్గం లేదు.

"లులూ... మనం యిక్కడే వుందామా?వాళ్ళ వెనుక పోదామా?" లులూ వంక చూస్తూ అడిగాడు షాడో.

"వాళ్ళ వెనకే పోదాం... " కాటుక కళ్ళను పెద్దవి చేసి ఆత్రంగా అన్నది లులూ. మిరెల్లా దగ్గిరికి పోవాలని ఆ పసిదాని ఆశ. అది గమనించే ఆ ప్రశ్న వేశాడు షాడో.

అశ్వాలను సిద్ధం చేసి, తను సామానులన్నిటినీ వాటి మీదికి చేర్చాడు. లులూ, టెమూలను ఒకే అశ్వం మీద ఎక్కించి తన అశ్వాన్ని ముందుకు నడిపించాడు.

ముందు ప్రయాణిస్తున్న వారు లీజర్ గా పోతున్నారు. తాము ప్రయాణించే మార్గాన్ని అతి జాగ్రత్తగా గమనిస్తున్నట్లు వారి ప్రవర్తనవల్ల

షాడోకు అర్థం కాసాగింది. ప్రతి పది నిముషాలకు ఒకసారి యిద్దరు అశ్వికులు వెనుక వారిని సునిశితంగా పరిశీలిస్తున్నారు.

రెండు గంటల సేపు ప్రయాణించగానే, వారిని అనుసరించాలన్న కోరికను మనసునించి తుడిచివేసుకున్నాడు షాడో.

వెనుక నడవటం కంటే, అడ్డదారుల ప్రయాణించి ముందుకు పోయి వారి కోసం వెయిట్ చేస్తే ఎలా వుంటుంది?

ఆ ఆలోచన మనస్సులో ప్రవేశించగానే అశ్వాలను ప్రక్కకు మరలించి మరో దిశగా కొండను ఎక్కటం ప్రారంభించాడు.

సూర్యోదయం అయ్యేసరికి, చిన్న కొండ లోయ వారి ముందు ప్రత్యక్షం అయింది... ఆ లోయ మధ్యలో చిరు శబ్దాలు చేస్తూ ప్రవహిస్తున్నది ఒక చిన్న వాగు.

ఆ వాగు వడ్డునవున్న పొదల మధ్య అశ్వాలను ఆపి, చిన్న చెట్టు క్రింద కాంప్ వేశాడు షాడో.

సూర్యుడు ఆకాశంలోకి లేస్తున్న కొద్ది. కొండ వాగు దగ్గిర అడవి జంతువుల ట్రాఫిక్ అధికం కాసాగింది.

లేళ్ళు, ఎలుగుబంట్లు, అడవి పిల్లులు ముళ్ళ పందులు మొదలైన ఎన్నో రకాల జీవులు కొండ దిగి... అక్కడ నీళ్ళు త్రాగటానికి వస్తున్నాయి.

టెమూ - లులూల ఆశ్చర్యానికి, ఆనందానికి అంతు లేకపోయింది. ఒక దట్టమైన పొదచాటున మోకరించి కూర్చుని--- వాటిని అతి దగ్గిర్లోనుంచి చూస్తూ, సంబరపడసాగారు.

లులూ అతి రహస్యంగా అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నాడన్న మాటే గాని --- షాడో కనులు, చెవులు అన్నీ కొండలవైపే కేంద్రీకరించి వున్నాయి.

పన్నెండు గంటలు అవుతున్న సమయంలో- రెండు అశ్వాలు కొండ మీది నుంచి క్రిందికి దిగి వాగువైపు వచ్చాయి.

అప్పుడే ఒక చిన్న ఉడత నీరు త్రాగటానికి వాగు దగ్గిరికి వెళుతున్నది. దూరంలో వస్తున్న గుర్రాలను చూడగానే చెంగున గెంతి దగ్గర్లో వున్న పొదలో దూరింది.

తల ఎత్తి ముందుకు చూసిన టెమూ... వాగును సమీపిస్తున్న మిరెల్లా కరూబాలను గమనించి ఆశ్చర్యంగా షాడో ముఖంలోకి చూశాడు.

వాగు దగ్గిరికి కరూబా... ఎందుకో దిక్కులు చూశాడు. బెల్టులో వున్న రివాల్వరు మీద చేయి వేసి, మెల్లిగా గుర్రం మీది నుంచి క్రిందికి దిగుతున్నాడు.

"హేండ్సప్! డోన్ట్ మూవ్!!" అన్నాడు షాడో.

అదిరిపడి తల్లక్రిందులుగా వాగులోకి డైవ్ చేశాడు కరూబా... పకపకా నవ్వి... చేతులు తట్టింది లులూ... వినోదంగా నవ్వుతూ పొదచాటునుంచి లేచి ముందుకు పరుగెత్తాడు టెమూ.

"నన్ను అనవసరంగా ఖంగారు పెట్టేశారు... నేను రివాల్వర్ ప్రేల్చినట్లయితే ఏమయ్యేదో తెలుసా?" వాగులో నుంచి లేచి ఇవతలకు వస్తూ, కోపం నటించాడు కరూబా.

తన దగ్గిరికి వచ్చిన టెమూ తల నిమురుతూ షాడోను సమీపించింది మిరెల్లా. లులూ కరూబా భుజం ఎక్కింది.

"మనం యిక్కడ వుండటం ఏమంత మంచిదికాదు. మీ స్నేహితులు మరి కొద్దిసేపట్లో యిక్కడికి వస్తారు. వారి కంట పడకుండా తిరిగి కొండల మీదికి వెళ్ళటం చాలా మంచిది..." చెట్ల క్రిందవున్న తమ సామాన్లనన్నిటినీ అశ్వాల మీదికి చేరుస్తూ వారిని హెచ్చరించాడు షాడో.

***

సూర్యుడు పడమటి దిశకు పరుగులు తీస్తున్న సమయంలో కొండవాగు దగ్గిర తమ అశ్వాలను ఆపారు తుగ్రల్ అనుచరులు.

అక్కడ పొదల చాటున వున్న అశ్వాల గిట్టల గుర్తులు... చెట్టు క్రింద వంట చేసిన చిహ్నాలు చూసి సాలోచనగా మీసాలు మెలిపెట్టాడు తుగ్రల్.

"ఇంకో పది పది హేను మైళ్ళ దూరం పోతారు వీళ్ళు. అక్కడితో ఖాంగాయ్ పర్వతం ఎండ్ అయిపోతుంది. వెనక్కి తిరగటం తప్ప మరోమార్గం లేదు... వెనక్కి తిరక్కుండా అడ్డుకోవాలి మనం... ఒకే దెబ్బకు రెండు పిట్టల్ని పడగొట్టాలి..." అన్నాడు తన వారందర్నీ చూస్తూ.

"ఆ మిరెల్లా ప్రయాణం చేస్తున్న విధానాన్ని గమనించావా? ఆమెకు చంఘీజ్ ఖాన్ నిధి ఎక్కడ వున్నదో బాగా తెలిసి వున్నట్లు అనిపిస్తోంది. దారి తెలియకపోతే యింత సూటిగా యీ పర్వతాల మధ్యకు వచ్చివుండదు." కొండలవైపు చూస్తూ కామెంట్ చేశాడు అతని తమ్ముడు బైకాల్.

"పిల్లల్ని వెంట పెట్టుకొని తిరుగుతున్న ఇండియన్ ఆమెతో చేరటం మనకు చాలా మంచి పని కలిగించింది. మగవాళ్ళిద్దర్నీ చంపేసి, ఆ మిరెల్లా

యవ్వారం తీరికగా ఆలోచిద్దాం. మర్యాదగా మాట్లాడకపోతే... ఆ పిల్లల్ని ఆమె కళ్ళ ఎదుటే చిన్న చిన్న ముక్కలుగా నరుకుదాం. అటువంటి దృశ్యాలు ఆడవాళ్ళ నాలుకలను వదులు చేస్తాయి."

చెవిలో దోపుకున్న సెకండ్ హేండ్ సిగరెట్ ని వెలిగించుకుంటూ అన్నాడు తుగ్రల్. అశ్వాల మీది నుంచి జీనులను తొలగించి, వాటిని వాగు దగ్గరికి తీసుకుపోతున్న మిగిలిన అనుచరులు ఆ మాటలు విని మౌనంగా తలలు ఆడించారు.

"పిల్లల్ని చంపటం చాలా దాఋణం... అంత కంటే అన్యాయం మరొకటి లేదు..." తనలో తనే గొణుక్కున్నాడు పెరూ అనబడే అనుచరుడు.

ఆ మాటలు గాలివాలున తుగ్రల్ చెవుల్ని చేరుకున్నాయి. వున్నట్లుండి ఎర్రబడ్డాయి అతని కళ్ళు... పిడికిళ్ళు బిగించి పళ్ళు కొరుకుతూ రెండు అంగల్లో అతన్ని సమీపించాడు.

"ఏమన్నావ్? ఏమన్నావ్??..." అని గర్జిస్తూ అతని గుండెలమీద బలంగా పొడిచాడు.

తూలివాగులో పడ్డాడు పెరూ... బిత్తరపోయి... తెల్ల మొగం వేసి చూశాడు.

"రైళ్ళను కొల్లగొట్టటంలో... రైలు ప్రయాణీకులను భయపెట్టి వారి వద్ద వున్న సొత్తును స్వాధీన పరుచుకోవటంలో నిన్ను మించినవాడు నా గాంగ్ లో మరొకడు లేడు. ఆ విషయాన్ని నేను మర్చిపోను. నీకు అనవసరమైన వ్యవహారాల్లో తలదూర్చి, నోటికి వచ్చినట్లు మాట్లాడితే... నీ

గొప్పతనాన్ని నేను మర్చిపోవాల్సి వస్తుంది. నువ్వు ఎందుకూ పనికిరాని వాడివని అనుకొని కాల్చి చంపే అవకాశం కలుగుతుంది... ఇకముందు నోరు తెరువదలుచుకుంటే ఆ నోటిలో నుంచి వెలువడే మాటలు ఎలాంటివో కొంచెం జాగ్రత్తగా యోచన చేసి చూసుకొని, ఆ తర్వాత నోరు తెరువ్... తొందర పడినా, నా హెచ్చరికను పెడచెవిన పెట్టినా - ప్రాణాలతో యీ ఖాంగాయ్ పర్వతశ్రేణి మీది నుంచి క్రిందికి దిగలేవు." మీసాలు మెలివేస్తూ హెచ్చరించాడు తుగ్రల్.

తల వంచుకొని వాగులో నుంచి లేచి, యివతలకు వచ్చాడు పెరూ.

ఆ చుట్టుపట్ల వున్న పొదలను గాలిస్తున్నాడు బైకాల్. ఒక చిన్న కొండరాతి దగ్గిరికిపోయి, "అన్నా!" అని బిగ్గరగా అరిచాడు.

ఉలిక్కిపడి అటు పరుగెత్తాడు తుగ్రల్. మిగిలిన వారందరూ హడావుడిగా అనుసరించారు అతన్ని.

కొండరాయి మీద నల్లటి బొగ్గు ముక్కతో నీట్ గా వ్రాసి వున్నాయి కొన్ని అక్షరాలు...

"మీ కోసం నేను ఎదురు చూస్తుంటాను.. నన్ను డిసప్పాయింట్ చేయకండి."

ఎండుటాకు గాలికి కదిలి ప్రక్కకు దొర్లినా, పెద్దగా వినిపించేటంతటిని శబ్దం ఆవరించుకున్నది ఆ ప్రదేశాన్ని.

రక్తం లేనట్లు పాలిపోయిన ముఖాలతో ఒకరి వంక ఒకరు చూసుకున్నారు తుగ్రల్ అనుచరులు.

నోట్లో వున్న సిగరెట్‌ని నేలకేసి కొట్టి, పళ్ళు కొరుకుతూ ఆ రాతిని లాగిపెట్టి తన్నాడు తుగ్రల్.

"ఇది ఆ ఇండియన్ పనే. సందేహం లేదు...మనం అనుసరిస్తున్నట్లు అతనికి తెలిసింది.. ఇక మనం ఆలస్యం చేయకూడదు... పదండి... అతని అంతు చూస్తే గాని, ఆ పిల్లల్ని చంపి చెట్లకు వ్రేలాడ తీస్తే గాని నాకు నిద్ర పట్టదు..." పెద్దగా అరుస్తూ తన అశ్వం వైపు పరిగెత్తాడు.

ఊడతీసిన జీనులను భుజాలమీద వేసుకొని గుర్రాల దగ్గిరికి పరుగుతీశారు అతని అనుచరులు అందరూ.

ఆవేశంతో తుగ్రల్ కి మతిపోయింది. పిచ్చిగా అరిచి, అశ్వాన్ని బలంగా తన్ని కొండలమీదికి పరుగు తీయించాడు.

"అన్నా! తొందర పడకు... తొందర పడకు..." అంటూనే వున్నాడు బై కాల్ . అతని మాటల్ని లక్ష్య పెట్టకుండా కంటికి కనిపించిన కాలిబాట మీద గుర్రాన్ని పరుగు పెట్టించాడు తుగ్రల్.

ఉన్నట్లుండి... ముందుకు తూలిందది. వికృతంగా సకిలిస్తూ బోర్లాపడింది. జీనులో నుంచి పల్టీకొట్టి ఒక పొద మీద పడ్డాడు తుగ్రల్. తలకు బలమైన దెబ్బ తగలటంతో ప్రాణం దిమ్మెరపోయి కదలకుండా ఎలా పడినవాడు అలాగే వుండిపోయాడు.

"అన్నా! అన్నా!!" అని అరుస్తూ అక్కడికి వచ్చాడు బై కాల్.

కాలిబాట మీద నేలకు జానెడు ఎత్తున - దారికి అడ్డంగా కట్టివున్న సన్నటి తాడును చూడగానే నిర్ఘాంత పోయాడు.

ఆవేశంలో వెనకాముందు చూడకుండా వచ్చిన తుగ్రల్‌కి అది కనిపించలేదు. ఆ తాడు కాలికి అడ్డం పడటంతో-- బాలెన్స్ తప్పి తల్లక్రిందులైంది అతని అశ్వం.

తుగ్రల్‌కి చేయి అందించి లేవతీస్తూ, పొద ప్రక్కనే వ్రాయబడి వున్న మరికొన్ని అక్షరాలను గమనించాడు బైకాల్.

"అప్పుడే ఏమయింది? ముందున్నది ముసళ్ళ పండగ..."

***

తాత చెప్పిన కొండ గుర్తుల్ని ఖాంగాయ్ పర్వత శ్రేణి రెండవ వరుసలోకి అడుగుబెట్టే సరికి మర్చిపోయింది మిరెల్లా. అంతవరకూ ఆమెకు యీజీగానే కనిపించిన మార్గాలన్నీ మంత్రం వేసినట్లు మాయమైపోయాయి.

అశ్వాన్ని ఆపి, పెదవులను ముని పళ్ళతో కొరుక్కుంటూ చుట్టూ చూడసాగింది. తను విన్న మాటల్ని గుర్తుకు తెచ్చుకోవటానికి విపరీతమైన ప్రయత్నం చేయటం ప్రారంభించింది.

లులూ కావాలన్న అడవి పువ్వులను కోసుకురావటానికి క్రిందికి దిగి, ఒక కొండ చెరియమీదికి పోయాడు షాడో. పువ్వులు ఏరుతూ, క్రిందికి చూశాడు.

వరుసల్లో వస్తున్న తుగ్రల్ అనుచరులు అతనికి కనిపించారు.

వారి కదలికల్లో --- అంతకు ముందున్న తొందరపాటు పూర్తిగా మాయమైపోయింది. వేస్తున్న ప్రతి అడుగును జాగ్రత్తగా తూచి తూచి వేస్తూ,

ముందు మార్గాన్ని ఒకటికి పదిసార్లు పరిశీలించుకుంటూ ప్రయాణిస్తున్నారు.

"మనం యీ రాత్రికి ఇక్కడే ఆగటం చాలా మంచిది. మన ఫ్రండ్స్ ఎటాక్ చేయదలుచుకుంటే త్రిప్పి కొట్టటానికి యింతకంటే అనువైన ప్రదేశం మరొకటి లేదు.." కొండ మీదికి వస్తూ, తను చూసిన దృశ్యాన్ని మిరెల్లా, కరూబాలకు వివరించి చెప్పాడు షాడో.

దారికి రెండు ప్రక్కలా నిట్టనిలువుగా లేచి వున్నాయి పర్వత గుహలు. ఒక గుహలో గుర్రాలను నిలబెట్టి --- వాటికి కొంచెం యివతలగా కాంప్ వేశారు వారందరూ. చూస్తుండగానే ముందుకు వచ్చింది కన్ను పొడుచుకున్నా కానరాని గాడాంధకారం. చితుకుల మంట ప్రక్కనే కంబళీలు పరుచుకొని విశ్రమించారు మిరెల్లా, టెమూ,లులూలు.

గుహ బయట వున్న బండరాళ్ళను అనుకోని కూర్చున్నారు షాడో, కరూబాలు, నిశబ్దంగా వుంది ఆ ప్రదేశమంతా క్రింది నుంచి ఎటువంటి అలికిడి వినరావటం లేదు.

రెండు గంటలసేపు కదలకుండా కూర్చునేసరికి విసుగు పుట్టి లేచి నిలబడ్డాడు షాడో.

టెమూ లులూలకు రక్షణగా కరూబా, మిరెల్లాలు వున్నారు. ఇక మీదట తను చేతులు ముడుచుకొని కూర్చోవటం దేనికి? పోయి తమను అనుసరిస్తున్న వారి వ్యవహారం ఏమిటో తేల్చుకుంటే ఎలా ఉంటుంది?

"వద్దు పచ్చి రక్తం తాగే కసాయివాళ్ళు వారందరూ... వారి దగ్గిరిగి పోయి డైరెక్టుగా ఎటాక్ చేయటం చాలా ప్రమాదంతో కూడుకున్న పని..." షాడో ఆలోచనలను పసికట్టి ఆందోళనగా అన్నాడు కరూబా.

"ఎదుటి మనిషి నన్ను కొట్టేదాకా చూస్తూ వూరుకోవటం నాకు అంతగా అలవాటు లేదు. వీలైనంత వరకూ ముందు వేయటమే నా పద్ధతి... పిల్లల్ని కనిపెట్టుకొని ఉండండి... నేను ఒక గంటలో తిరిగి వస్తాను..." అంటూ రైఫిల్ ని భుజం మీద వేసుకొని చీకట్లోకి అడుగులు వేశాడు షాడో.

ఏదో అనాలని ప్రయత్నించాడు కరూబా... ఆఖరి క్షణంలో ఆ ప్రయత్నాన్ని విరమించుకొని... తల ఆడించాడు అంగీకారసూచకంగా.

ఒక ఫర్లాంగు దూరం సూటిగా కాలిబాటను అనుసరించి అడుగులు వేశాడు షాడో. ఒక చిన్న పొద ప్రక్కన కూర్చుని ముందున్న పరిసరాలన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించాడు.

ఉన్నట్లుండి గాలివాలున అతని నాశికా రంధ్రాలకు సోకింది పొగవాసన. కాలి బాట మీద మరో ఫర్లాంగు దూరంలో వున్న చెట్ల గుంపులో...ఏదో వెలుగు మిణుకుమంటూ కనిపించింది.

పాములా ముందుకు జరిగాడు. పది నిముషాల తరువాత ఆ చెట్లతోపును సమీపించి, మోకాళ్ళ మీద ముందుకు పోయాడు.

ఒక చెట్టు క్రింద వేయబడి వున్నది, మీడియం సైజు చితుకుల మంట . మరో పది నిముషాలలో ఆరిపోతుంది అది. దాన్ని గురించి పట్టించుకోవటానికి ఎవరూ లేరు ఆ పరిసరాలలో.

తను అనుకున్నది ఒకటి అయినది మరొకటి అని గ్రహించేసరికి అప్రయత్నంగా గగుర్పొడిచింది షాడో శరీరం.

చీకటి మాటున ముందుకు కదిలారు శత్రువు, ఎటాక్ చేయటానికేనా? ఎలా పోయారు? అశ్వాల మీద ప్రయాణిస్తే తనకు వాటి గిట్టల శబ్దం వినిపించి వుండేది... కాలినడకనే బయలుదేరి ఉండాలి...

అలా అయితే వారి అశ్వాలు ఎక్కడ వున్నాయి? వారి సామానంతా ఏమయింది? చితుకుల మంటను వదిలిపెట్టి చెట్ల తోపునంతా గాలించాడు షాడో. అరగంట తరువాత.. అస్పష్టంగా వినిపించింది ఒక గుర్రం సకిలించిన సవ్వడి. పాము చెవుల వంటి షాడో కర్ణేంద్రియాలు చటుక్కున పసికట్టాయి ఆ శబ్దాన్ని. పిల్లిలా అడుగు వేస్తూ వేగంగా జరిగాడు అటు వైపు.

చెట్ల తోపుకు కొంచెం అవతలగా చిన్న కొండ మలుపులో నిలబడి వున్నాయి అశ్వాలన్నీ. వారు తమ వెంట తెచ్చుకున్న ఆహార పదార్థాలు... బట్టలు... ఆఖరికి స్పేర్ బుల్లెట్ దండలు... అన్నీ అక్కడే వున్నాయి.

రైఫిల్‌ని రెడీగా పట్టుకొని ముందుకు అడుగువేశాడు షాడో... రెండు గజాలు కూడా పోకముందే, క్లిక్ మంటూ వినిపించింది రైఫిల్ హేమర్ వెనక్కు లాగిన శబ్దం.

గిరుక్కున పక్కకు తిరిగాడు షాడో. మెరుపు కంటే వేగంగా ముందుకు డైవ్ చేసి నేలమీద బోర్లాపడ్డాడు.

ధన్ ధన్ మని శబ్దం చేసింది ఆ రైఫిల్. దాని బుల్లెట్ షాడో చెవిని రాచుకుంటూ పోయి రాళ్ళ గుట్టల్లో పడింది.

వేగంగా పక్కకు దొర్లాడు షాడో. క్రింద పడిన రైఫిల్‌ని అలాగే వదిలి, ఎడమచేత్తో బెల్టులో వున్న రివాల్వర్‌ని తీశాడు.

మరోసారి గర్జించిందా రైఫిల్. దాని శబ్దం ఆ బండలలో భయంకరంగా ప్రతిధ్వనించింది. భయంతో తొక్కిసలాడుకోవటం ప్రారంభించాయి గుమికూడి వున్న అశ్వాలన్నీ.

ఇంకోసారి నిప్పుల్ని విరచిమ్మింది ఆ రైఫిల్. దాని బారెల్ నుంచి వెలువడిన మంటల్ని ఆధారంగా చేసుకొని తన రివాల్వర్‌ని అటుకేసి త్రిప్పాడు షాడో.

రైఫిల్ మ్రోతలను మించి శబ్దం చేసిందది. దాని బుల్లెట్ సూటిగా పోయి రైఫిల్ పట్టుకున్న వ్యక్తికి తగిలింది.

"అబ్బా!" అంటూ రైఫిల్‌ని నేలకు వదిలి రాళ్ళ వెనుకకు జారిపోయాడా వ్యక్తి. గంభీరమైన నిశబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకున్నది మరోసారి.

పది క్షణాలు వెయిట్ చేశాడు షాడో... రివాల్వర్ ని కుడి చేతిలోకి మార్చుకొని మోచేతుల మీద ముందుకు జరిగాడు.

"నన్ను కొట్ట గలిగానని మిడిసిపడకు మిస్టర్... ఈ పాటికి నీ పిల్లల్ని మా వాళ్ళు హతం చేసి వుంటారు?" చీకటిని చీల్చుకుంటూ వినవచ్చింది ఒక కంఠం.

"పిల్లల మీద పడిన చేతిని విరిచి ముక్కలు చేస్తాను... ఎవరెవరు ఆపని చేశారో వాళ్ళందర్నీ బట్టలు వూడదీసి ముళ్ళ పొదల్లో నిలబెట్టి చంపుతాను..." కరుకుగా సమాధానం యిచ్చాడు షాడో.

అవతలినుంచి సమాధానం రాలేదు... బాధగా మూలుగుతున్న శబ్దం మాత్రం వినవచ్చింది.

బండలకు నాలుగు అడుగుల దూరంలోకి పోయి... నెమ్మదిగా మోకాళ్ళమీదికి లేచాడు షాడో.

"తుగ్రల్‌ని ఎదిరించి ప్రయోజనం లేదు మిస్టర్... ప్రాణాలు దక్కాలంటే వెంటనే వెనక్కు తిరిగి పారిపోవటం మంచిది... మా వాళ్ళు యీ పాటికి వెను తిరిగి వస్తూనే వుంటారు..." సడన్‌గా వినవచ్చింది ఆ కంఠ స్వరం.

షాడో అనుమానం బలపడటం ప్రారంభించింది... కావాలని తనను కదలకుండా ఒకేచోట వుంచటానికి అలా మాట్లాడుతున్నాడతను... తన అనుచరులెవరో గాని చుట్టూ తిరిగి కమ్ముకు వచ్చే అవకాశం యివ్వటానికి...

బండరాళ్ల చివర చిన్న కదలిక కనిపించేసరికి మధ్యలోనే కట్ అయిపోయాయి షాడో ఆలోచనలు. మోకాళ్ళ మీద లేచిన వాడు... అలాగే గాలిలోకి ఎగిరి రాతిబండల మీదుగా అవతలికిపోయి పడ్డాడు.

ధన్ మని చెవులు చిల్లులు పడేలా మ్రోగింది మరో రైఫిల్...

క్రింద పడిన మరుక్షణం... రివాల్వర్‌ని అటు త్రిప్పి ట్రిగ్గర్ నొక్కాడు షాడో. కెవ్వుమన్న అరుపు దాని గంభీరమైన మ్రోతలో కలిపి మార్మోగింది, దబ్ మని శబ్దం చేస్తూ బండల మీదినుంచి దొర్లి క్రింద పడ్డాడు మరో దృఢకాయుడు. పడిన మరుక్షణం అతని ప్రాణాలు పైకి లేచి పోయాయి.

అతన్ని గురించి పట్టించుకోకుండా, మొదటివ్యక్తి దగ్గిరికి పోయాడు షాడో. అప్పటికే అయిపోయింది అతని పని. ఆఖరి హెచ్చరిక చేసిన మరుక్షణం ప్రాణాలు వదిలాడతను. షాడో ప్రయోగించిన బుల్లెట్ అతని పొట్టలో ప్రవేశించి ప్రేగుల్ని బయటకు లాగింది.

గిరుక్కున వెనుతిరిగి గుర్రాల దగ్గిరికి పరిగెత్తాడు షాడో. వాటి ముంగాళ్ళకు వేసివున్న బంధనాలు తొలగించి వాటన్నిటినీ కొండ క్రిందికి తోలాడు. సంతోషంతో భయంతో రకరకాలుగా సకిలిస్తూ, దేనికి తోచిన దారిన అది అనుసరించాయి అవన్నీ.

తుగ్రల్ వెంట తెచ్చుకున్న సామానంతా... మూటలు కట్టి బండల మీదినుంచి క్రింద కనిపిస్తున్న లోయలోకి దొర్లించాడు షాడో.

బండల మధ్య పడిపోయిన రైఫిల్‌ని అందుకొని శరవేగంతో గుహల దగ్గిరికి వచ్చాడు.

ఎంప్టీగా వున్నాయవి. చితుకుల మంట చల్లారిపోయి చాలాసేపు అయింది. పదునైన బాకు ఒకటి గుండెల్లో దిగబడినట్లు వుక్కిరిబిక్కిరి అవుతూ... గుహ గోడకు ఆనుకొని నిలబడిపోయాడు.

కొండ మీదినుంచి తుపాకుల మ్రోతలేవీ తనకు వినిపించలేదు. ఎటాక్ జరిగిన చిహ్నలేవీ అక్కడ కనిపించటంలేదు. మరి పిల్లలు ఏమయ్యారు?మిరెల్లా- కరూబాలు ఎక్కడ వున్నారు?

***

తూర్పుదిక్కు తెల్లబడటం ప్రారంభించిన మరుక్షణం నుంచీ గుహలున్న ప్రదేశాన్ని, అంగుళం అంగుళం చొప్పున పరీక్షించటం ప్రారంభించాడు షాడో.

ఆ రాతి నేలమీద అడుగుజాడలు కనిపించవు... అయినా వదలకుండా అతి జాగ్రత్తగా చూసిన ప్రదేశాన్నే చూస్తూ ఆ కొండ గుట్టనంతా గాలించి వదిలాడు.

సూర్యుడు పైకి వచ్చిన కొద్దీ షాడో ఆవేశం అధికం కాసాగింది... వద్దు వద్దు అని ఎంతమంది చెప్పినా వినకుండా టెమూ, లులూలను ఈ నరకంలోకి తీసుకు వచ్చాడు తను. ఆ పసిబిడ్డలకు ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు పూర్తిగా బాధ్యుడు తను.

అడుగుజాడలను అన్వేషించటంలో మునిగిపోయిన షాడో ఆకాశం మేఘావృతం అవుతూ వుండటం చాలా ఆలస్యంగా గ్రహించాడు.

నల్లటి కారు మేఘాలు శరవేగంతో పరిగెత్తుకొస్తున్నాయ్. ఖాంగాయ్ పర్వతాల మీదికి, నల్ల దుప్పట్లు మీదికి విసిరినట్లు. ఆ మేఘాల మధ్యన పడి కనుమరుగు అవుతున్నాయి పర్వత శిఖరాలన్నీ,

వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. ఉన్నట్లుండి ప్రారంభం అయ్యాయి. ఉరుములు మెరుపులు.

అడుగులో అడుగు వేస్తూ ముందుకు సాగుతున్న షాడో--- ఒక మేఘం తన దారికి అడ్డురావడంతో, నేల మీదినుంచి దృష్టిని మరలించి చుట్టూ చూశాడు.

అదే సమయంలో భీకరంగా గర్జించింది ఒక రైఫిల్. అప్రయత్నంగా నేలమీదికి డైవ్ చేశాడు షాడో. క్రమ్ము కుంటున్న కారుమేఘాల మూలంగా ఆ రైఫిల్‌ని ప్రేల్చిన వ్యక్తి గురి తప్పింది.

రెండవ సారి గురి చూసే అవకాశాన్ని షాడో యివ్వలేదు. పడినచోట వుండకుండా వేగంగా పక్కకు దొర్లి ఒక పొద చాటుకు చేరుకున్నాడు. మోకాలి మీద లేచి ఉజ్జాయింపుగా గురి చూసి రివాల్వర్‌ని ప్రయోగించాడు.

బండరాళ్ళకు తగిలి వికృత శబ్దంచేస్తూ రిఫ్లెక్ట్ అయిందది... రైఫిల్‌ని ప్రేల్చిన వ్యక్తి... పక్కకు తప్పుకున్నట్లున్నాడు... సమాధానం రాలేదు.

పావుగంట సేపు పొద ప్రక్కనే కూర్చుండిపోయాడు షాడో. నిముష నిముషానికి భయంకరంగా తయారౌతున్నది వాతావరణం... కొండ శిఖరాలను ఆవరించుకుంటున్న మేఘాలు...క్షణ క్షణానికి వుధృత రూపాన్ని ధరిస్తున్నాయి.

పొదచాటు నుంచి కదిలి --- బండల మధ్యగా అడుగులు వేయసాగాడు షాడో... సన్నటి తుప్పర రాలటం ప్రారంభించింది. చలిగాలి ఎముకలను కొరికేటట్లు వీస్తున్నది... టెమూ... లులూ ఏం చేస్తున్నారో! కప్పుకోవటానికి వారికి కంబళీలు వున్నాయో లేదో అన్న ఆలోచన మదిలో మెదిలే సరికి--- మరింత వేగంగా పడ్డాయి షాడో అడుగులు.

ఉన్నట్లుండి ప్రక్కకు తొలిగింది అతని దారికి అడ్డంగా అలుముకుని వున్న మేఘం ఒకటి. ముందుకు అడుగు వేయబోయి --- ఎదుట కనిపించిన దృశ్యాన్ని చూసి ఎగిరి వెనక్కు దూకాడు షాడో.

***

గోపురాల్లా నిలబడివున్న రాతి గోడలమధ్య కూర్చుని, చలికి తట్టుకోలేక వాతావరణాన్ని వుద్దేశించి వినరాని తిట్లు తిడుతున్నాడు తుగ్రల్. సన్నగా రాలుతున్న తుంపర ధాటికి తట్టుకోలేక ఎప్పుడో ఆరిపోయింది చితుకుల మంట. ముడుచుకు కూర్చుని.... తుగ్రల్ వంకే చూస్తున్నారు అతని అనుచరులు అందరూ.

షాడో కనిపిస్తే నరికి ముక్కలు చేయాలన్నంత కోపంతో మునిగి తేలుతున్న తుగ్రల్... తమ అశ్వాలను, తమ సామాన్లను తమకు కాకుండా చేసినందుకు, అలా చలిలో అలమటించే పరిస్థితి తమ తలలమీద రుద్ది నందుకు అతన్ని నిలువునా నిలబెట్టి ఏ కండకు ఆ కండ కోసి అడవి పందులకు వేయాలన్నంత కక్ష మీద వున్నాడు.

ఆ ఆలోచనల మధ్యలో--- ఖాఖాన్ భార్య సూసీ విషయం జ్ఞప్తికి వచ్చి తుగ్రల్ గుండెలు మరింతగా మంటలు పుట్టాయి.

ఎంత హుందాగా తనను ఎదిరించిందామె? ఎంత తేలిగ్గా తన అనుచరుణ్ని చంపి, ఆ తర్వాత తన ప్రాణాలు తీసుకుంది!!

ఆ సమయంలో ఆమె కళ్ళల్లో ప్రతిఫలించిన భావం ఏమిటి? భయమా? కాదు.

అసహ్యం. తమ మీద అసహ్యం... ఆమె అంతరంగం నిండా నిండి --- ఆ కళ్ళల్లో నుంచి వెలుపలికి కనిపించింది.

ఆమెకు బుద్ధిచెప్పాలి... ఆమె పిల్లల్ని హతమారిస్తే గాని... ఆమె చూసిన చూపుకు ప్రతీకారం చేయలేడు తను.

"అన్నా! ఏం చేద్దాం? ఇంకా ఎంతసేపు యిలా చలిలో ఎదురు తెన్నులు చూస్తూ కూర్చుంటారు?" వుండబట్టలేని బైకాల్ నెమ్మదిగా తుగ్రల్ ఆలోచనలకు అడ్డం వచ్చాడు.

ఎర్రబడిన కళ్లతో అతని వంక సూటిగా చూశాడు తుగ్రల్.

తల వంచుకొని లేచి యివతలకు వచ్చేశాడు బైకాల్. అన్న మూడ్స్ ఎలా వుంటాయో అతనికి తెలుసు.

ఒక రాతి పలకను ఆనుకొని తమ చుట్టూ సుడులు తిరగుతున్నమేఘ పంక్తులను చూస్తూ నిలబడ్డాడు.

ఆ మేఘాల్లో ఎక్కడో వున్నాడా ఇండియన్. దారి చూడటానికి పోయిన పెరూ... అతని బుల్లెట్ దెబ్బకు జడిసి వెనుతిరిగి వచ్చాడు.

మేఘాలు మాయం అయితే గాని తాము ముందుకు సాగలేరు. ఆ ఇండియన్‌ని, ఖాఖాన్ పిల్లల్ని చంపితే గాని తన మొండిపట్టును వదలడు తుగ్రల్.

ఉన్నట్లుండి... బైకాల్ దృష్టిపథంలోకి వచ్చాడు ఆ ఇండియన్. ఆకాశంలో నుంచి ఊడిపడినట్లు మేఘాల మధ్యనుంచి యివతలికి వచ్చి అతనికి ఇరవై అడుగుల దూరంలో నిలబడ్డాడు.

"ఏరి? నా స్నేహితులు... ఖాఖాన్ పిల్లలు ఎక్కడ వున్నారు?" గంభీరమైన అతని కంఠం బైకాల్ కర్ణేంద్రియాలకు మాత్రమే వినవచ్చింది.

స్థాణువులా నిలబడిపోయాడు బైకాల్.

"ఖాఖాన్ని, ఖాఖాన్ భార్యను చంపింది ఎవరు?" సూటిగా వచ్చింది మరొక ప్రశ్న. క్రిందికి దింపి వున్న అతని రైఫిల్ని చూస్తూ వికృతమైన చిరు నవ్వొకటి నవ్వాడు బైకాల్.

గన్ ప్రయోగించటంలో తనకు ప్రత్యర్థి తన అన్న తుగ్రల్ ఒక్కడే. తుగ్రల్ని మించిన ఫాస్ట్ గన్ మంగోలియాలో మరి ఎవ్వరూ లేరు.

"చాలా సార్లు మా చేతుల్లో చిక్కి --- చిక్కినట్లే జారి పోయావ్... ఇక నీకా ఛాన్సు రాదు. ఈ బైకాల్ గురి తప్పటం యింతవరకూ జరగలేదు." అంటూ మెరుపులా బెల్టు ముందు వున్న రివాల్వర్ని బయటికి లాగాడు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో బయటికి వచ్చింది అతని రివాల్వర్. బయటికి వస్తూనే గుండెలు అదిరేటట్లు గర్జించటం ప్రారంభించింది.

అప్పుడే పెద్ద మేఘపు తెర ఒకటి అతని ముందు నుంచి అవతలికి పోయింది. ఆ మేఘపు తెర మరుగున పడి కనిపించకుండా పోయాడు ఇండియన్.

ఉన్నట్లుండి దూసుకు వచ్చాయి రెండు బుల్లెట్లు. ఒకటి బైకాల్ గొంతులో దిగబడింది. మరొకటి అతని గుండెల్లో ప్రవేశించింది.

ఇనుప హస్తం మాదిరిగా బరువుగా క్రిందికి జారి పోయింది అతని చేయి. అతనికి తెలియకుండానే రివాల్వర్ జారి క్రిందపడిపోయింది.

ఆశ్చర్యంగా వెనక్కు చూశాడు. రివాల్వర్ మ్రోతలు ప్రారంభం అయిన మరుక్షణం బండరాతి మీద పడిన కుండ పెంకుల్లా తలా ఒక దిక్కుకు చెదిరిపోయారు అతని సహచరులు అందరూ. బండలను చాటు చేసుకొని కాల్పులు ప్రారంభించారు... రివ్వు రివ్వుమంటూ పోయి మేఘాల్లో జొరబడుతున్నాయవి. ఒక బుల్లెట్ సూటిగా వచ్చి బైకాల్ కణతకు తగిలింది.

అంతటితో అయిపోయింది అతని పని. అలాగే నేల వాలిపోయాడు.... నేలను తాకకముందే అనంత విశ్వంలో ఎగిరిపోయాయి అతని ప్రాణ వాయువులు.

"బైకాల్! బైకాల్!!" అని అరుస్తూ ముందుకు పరిగెత్తుకొచ్చాడు తుగ్రల్.

ధనాధన్ మని గర్జించింది ఆకాశం. ఛటాలున మెరిశాయి రెండు మెరుపులు. ఒక్కసారిగా పెద్దదయింది వర్షం. ప్రారంభం అయిన మరుక్షణం కుండపోతగా కురియటం ప్రారంభించింది.

కళ్ళు మిరిమిట్లు గొలిపే కాంతితో, చెవులు చిల్లులుపడే శబ్దంతో ఒక రాతి బండని ఢీకొట్టింది పిడుగు ఒకటి.

ఎగిరి అవతల పడిపోయాడు తుగ్రల్... వర్షాన్ని కూడా లక్ష్యపెట్టకుండా ఆ ప్రదేశాన్ని వదిలి దూరంగా పారిపోయారు అతని అనుచరులు.

***

మెరుపులు మెరిసిన మరుక్షణం చేతిలోని రైఫిల్‌ని క్రింద పడేసి దూరంగా పరుగుతీశాడు షాడో.

ఇనుప వస్తువులను చూస్తే పిడుగులకు చెప్పరానంత ఇష్టం. ఆ పర్వతాల్లో పిడుగులు పడటం అంటూ సంభవిస్తే ఇనుము వున్న చోటనే పడుతుంది.

ఉన్నట్లుండి అతని దారికి అడ్డం వచ్చిందొక చిన్నపాద. దానిమీదుగా ఎగిరి అవతలకు దూకాడు. తడిగా వున్న రాతి మీద పట్టుచిక్కలేదు. జర్రున జారి క్రింద పడ్డాడు...

పడిన చోటునే వుండటానికి వీలులేకపోయింది. ఎంత ప్రయత్నించినా పల్లంలోకి దొర్లకుండా ఉండలేకపోయాడు.

సూదుల్లాంటి రాతిమొనలు గుచ్చుకొని మోచేతులు, మోకాళ్ళు దోక్కుపోయాయి. నుదుటిమీద రెండు గాయాలు ప్రత్యక్షం అయ్యాయి.

పడిన చోటునుంచి పదిగజాలు అవతలికిపోయి ఆగాడు. లేచి నిలబడబోతుండగా కనిపించింది అది.

***

చదునుగా వున్న రాతి నేలమీద మేకులాంటి సాధనంతో నీట్‌గా చెక్కబడి వున్నదది. పరుగు తీస్తున్న అశ్వపు బొమ్మ.

చిమచిమలాడుతున్న గాయాలు మర్చిపోయి. దాని ముందు మోకరించి కూర్చున్నాడు షాడో. జోరుగా కురుస్తున్న వర్షాన్ని లెక్క చేయకుండా ఆ బొమ్మను పరీక్షగా చూశాడు.

ఎప్పుడో... కొన్ని వందల సంవత్సరాల క్రితం చెక్కినట్లు కనిపిస్తోంది అది. ఎండకు ఎండి, వానలకు తడిసి నునుపుగా తయారైవుంది.

నరమానవులు ఎవరూ అడుగు పెట్టటానికి సాహసించని ఆ పర్వతాల్లో అంత అందమైన అశ్వపు బొమ్మను చెక్కింది ఎవరు? ఎందుకు??

అప్రయత్నంగా షాడో దృష్టి - ఆ అశ్వం పరిగెత్తటానికి ప్రయత్నిస్తున్న దిశ వైపు మరలింది. పదిగజాల దూరంలో కనిపించింది అటువంటి రాతిపలక ఇంకొకటి. నెమ్మదిగా లేచి దాన్ని సమీపించాడు.

శరవేగంతో పురకలు వేస్తున్న జింక బొమ్మ వున్నది దాని మీద. కొండ గుట్టకు ఈశాన్య దిశగా వున్న పెద్ద పెద్ద రాతి గోడలవైపు పరుగుతీస్తోంది ఆ జింక.

మేఘావృతం అయి వున్న ఆకాశం వంక ---జోరుగా కురుస్తున్న వర్షం వంక చూసి రెండు నిముషాల పాటు దీర్ఘంగా ఆలోచించాడు షాడో.

చైనా దేశంమీద దాడిచేసి కోట్ల విలువచేసే బంగారాన్ని వజ్రవైఢూర్యాలను కొల్లగొట్టుకు వచ్చాట్ట --- మంగోలియా నియంత చంఘీజ్ ఖాన్. అతని తర్వాత ఆ సంపదలో కొంత భాగం ఏమైపోయిందో. ఎక్కడ దాచిపెట్టబడిందో ఎవరికీ తెలియలేదు.

ఖాంగాయ్ పర్వతాల్లో ఎక్కడో అది నిక్షిప్తమై వున్నదని అంటారు అందరూ. ఎక్కడ వున్నదో తెలిసినవారు ఎవరూ లేరు. మిరెల్లా తాత అటువంటి గాలి కధలనే విని తన మనుమరాల్ని ఆ పర్వతాల మీదికి పంపించాడు. మిరెల్లా చెప్పిన మాటల్ని విని మొదట్లో అది గాలి కధలుగానే అభిప్రాయపడ్డాడు తను.

కాని నిజంగానే చంఘిజ్ ఖాన్ నిధి యీ పర్వత శ్రేణుల్లో నిక్షిప్తమై వుందా? ఆ నిధి వున్న ప్రదేశాన్ని చూపించే బొమ్మలేనా యివి?

అప్రయత్నంగా కదిలాయి షాడో పాదాలు. నునుపుగా వున్న రాతి నేలమీద అడుగులు జారకుండా జాగ్రత్త పడుతూ, జింక పరుగెత్తుతున్న దిశకు పయనించాడు...

ఈసారి వంద గజాల అవతలకు కనిపించింది--- మరో బొమ్మ. బలమైన వృషభం ఒకటి తలవంచి కొమ్ములతో ఒక బండరాతిని లేవనెత్తుతున్నది.

దాని శిరస్సు చూపిస్తున్న దిశకు ప్రయాణించాడు షాడో. ఒక గంట కాదు... రెండు మూడు గంటలు గడిచినా తర్వాతి గుర్తు కనిపించనేలేదు.

బొమ్మలను చిత్రించిన వాళ్ళెవరోగాని చాలా తెలివైన ఘటాలు. పొరపాటున ఒకటి రెండు బొమ్మల్ని ఎవరైనా చూడటం సంభవించినా, మూడవ బొమ్మ దగ్గిర వాళ్ళ కళ్ళల్లో దుమ్ము కొట్టు కిటుకును ఆశ్రయించారు.

వెనుతిరిగి వృషభపు బొమ్మ దగ్గిరికి వచ్చి ఆ చట్రాయి మీద కూర్చున్నాడు షాడో. వర్షం కొంచెం వెనుక బట్టింది. మేఘాలు మాత్రం అలాగే వున్నాయి.

ఉన్నట్లుండి షాడో దృష్టి --- తనకు నాలుగు అడుగుల దూరంలో వున్న బండమీద పడింది.

నున్నగా గుండ్రంగా వున్నది... ఎవరో కావాలని దాన్ని పాలిష్ చేశారు. ప్రకృతి సిద్ధంగా ఆ నునుపుదనం రాలేదు.

చట్రాయి మీది బొమ్మను మరోసారి పరిశీలించి చూశాడు షాడో. బండరాతిని ఎత్తటానికి ప్రయత్నిస్తున్నదది. దాని తల సూచిస్తున్న దిశలోనే వుంది --- ఆ నునుపైన శిల.

రెండు చేతులను బండ క్రిందికిపోనిచ్చి ఎత్తటానికి ప్రయత్నించాడు షాడో. ఇసుమంతకూడా కదలలేదు.

తడి చేతులను పాంటుకేసి తుడుచుకుంటూ నాలుగు అడుగులు వెనక్కి వేశాడు షాడో. పాదాలను వెడం వెడంగా వేసి ఊపిరి పీల్చుకొని... రెండు క్షణాల సేపు రాతివంక దీక్షగా చూస్తూ నిలబడ్డాడు.

ఉన్నట్లుండి అతనినోటినుంచి వెలివడింది---శరీరాన్ని జలదరింపచేసే కరాటే అరుపు. కంటికి కనిపించనంత వేగంతో బండమీద వాలాయి అరిచేతులు. ఇనుపసుత్తులు బండమీద పడినట్లు ఖంగుమనే శబ్దం వినవచ్చింది.

గురిచూసి, శరీరంలో వున్న బలాన్నంతా చేతుల్లో కేంద్రీకరించుకొని కొట్టిన కరాటే దెబ్బ అది. బండరాయి ఫట్ మంటూ రెండుగా విచ్చింది.

కాలితో ఆముక్కల్ని అవతలికి దొర్లించి దానిక్రింద వున్న రాతిపలకను పరిశీలించాడు షాడో.

బాణంలా ఎగురుతున్నదొక చిలుక. సూటిగా రాతి గోడలవైపే పోతున్నదది. దాన్ని చూసిన మరుక్షణం --- అక్కడ ఆగకుండా, గుట్టదిగి--- దూరంలో కనిపిస్తున్న రాతిగోడల వైపు బయలుదేరాడు షాడో.

నిధివున్నా వుండకపోయినా--- ఆబొమ్మల్లో ఏదో వింత యిమిడివుంది. అదేమిటో తెలుసుకొని తీరాలి అన్న కోరిక అతని అంతరంగం నిండా ఆవరించుకున్నది.

రాతిగోడలను సమీపించే ముందు మరి రెండు గుర్తులను చూసి తన మార్గాన్ని సరిచేసుకున్నాడు... ఆఖరి బొమ్మ ఒక దృఢకాయుడిది. బరిశెను ఎత్తి ముందుకు విసురుతున్నట్లుగా మలిచివుంది.

ఆ బొమ్మ సూచిస్తున్న దిశలో ఎంతసేపు గాలించినా మరో బొమ్మకాని, మరో విధమైన గుర్తులు కాని షాడోకు కనిపించలేదు.

వెతుకుతుండగా చీకటి పడింది. ఆ చీకట్లో తచ్చట్లాడటం మంచిదికాదని అనుకుంటూ రెండు రాతి బండల మధ్య ముడుచుకు కూర్చుని కనులు మూసుకున్నాడు. విపరీతమైన చలి వేస్తున్నది. వర్షానికి తడిసి పోయిన దుస్తులు శరీరంలో వున్న రక్తాన్ని గడ్డకట్టించటానికి ట్రై చేస్తున్నాయి. టెమ్యూ,లులూల కోసం ఆత్రుతగా తిరగటంలో ఆకలి సంగతి

జ్ఞాపకం లేదు. తీరికగా కూర్చున్న మరుక్షణం ఆకలి. దప్పిక అన్నీ ఒకేసారి వచ్చి మీదపడి బాధించటం ప్రారంభించాయి.

అతి ప్రయత్నం మీద ఆ ఆలోచనలను మనసులో నుంచి నెట్టి వేసుకొని నిద్రను ఆహ్వానించాడు. తిరిగి లేచే సరికి తెల్లవారింది. ఆకాశం నిర్మలంగా కనిపించింది.

***

వర్షం తగ్గిపోయింది. కారుమేఘాలు ఖాంగాయ్ పర్వత శ్రేణి వదిలి పెట్టి దూరంగా తొలగిపోయాయి. వర్షపు నీరంతా చిన్న చిన్న వాగుల రూపంలో మృదు మధుర శబ్దాలు చేస్తూ కొండల మీది నుంచి క్రిందికి దూకుతున్నది.

వర్షానికి బెదిరి పొదలలో కాలక్షేపం చేసిన అడవి జంతువులన్నీ ఒకటొకటిగా బయటకు వచ్చి, సూర్యకిరణాల వేడిలో చలికాచుకుంటున్నాయి.

చలికి కొంకర్లు పోయిన అవయవాలను స్వాధీన పరుచుకుంటూ, బద్ధకంగా లేచి వళ్ళు విరుచుకున్నాడు షాడో.

అనుకోకుండా అతని హృదయంలో ప్రవేశించింది ఒక ఆలోచన. గబగబా ఒక పొద దగ్గిరికి పోయి ఆరు అడుగుల పొడవున్న లావాటి కొమ్మ విరిచి దాన్ని డాగర్ సహాయంతో బాణా కర్రలా నునుపుగా చెక్కాడు.

బరిశెను విసురుతున్న దృఢకాయుడి బొమ్మ దగ్గిర నిలబడి, అతను బరిశెను పాయింట్ చేస్తున్న దిశలో కర్రను ఎత్తి శక్తినంతా వుపయోగించి విసిరాడు.

జావలిన్ మాదిరి రివ్వుమని శబ్దం చేస్తూ గాలిలోకి లేచిందా బాణా కర్ర. ఏటవాలుగా క్రిందికి దిగి నడుము ఎత్తున వున్న బండరాళ్ల మధ్యలోకి పోయి అదృశ్యమైపోయింది.

అటు అడుగులు వేసిన షాడోకు, ఆ రాళ్ళను ఆనుకొని వున్న రాతి గోడల్లో ఒక మనిషి పట్టేటంత ఇరుకు సందు ఒకటి కనిపించింది.

దారి కాదు అది. ఎవరైనా చూస్తే-అదేదో పగులు అనుకుంటారు. పురుగు పుట్రా వుంటాయని దాని సమీపాల్లోకి కూడా పోరు.

బరిశెను విసిరే బొమ్మ సూచిస్తున్న మార్గం అదేనన్న పిచ్చి నమ్మకంతో క్రిందపడిన బాణాకర్ర భుజాన వేసుకొని ఆ యిరుకు సందులో దూరాడు షాడో.

స్ట్రెయిట్‌గా నడవటం అసాధ్యమయింది. అడ్డం తిరిగి అడుగులు ప్రక్కకు వేయాల్సి వచ్చింది. రెండు వందల గజాల దూరం అలాగే అతికష్టం మీద ప్రక్కకు జరిగాడు.

యబ్రప్ట్‌గా ఎండ్ అయింది ఆ సందు. ఎదురుగా అందమైన కొండలోయ ఒకటి ప్రత్యక్షమయింది.

ఆ లోయ మధ్యలో కోనేరు వుంది. దాని వడ్డున రాతిలో మలచిన చిన్న మండపం- ఆ మండపం చుట్టూ రకరకాల ఫలవృక్షాలు పెరిగివున్నాయి.

కోనేటిలోని నీరు కొబ్బరి నీటిగా తియ్యగా వుంది నోరు వూరించే సువాసనలు వెదజల్లుతున్నాయి కొమ్మలను క్రిందికి వంచుతున్న ఫలాలు.

ఆకలి దప్పికలను అణుచుకొని మండపంలోకి అడుగుపెట్టాడు షాడో. అది మలచబడి ఎన్ని వందల సంవత్సరాలు అయిందో కాని, యిసుమంత కూడా చెక్కుచెదరలేదు. మండపం మధ్యగా వున్న చిన్ననేల మాళిగలో షాడో కంట పడింది- ప్రపంచంలో ఎంతోమంది కావాలని వెతికి వెతికి వేసారిపోయిన చంఘీజ్ ఖాన్ సంపద.

కళ్ళు మిరుమిట్లు గొలుపుతున్న ఆ సంపదను చూసి, ఏం చెయ్యాలో అర్థంకాక మండపం మెట్ల మీద కూర్చున్నాడు షాడో.

సిగిరెట్ సిగిరెట్ అని గోల ప్రారంభించింది అతని అంతరంగం. ఉన్న సిగిరెట్లన్నీ ఏనాడో ఖతం అయిపోయాయి.

అటూ యిటూ చూసి, నాలుగు ఎండు ఆకుల్ని ఏరి చుట్టమాదిరిగా చుట్టి, జేబులో వున్న లైటర్ సాయంతో నిప్పు ముట్టించాడు.

పొగ గొంతులోకి పోగానే నిప్పులు పడినట్లు మంట ఎత్తి కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి. అయినా వదలకుండా రైలింజన్ మాదిరి గుప్పు గుప్పున పొగను పీలుస్తూ, ఆ మండపంలో పచార్లు చేయటం ప్రారంభించాడు.

అదే సమయంలో -ఒక గద్ద ఆకాశంలో గిరికీలుకొడుతూ అటుగా వచ్చింది. కోనేటి ప్రక్కన వున్న చెట్లమీద వాలటానికి ప్రయత్నించి- మండపంలో వున్న షాడోని చూడగానే వికృతంగా అరుస్తూ గాలిలోకి లేచి పారిపోయింది.

చేతిలోని ఆకుల చుట్టను అవతలికి విసిరి- దాని వెనక సాలోచనగా చూశాడు షాడో. ఎందుకలా ప్రయత్నించింది అది? మనిషిని చూసి బెదిరి పోవాల్సిన అవసరం దానికి మనిషి మూలకంగా దానికి ఏదైనా ప్రమాదం

ఏర్పడటం వల్లనే అది అలా ప్రవర్తిస్తోంది. తనవల్ల దానికి అపకారం జరగలేదు. మరి ఎవరివల్ల జరిగింది? కనులు చిట్లిస్తూ- ఆ గద్ద లోయలోకి వచ్చినప్పుడు అనుసరించిన మార్గంవైపు చూశాడు. లోయ చుట్టూ ప్రహరీ గోడల్లా నిలబడివున్న రాతిపలకలు... దిక్కుల్లో కొంచెం చిందర వందర అయినట్లు కనిపిస్తున్నాయి.

మండపం మెట్లమీద పడేసిన బాణాకర్రను అందుకొని అటు అడుగులు వేశాడు షాడో. నునుపుగా వున్నాయి రాతి పలకలు. చాలాసేపు గాలించిన మీదట కనిపించిది మరొక సన్నటి సందు.

దాంట్లో దూరి వందగజాల దూరం పోయాడు షాడో. అక్కడితో ఎండ్ అయిపోయిందది. వెనక్కు తిరగకుండా బాణా కర్రను నేలకేసి నొక్కి... పట్టి - అంగుళం అంగుళం చొప్పున పైకి లేచాడు. పది అడుగుల దూరంపోగానే కొంచెం వెడల్పు అయింది ఆ యిరుకు సందు. అక్కడి నుంచి మరికొంచెం తేలికగా పైకి ప్రాకాడు.

ఐదు వందల అడుగుల ఎత్తుకు చేరుకోగానే- అవతలి ప్రక్కవున్న కొండగుట్టలు కనిపించాయి. మోకాళ్ళ మీద జరుగుతూ రాతిపలకల చివరి భాగానికి పోయాడు. వాటి పై భాగంలో పెరిగివున్న పొదల సాయంతో మెల్లిగా ఆవలి వైపుకు దిగి--- నేలమీద అడుగుపెట్టాడు.

ఎగుడు దిగుడుగా, చిన్న గుహలతో నిండి వున్నదా ప్రదేశమంతా, ఒక గుహ ముఖద్వారంలో నుంచి నీలం రంగు పొగలు బయటికి వచ్చి ఆకాశంలోకి ఎగబ్రాకుతున్నాయి.

బాణాకర్రను భుజంమీద వేసుకొని అటు వెళ్ళాడు షాడో. ఆ గుహముందు పెద్ద చెట్టు ఒకటి నిలబడివుంది. దాని చుట్టూ రౌండ్లు కొడుతున్నది లోయలో షాడోకు కనిపించిన గ్రద్ద.

దాని జోడీని ఎవరో చంపినట్లున్నారు... అందుకే వికృతంగా అరుస్తూ... తిరుగుతున్నది.

గ్రద్ద ప్రవర్తనకు అర్థాన్ని తెలుసుకోగానే అడుగుల వేగాన్ని తగ్గించుకున్నాడు షాడో. బెల్టు వెనుకవున్న రివాల్వర్ మీద చేయి వేయబోతుండగా---

"హండ్సప్!" అంటూ ఒక బండచాటు నుంచి యివతలికి వచ్చాడు తుగ్రల్.

అతని వెనుకనే ప్రత్యక్షమయ్యారు అతని అనుచరులందరూ. వారికి కొంచెం వెనుకగా బండల చాటున కూర్చుని వున్నారు టెమూ, లులూ, మిరెల్లాలు. కరూబా ఎక్కడా కనిపించటం లేదు.

షాడోని చూడగానే ముందుకు దూకబోయిన పిల్లల్ని చేయి పట్టుకొని ఆపింది మిరెల్లా.

"మిస్టర్! దాగుడు మూతలు అంతం అయిపోయాయి. నా తమ్ముడు బైకాల్‌ని చంపినందుకు తగిన శిక్ష అనుభవించ బోతున్నావ్ నువ్వు. నీ రివాల్వర్‌ని క్రిందపడేయ్." వికృతంగా నవ్వుతూ అన్నాడు తుగ్రల్.

ఎడమచేతిని వెనక్కు పోనిచ్చి, బెల్టులో వున్న రివాల్వర్‌ని క్రిందికి వదిలాడు షాడో. ఒక క్షణంలో పదో వంతు కాలం తుగ్రల్ చూపులు ఆ రివాల్వర్ మీదికి ప్రసరించాయి.

మెరుపులా కదిలాడు షాడో. భుజంమీద బాణాకర్రను గిర్రున ముందుకు తెచ్చి, అతని మణికట్ల మీద మోదాడు.

చేతులు విరిగినంత పని అవగా...బాధగా అరిచి రైఫిల్ ని జారవిడిచాడు తుగ్రల్.

బాణాకర్రను బర్రున తిప్పుతూ అతని అనుచరుల మధ్యకు దూసుకుపోయాడు షాడో.

"చంపండి... చంపండి..." బిగ్గరిగా అరిచి బెల్టులో వున్న రివాల్వర్ ని బయటికి లాగాడు తుగ్రల్.

ధన్ మని గర్జించింది అతని అనుచరుడి చేతిలో వున్న రైఫిల్ ఒకటి.

విమానపు ప్రొఫెల్లర్ల కంటే వేగంగా తిరుగుతున్నది షాడో చేతిలోని బాణాకర్ర. చిన్న సూదిని అతని మీదికి విసిరినా... క్రికెట్ బాల్ ని కొట్టినట్లు అవతలికి చెదరకొట్టేసే వరస అది.

తుగ్రల్ అనుచరుడు ప్రయోగించిన బుల్లెట్, బాణా కర్రకు తగిలి షార్ప్‌గా రిఫ్లెక్ట్ అయింది. "అబ్బా!" అని అరిచి భుజం పట్టుకొని కూలిపోయాడు అది తగిలిన మరొక అనుచరుడు.

అదిరిపడి రివాల్వర్ ని క్రిందికి దించాడు తుగ్రల్.

"అతన్ని చుట్టు ముట్టండి... అతని చేతిలోని కర్రను వూడలాక్కోండి..." అని అరిచాడు.

ముందుకు రాబోయిన అతని అనుచరులు బాణాకర్ర చేస్తున్న శబ్దాన్ని గమనించి బిత్తరపోయి వెనక్కు వదిగారు.

"తుగ్రల్! నువ్వో ముఠాకి నాయకుడివి...చాలా బలం కలవాడివి. ఇద్దరం ఎదురుపడి అటో యిటో తేల్చుకుందామా?" బాణాకర్ర వెనుకనుండి ప్రశ్నించాడు షాడో.

"రివాల్వర్స్?" వింతగా ప్రశ్నించాడు తుగ్రల్.

"యస్ రివాల్వర్సే... బెల్టులలో దోపుకొని సిగ్నల్ ఇవ్వగానే బయటకు లాగుదాం. ఎవరు నేర్పరో వాళ్ళు బ్రతుకుతారు..." సమాధానం యిచ్చాడు షాడో.

"రేయ్... మీరంతా దూరంగా పొండిరా.." సంతోషంగా తన అనుచరులను హెచ్చరించాడు తుగ్రల్.

ఇష్టం లేకపోయినా అతన్ని దాటి అవతలకు పోయారు వారందరూ.

రివాల్వర్ లోని బుల్లెట్లను పరిశీలించి బెల్టులో దోపుకున్నాడు తుగ్రల్. క్రిందపడిన షాడో రివాల్వర్‌ని ఎత్తి ముందుకు విసిరాడు.

చేతిలోని బాణాకర్రను అవతలికి విసిరి ఆ రివాల్వర్ గాలిలో వుండగానే అందుకున్నాడు షాడో.

ఆ మరుక్షణం వేగంగా బయటికి వచ్చింది తుగ్రల్ రివాల్వర్. వికటంగా నవ్వుతూ షాడో కేసి గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కాడు.

ఇటువంటిదేదో జరుగుతుందని అనుకుంటూనే వున్నాడు షాడో. అందుకే తన రివాల్వర్ చేతుల్లోకి వచ్చిన వెంటనే ప్రక్కకుదూకి నేల మీద బోర్లాపడ్డాడు. తుగ్రల్ ప్రయోగించిన బుల్లెట్ అతని ముందుపడి మట్టిని ముఖంనిండా విరచిమ్మింది. రెండో బుల్లెట్ బుగ్గను రాచుకుంటూ చొక్కా కాలర్ మీదుగా అవతలికి పోయింది.

రివాల్వర్‌ని స్టెడీగా పట్టుకొని గురి చేశాడు షాడో.

మూడవ బుల్లెట్‌ని షాడో కనుబొమ్మల మధ్యకు పంపాలని ప్రయత్నిస్తున్నాడు తుగ్రల్.

"ఖాఖాన్ సూసీల మరణానికి ప్రతీకారం చేస్తున్నాను" అన్నాడు షాడో.

లిప్తకాలం తుగ్రల్ చేయి కంపించింది.

చెవులు చిల్లులుపడే శబ్దంతో నిప్పుల్ని వర్షించింది షాడో రివాల్వర్.

సూటిగా పోయి తుగ్రల్ కంఠంలో దిగబడింది దాని బుల్లెట్.

మొదలు నరికిన చెట్టులా విరుచుకు పడిపోయాడు తుగ్రల్.

"చంపండి... ఆ దుర్మార్గుణ్ని చంపండి..." అంటూ తమ ఆయుధాలను గురిపెట్టారు దూరంగా పోయిన అతని అనుచరులు.

అంతవరకూ కామ్ గా కూర్చున్న టెమూ... సుడిగాలిలా ముందుకు పరిగెత్తుకు వచ్చాడు. షాడో ప్రక్కనే పడి వుంది తుగ్రల్ చేతినుంచి జారిపోయిన రైఫిల్. దాన్ని అందుకొని బారెల్ని వారివైపు త్రిప్పాడు.

"ఆగు టెమూ... ఆగు..." అంటూ అతని చేతిని పట్టుకున్నాడు షాడో.

అప్పటికే ఆయుధాలను క్రిందపడవేసి చేతుల్ని గాలిలోకి ఎత్తుకున్నారు తుగ్రల్ అనుచరులు.

ఒక బండచాటున కూర్చుని రైఫిల్‌తో వారిని కవర్ చేస్తున్న కరూబా నవ్వుతూ యివతలికి వచ్చాడు.

"మొత్తానికి పచ్చపాము బిడ్డడని అనిపించాడు టెమూ... రైఫిల్ అంత ఎత్తులేడు దాన్ని ప్రేల్చి ఆ దెబ్బను కాచుకునేవాడా?" అంటూ అతని చేతిలోనుంచి రైఫిల్‌ని తీసుకుని ఇవతలికి వచ్చిన మిరెల్లాకు అందించాడు.

"ఇప్పుడేం చేయదలుచుకున్నారు?" తుగ్రల్ అనుచరుల ఆయుధాల నన్నిటినీ వశబరచుకొని వారిని కాలి నడకన కొండ క్రిందికి పంపించి - మిరెల్లా కరూబాల వైపు తిరుగుతూ ప్రశ్నించాడు షాడో.

కరూబా వంక ఓరగా చూసి సిగ్గుతో తలవంచుకున్నది మిరెల్లా.

"చంఘిజ్ ఖాన్ నిధి ఏమయిందో మాకు అంతబట్టలేదు. మిరెల్లా దారి మర్చిపోయింది. ఆ దారిని వదిలి నా దారికి వస్తానంటున్నది..." చిరునవ్వుతో అన్నాడు కరూబా.

"మరి నీ దారి ఏమయింది ?" అడిగాడు షాడో.

"నా దారి ఏమిటి?"

"నన్ను అనుసరించి టెమూ, లులూలకు ఎటువంటి ఆపదా రాకుండా చూసే బాధ్యత నీ మీద పెట్టింది మంగోలియన్ సి.ఐ.డి. శాఖ. ఆ దారిని గురించి అడుగుతున్నాను నేను."

కరూబా ఆశ్చర్యానికి అంతులేకపోయింది...

"నీ ప్రవర్తన నాకు మొదటినుంచీ అనుమానాన్నే కలిగిస్తోంది. మిరెల్లాని పిల్లల్ని తుగ్రల్ కి అందకుండా అవతలికి తీసుకుపోవటంతో అది మరింత బలపడింది... ఇక్కడ నువ్వు కనిపించకపోయేసరికి ధైర్యం చేసి తుగ్రల్ అనుచరులను ఎదిరించాను. నువ్వు యీ సమీపాల్లోనే వుంటావని నాకు తెలుసు..." అంటూ తను బాణాకర్రతో మొండిగా తుగ్రల్ అనుచరులను ఎదిరించిన కారణాన్ని వివరించాడు షాడో.

కరూబా ఒక సి.ఐ.డి. షాడోకు రక్షణ కలిగించే పని మీదే బయలుదేరాడు. అతను సి.ఐ.డి. అని తెలిసే - మిరెల్లాకు రక్షణగా అతన్ని పంపించాడు యూకా.

పొదల మధ్యలో పడిన పూలను ఏరుకొచ్చి మిరెల్లాకు యిచ్చింది లులూ. ఆమె వాటిని మాలకట్టి లులూ సిగలో అలంకరించింది.

"మిస్టర్ షాడో! నాదో చిన్నకోరిక..." దూరంలో నల్లగుర్రం మీద ఎక్కి సవారి చేస్తున్న టెమూను చూస్తూ అన్నాడు కరూబా.

"మిరెల్లా నేను వివాహం చేసుకుని టెస్సీలో స్థిరపడి పోతున్నాం. మాకు, యూకా దంపతులకు కాలక్షేపం కావాలి... లులూ టెమూల మీద విపరీతమైన మమకారం చూపిస్తున్నాడు యూకా. ఈ పిల్లల్ని మా దగ్గిర వుంచగలవా... మా ఖాఖాన్ పిల్లలు మా మంగోలియాలోనే వుండాలని మా కోరిక! మీ దేశం పోయి విదేశీయులవటం మాకు, మా ప్రభుత్వానికి యిష్టం లేదు..."

మిరెల్లాను ఒక్క క్షణం కూడా వదిలి పెట్టకుండా వెంటతిరుగుతున్నది లులూ.

టెమూ తన భయాలను అధిగమించి మామూలుగా మారిపోయాడు. వారికి ఆప్తుల అండ దొరికింది.


వారం రోజుల తర్వాత టెస్సీ పట్టణాన్ని చేరుకొన్నారు వారందరూ. మిరెల్లా కరూబాలకు వివాహం నిశ్చయమైంది. ఆ మరునాడే ఎవరికీ చెప్పకుండా మాయమైనారు షాడో- టెమూ- లులూలు.

ఆశ్చర్యాందోళనతో తడబడిపోయారు మిరెల్లా-కరూబాలు. యూకా అడ్డుపడి ఆపకపోతే వారు పిల్లల్ని వెతకటానికి బయలుదేరేవారే.

సరిగ్గా ముహూర్తం యింకో గంటలో వుందనగా తిరిగి వచ్చారు షాడో టెమూ, లులూలు. వారి వెనుక పాతిక అశ్వాలమీద వచ్చిన చంఘీజ్ ఖాన్ నిధిని చూసి నిర్ఘాంతపోయారు టెస్సీ వాసులు.

ఆ సంపదనంతా కరూబాకు స్వాధీనం చేసి... ఆ రాత్రే ఇండియాకు బయలుదేరాడు షాడో.

జైహింద్


GUNS IN THE NIGHT
MADHU BAABU